
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 137

బుధవారం 1-2-2023



చివరి టి20కి సిద్ధం

నేడు అహ్మదాబాద్‌లో భారత్, కివీస్ మధ్య మూడో టి20 మ్యాచ్ - 12లో



బడ్జెట్ బడిలో యువతేజం

బడ్జెట్ తీరుతెన్నులు, విశేషాలు తెలుసుకోవడంపై యువత ఆసక్తి - 11లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మన బడ్జెట్.. ప్రపంచానికి ఆశారేఖ

అంతర్జాతీయంగా ప్రతికూల ఆర్థిక పరిస్థితులున్నా.. దేశ బడ్జెట్ సామాన్యుల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

వివరాలు 6లో ▸



ఆశారామ్‌కు జీవితఖైదు

బాబా ఆశారామ్ బాపూను అత్యాచారం కేసులో దోషిగా తేల్చి.. జీవిత ఖైదు విధిస్తూ గాంధీనగర్ కోర్టు తీర్పు చెప్పింది.

వివరాలు 6లో ▸



14 మంది అగ్నికి ఆహుతి

జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలో ఓ భవనంలో మంటలు చెలరేగడంతో చిన్నారులు, మహిళలు సహా 14 మంది సజీవ దహనమయ్యారు.

వివరాలు 6లో ▸



విమానంలో అనుచిత ప్రవర్తన

అబుదాబి నుంచి ముంబై వస్తున్న విస్తారా విమానంలో ఓ ఇటలీ మహిళ.. సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఏపీలో విద్యారంగం అద్భుతం



ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా స్ఫూర్తిదాయకమైన విద్యా కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయని ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసించారు. విద్యారంగంలో నమ్మశక్యం కాని పురోగతిని తీసుకొచ్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వివరాలు 3 ▸

పరిశోధనల్ని ప్రోత్సహించాలి



విశ్వవిద్యాలయాలు బోధనలకు మాత్రమే పరిమితమవుతూ.. పరిశోధనలకు దూరంగా ఉండటం బాధాకరమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహించాలని దక్షిణ భారతదేశ ఉప కులపతుల సమావేశంలో ఆయన సూచించారు.

వివరాలు 14 ▸

నయనానందకరం నృసింహుని కల్యాణం

అసంఖ్యాకంగా తరలివచ్చిన భక్తులు.. నేటి మధ్యాహ్నం 2 గంటలకు రథోత్సవం

- వివరాలు 14లో



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షురాలు దేవయానీ ఘోష్, అసోచామ్ అధ్యక్షుడు సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా, మంత్రి అమర్‌నాథ్

పెట్టుబడులతో రండి

ఇన్వెస్టర్లకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం వైఎస్ జగన్

- సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నంబర్ వన్.. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్లుంటే ఏపీలో 3 అభివృద్ధి చేస్తున్నాం
- పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు.. ఎలాంటి అసౌకర్యం కలిగినా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉంటాం
- ఢిల్లీలో పారిశ్రామికవేత్తలతో సన్నాహక సదస్సులో సీఎం భరోసా
- మార్చి 3, 4వతేదీల్లో విశాఖలో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఆహ్వానం

2 లో

"విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతోంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని మీ అందరినీ కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఏపీలో పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం

- మౌలిక సదుపాయాలు.. అనుమతుల్లో ఆంధ్రప్రదేశ్ భేష్
- వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధుల వెల్లడి.. తమ వ్యాపారాన్ని ఏపీలో విస్తరిస్తామని, పరిశ్రమలు నెలకొల్పుతామని స్పష్టీకరణ

2 లో

ఈ దశాబ్దం భారత్‌దే

వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 6.8 శాతం లోపు

2025-26 నాటికి రూ.410 లక్షల కోట్లకు..

- ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో ఉపాధి ఇతోధికం.. తగ్గుతున్న నిరుద్యోగం
- సాగులో సంస్కరణలు అవసరం
- వడ్డీ రేట్ల పెరుగుదల పెట్టుబడులకు అవరోధం కాదు

13 లో

వెల్లడించిన ఆర్థిక సర్వే-2023



జనాకర్షకమేనా!

నేడే కేంద్ర బడ్జెట్

6లో

పేదరికం లేని భారత్



2047కల్లా సాకారమే ప్రభుత్వ లక్ష్యం

తొలిసారి ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

కేంద్రంలో నిర్భీతితో కూడిన సుస్థిరమైన, నిర్ణాయక ప్రభుత్వముంది. విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అతి పెద్ద శత్రువైన అవినీతిపై రాజీ లేని పోరాటం చేస్తోంది.

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

6లో

• రైతు భరోసాపై మడతలు కాదు..

చంద్రబాబుకు రామోజీ చిడతలు!!

- నాడు ఎన్నికలకు 3 నెలల ముందు బాబు 'అన్నదాత సుఖీభవ'
- ఈ పథకం కింద రైతుకు తలా రూ.15 వేలిస్తామంటూ జీవో
- కానీ రూ.4 వేలతో సరిపెట్టిన తీరు.. అందులో సగం కేంద్రానివే
- అప్పుడు బాబు చర్యలను శెభాషంటూ మెచ్చుకున్న 'ఈనాడు'
- ఎన్నికల ముందు రూ.12,500 చొప్పున ఇస్తానని జగన్ హామీ
- గెలిచాక దాన్ని రూ.13,500కు పెంచి.. చిత్తశుద్ధితో అమలు
- ఈ మూడున్నరేళ్లలో రైతుల ఖాతాల్లోకి రూ.25,971.33 కోట్లు

3 లో



90 అడుగుల వాసవీ మాత పంచలోహ విగ్రహం

పెనుగొండ క్షేత్రంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

పెనుగొండ: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి మాత జన్మస్థలమైన పెనుగొండ క్షేత్రం మంగళవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో 102 రుషి గోత్ర మందిరంలో 90 అడుగుల పంచలోహ వాసవీ మాత విగ్రహ ప్రతిష్టాపన నాలుగో వార్షికోత్సవం కనులపండువగా నిర్వహించారు. మహోత్సవాలు ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. తమిళనాడు, కర్నాటక, కేరళ, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నుంచి 90 అడుగుల పంచలోహ విగ్రహానికి, మరకత శిల విగ్రహానికి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి కృష్ణానంద పురి స్వామీజీ పర్యవేక్షణలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు, ఉమ దంపతులు పూజలు నిర్వహించారు.

10 లక్షల ముత్యాలతో మహా అభిషేకం

పంచలోహ విగ్రహానికి 10 లక్షల ముత్యాలతో చేసిన మహా అభిషేకం ఆకట్టుకొంది. డెప్యూటీ స్పీకర్ కలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రి సిద్దా రాఘవరావు తనయుడు సుధీర్, ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజులు, ఉమ దంపతులు, ఇతర ఆర్య వైశ్య ప్రముఖులు ప్రత్యేక క్రేన్‌పై వాసవీ మాత విగ్రహానికి ముత్యాల అభిషేకం నిర్వహించారు.

అలరించిన గ్రామోత్సవం

వాసవీ శాంతి ధాం ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామోత్సవం అలరించింది. మంగళవారం సాయంత్రం 108 కలశాలు, ప్రత్యేక కోలాట భజనలతో ఏనుగు అంబారీపై, వెండి రథంపై నిర్వహించిన వాసవీ మాత, గ్రామోత్సవం అలరించింది. బాణసంచా కాల్పులు, బుట్టబొమ్మల విన్యాసాలు, మంగళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఇతర రాష్ట్రాల భక్తులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వాసవీ భక్తులు పాల్గొని జై వాసవీ.. జైజై వాసవీ నామస్మరణతో నినదించారు.

క్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తా : డిప్యూటీ స్పీకర్

చారిత్రక ప్రసిద్ధి చెందిన పెనుగొండ క్షేత్రంలోని వాసవీ శాంతి ధాం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో రూ.2.70 కోట్లతో నిర్మించిన నిత్యాన్నదాన భవనాన్ని, 102 వాసవీ రుషీ గోత్ర మందిరంలోని చలువరాతితో నవీకరించిన ఫ్లోరింగ్‌ను మాజీ మంత్రి సిద్దా రాఘవరావు తనయుడు సిద్దా సుధీర్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజు, ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ డెప్యూటీ స్పీకర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ కృష్ణానంద పురి స్వామీజీ పాల్గొన్నారు.

ఈసారైనా కేంద్రం కరుణించేనా!

- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపులపై గంపెడు ఆశలతో ఎదురుచూపు
- కోవిడ్‌తో భారీగా ఆదాయం కోల్పోయిన ఏపీ.. జాతీయ సంస్థలకు, వెనుకబడిన జిల్లాలకు నిధులపై ఆశలు
- కొత్త వైద్య కళాశాలలకు కేటాయింపులు ఉంటాయా?
- ఇప్పుడైనా విభజన ఏడాది రెవెన్యూ లోటు భర్తీ చేస్తారా?

- వివరాలు 14లో

వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు కొత్త జాబ్ చార్ట్

అత్యాధునిక పరికరాలతో సర్వేలు.. రెవెన్యూ శాఖ ఉత్తర్వులు



10 లో

'సీలేరు'కు సర్వం సిద్ధం

- విశాఖ జిల్లా పార్వతీనగర్ వద్ద 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్
- అనుమతులు రాగానే న్యాయ సమీక్ష.. అనంతరం టెండర్లు

14 లో



గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అసోచామ్ ప్రెసిడెంట్ సుమంత్ సిన్హా, వివిధ సంఘాల ప్రతినిధులు



సీఎంతో పారిశ్రామికవేత్తల సెల్ఫీలు

పెట్టుబడులతో రండి

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం జగన్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. వివిధ దేశాల దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతోపాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ సన్నాహక సదస్సుకు హాజరయ్యారు.



గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, నాస్కామ్ ప్రెసిడెంట్ దేవయాని ఘోష్, అసోచామ్ ప్రెసిడెంట్ సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ జేఎండీ సుచిత్ర ఎల్లా, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీ అధికారులు జవహర్ రెడ్డి, కరికాలవలవన్, సృజన

అత్యుత్తమ సౌకర్యాలు



'విశాఖపట్నంలో మార్చి 3, 4వతేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. దీనికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటులో మీకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాం. ఏ పారిశ్రామికవేత్తకైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని కూడా హామీ ఇస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రారంభోపన్యాసంతో పాటు సదస్సు చివరలో ఏపీలో పెట్టుబడులకు గల సానుకూలతలను సీఎం వివరించారు. 'విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతుంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో పెట్టుబడులకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం. సమ్మిట్‌కు హాజరు కావాలని మీ అందరినీ వ్యక్తిగతంగా కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి' అని సీఎం జగన్ సూచించారు.

శరవేగంగా అనుమతులు.. చౌకగా సదుపాయాలు



పరిశ్రమలకు అనుమతుల విషయంలో రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం అమలులో ఉందని సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని, శరవేగంగా అనుమతులివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అనుకూలంగా ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, విద్యుత్తు, నీటి సదుపాయం లాంటివి దేశంలో మిగిలిన ప్రాంతాల సగటు కంటే చాలా తక్కువగా, సరసమైన ధరలకే అందిస్తున్నట్లు వివరించారు.

రెన్యువబుల్ ఎనర్జీ విషయంలో ఏపీలో పుష్కలమైన వనరులు ఉన్నాయని, 33 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులకు అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే 14,680 మెగావాట్ల ప్రాజెక్టులకు సంబంధించి కేటాయింపులు జరిగాయని, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీలో ఆంధ్రప్రదేశ్ కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. పెట్టుబడులకు సంబంధించి ఏపీలో వివిధ రంగాల్లో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వివరిస్తూ రూపొందించిన వీడియోను సదస్సులో ప్రదర్శించారు.

ఏపీలో అనుకూలతలు ఇవీ..

పెట్టుబడులకు ఆంధ్రపదేశ్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు మిగిలిన రాష్ట్రాల కంటే భిన్నమైనవని సన్నాహక సదస్సులో సీఎం జగన్ తెలిపారు. ఈ సందర్భంగా అపార పెట్టుబడుల అవకాశాలను సోదాహరణంగా ముఖ్యమంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు గురించి మీరే (ప్రతినిధులు) ఇంతకుముందు చెప్పారని గుర్తు చేస్తూ పెట్టుబడులతో ముందుకొచ్చేవారికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్రమోదీకి సీఎం జగన్ ధన్యవాదాలు తెలియచేశారు.

11.43 శాతం జీఎస్‌డీపీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, అగ్రగామిగా నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. పరిశ్రమల స్థాపనకు మేం చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తోనే నెంబర్‌వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. తద్వారా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామిక వేత్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంత అనుకూలంగా ఉందో స్పష్టమవుతోంది.

- ✔ రాష్ట్రానికి 974 కిలోమీటర్ల పొడవైన సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉంది. 6 పోర్టులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటికి అదనంగా మరో నాలుగు పోర్టులను నిర్మిస్తున్నాం. 6 విమానాశ్రయాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మూడు పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నాం. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటవుతుంటే అందులో ఏపీలోనే మూడు కారిడార్లను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి, పారిశ్రామిక వేత్తలకు ఏ స్థాయిలో ప్రోత్సాహం ఇస్తున్నామో తెలియచేసేందుకు ఇదే నిదర్శనం.
- ✔ రాష్ట్రంలో 48 రకాల ఖనిజాల లభ్యత ఉంది. ఇవన్నీ వివిధ ఖనిజాధార పరిశ్రమల ఏర్పాటుకు ఉపయుక్తంగా ఉన్నాయి.
- ✔ రాష్ట్రంలో పలు ఇండస్ట్రియల్, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లున్నాయి. వీటిలో ప్రధానంగా టాయ్ క్లస్టర్లు, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్, సిమెంట్ క్లస్టర్లు, మెడికల్ డివైజెస్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్, ఫార్మా, ఆటోమొబైల్ క్లస్టర్లు సిద్ధంగా ఉన్నాయి.
- ✔ ఏపీ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. పరిపాలనపరమైన విషయాల్లో కూడా మిగిలిన రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉంది. ఏపీని మన రాష్ట్రంగా భావించండి.
- ✔ అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూటర్ అవార్డు (పోర్ట్ లెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్) ఈటీ–2022, బెస్ట్ స్టేట్ ఫర్ ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ ఎనర్షియా అవార్డు– 2022, క్రాప్ అచీవర్ అండ్ లాజిస్టిక్స్ ఈజ్ (లీడ్స్ 2022 రిపోర్ట్) తదితర అవార్డులు ఏపీకి లభించాయి. ఇవన్నీ రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలమైన వాతావరణాన్ని వెల్లడిస్తున్నాయి.

పెట్టుబడులకు ఏపీ స్వర్గధామం

మౌలిక సదుపాయాలు.. అనుమతుల్లో ఆంధ్రప్రదేశ్ భేష్

కోవిడ్ సమయంలో ఏపీ సహకారం మరువలేనిదని కితాబు

గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధుల వెల్లడి

తమ వ్యాపారాన్ని ఏపీలో మరింత విస్తరిస్తామని, కొత్త పరిశ్రమలు నెలకొల్పుతామని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల కల్పన, అనుమతుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం భేష్ అని గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో వివిధ కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు ప్రశంసించారు. దేశంలోనే వ్యాపార పెట్టుబడులకు ఏపీ స్వర్గధామంలా ఉందని కీర్తించారు. ఏపీ అందిస్తున్న సహకారంతో వ్యాపార విస్తరణకు, కొత్త వ్యాపార కార్యకలాపాలకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు వారు వెల్లడించారు. విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు సందర్భంగా న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సదస్సులో వివిధ ప్రఖ్యాత కంపెనీల సీఈఓలు, ప్రతినిధులు మాట్లాడారు. కోవిడ్ వంటి కఠినతర పరిస్థితుల్లోనూ ఏపీ అందించిన సహకారం మరువలేనిదంటూ కొనియాడారు. ఈ సదస్సులో ఎవరెవరు ఏమన్నారంటే..



గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్, మంత్రులు అమర్‌నాథ్, రాజేంద్రనాథ్, వివిధ సంఘాలు, వివిధ దేశాల ప్రతినిధులు

ప్రపంచస్థాయి కార్ల ఉత్పత్తికి ఏపీ సహకారం

రాష్ట్రంలో కియా నిర్వహణకు వనరుల మద్దతుతో పాటు ఆటోమోటివ్ బెల్ట్ చైన్‌ను అభివృద్ధి చేయడం, పెంపొందించడంలో ఏపీ ప్రభుత్వం కీలకమైన చర్యలు తీసుకుంది. ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్‌లతో సహా ప్రపంచ స్థాయి సౌకర్యాలతో కార్ల ఉత్పత్తికి ప్రభుత్వం మాకు సహాయం చేసింది. కృష్ణపట్నం, చెన్నై వంటి ప్రధాన ఓడరేవులకు కనెక్టివిటీ సౌలభ్యంతో పాటు 95 దేశాలలో మా కార్లను విక్రయించడానికి వీలు కల్పించింది. కోవిడ్ సమయంలోనూ సురక్షితంగా కార్ల తయారీకి మాకు మద్దతిచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– టే జిన్ పార్క్, ఎండీ, కియా మోటర్స్, (కొరియా)

వ్యాపార విస్తరణకు దేశంలో ఏపీ ఉత్తమం

ఏపీతో భాగస్వామి కావడం మాకు గర్వకారణం. శ్రీసిటీలో మేం మా వ్యాపార యూనిట్లను ప్రారంభించినప్పటి నుండి ఏపీ చురుకైన మద్దతిస్తోంది. రూ.2,500 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టడం ద్వారా 6వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను సృష్టించాం. సంస్థలోని మెషీన్లు నడుపుతున్న ఆపరేటర్లలో 50శాతం మంది ఏపీలోని మారుమూల గ్రామాల మహిళలే ఉన్నారు. వీరే ఆసియా పసిఫిక్‌లో అత్యంత అధునాతనమైన ఫ్యాక్టరీని నడుపుతున్నారు. సంస్థలో 80శాతం మంది ఉద్యోగులు స్థానికులే. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కోకోను పెంచడంతో పాటు 3–4 వేల మంది రైతులను కోకో ఉత్పత్తిలోకి తీసుకొస్తున్నాం. ఇప్పటికే ఆరు ఆపరేటింగ్ యూనిట్లు ఉండగా, త్వరలో మరొకటి అందుబాటులోకి రానుంది. దేశం మొత్తంలోనే అత్యుత్తమ సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను తెచ్చినందుకు ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మేం దేశవ్యాప్తంగా వ్యాపారం చేస్తున్నా.. ఏపీ అత్యుత్తమం.

– దీపక్ ధర్మరాజన్ అయ్యర్, ప్రెసిడెంట్, క్యాడ్‌బరీ ఇండియా (యూఎస్‌ఏ)

పెట్టుబడులను రెట్టింపు చేస్తాం

ఇక్కడ రూ.1,000 కోట్ల పెట్టుబడితో రెండు వ్యాపార యూనిట్లు ప్రారంభించాం. అదే సమయంలో కోవిడ్ మొదలైంది. ఏపీ ప్రభుత్వ మద్దతుతో జూన్ 2020లో ఉత్పత్తిని మళ్లీ ప్రారంభించాం. 2030 నాటికి మా ప్రస్తుత పెట్టుబడిని రెండింతలు కంటే ఎక్కువ పెట్టడానికి ప్రణాళిక రూపొందించుకున్నాం.

– యమగుచి, ఎండీ, టోరే ఇండస్ట్రీస్ (జపాన్)

రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో దోహదపడాలని భావిస్తున్నాం

2006లో షూ తయారీ సంస్థను స్థాపించాం. రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్న తొమ్మిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభించాం. ఏపీ ప్రభుత్వ మద్దతు లేకుండా కంపెనీ విజయం సాధ్యంకాదు. ఎంఓయూపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంతకం చేస్తే ఇప్పుడు మేం పనిచేస్తున్నాం. అపాచీ ఇండియా–2 ప్రాజెక్టు కోసం మేమిప్పుడు ఏపీతో కలిసి పనిచేస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక వృద్ధిలో దోహదపడాలని భావిస్తున్నాం.

– సెర్గియో లీ, డైరెక్టర్, అపాచీ, గ్రూప్ (తైవాన్)

ఏపీ సహకారంతో మరింత విస్తరిస్తాం

ఏపీలో మేం గణనీయంగా అభివృద్ధి చెందాం. ఏపీ టీ ఉత్పత్తి చేసే రాష్ట్రం కానప్పటికీ, ఏపీపై నమ్మకం ఉంచాం. ఏపీలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేది గొప్పగా ఉంది. ప్రభుత్వం అందించిన సహకారంతోనే మేం ఇక్కడ యూనిట్లు ఏర్పాటుచేశాం. మా యూనిట్లలో 99శాతం మంది ఉద్యోగులు స్థానికులే. ముఖ్యంగా కోవిడ్ సమయంలో ఏపీ సర్కారు మాకు మద్దతుగా ఉన్నందుకు ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు. ఏపీలో ప్రభుత్వ సహకారంతో మరింత విస్తరించేందుకు ఎదురుచూస్తున్నాం.

– రోషన్ గుణవర్ధన, డైరెక్టర్, ఎవర్టన్ టీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఇటలీ)

ఏపీలో అసాధారణ మద్దతు

రెండు దశాబ్దాల్లో మేం రూ.12,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాం. కోవిడ్ సమయంలో ఏపీలో ఫ్యాక్టరీ ప్రారంభించాం. ఏపీ అసాధారణ మద్దతుతో మేం ప్రారంభించిన యూనిట్ అత్యంత సంపన్నమైన యూనిట్‌గా మారింది. ఇక్కడి ప్రజల ప్రతిభ, నిబద్ధతతో కూడిన పరిపాలనా యంత్రాంగం, రాజకీయ నాయకత్వం మేం మరింత విజయవంతమయ్యేందుకు తోడ్పడింది. దేశంలో పెట్టుబడులు పెట్టాలని ఎంచుకుంటే, ఏపీ స్వర్గధామంగా ఉంటుంది.

– ఫణి కుమార్, సీఎండీ, సెయింట్, గోబైన్ ఇండస్ట్రీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఫ్రాన్స్)



గ్లోబల్ ఇన్వెస్టర్ల సన్నాహక సదస్సు విందులో ముఖ్యమంత్రి జగన్, వివిధ దేశాల ప్రతినిధులు



బల్గేరియా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ దౌత్యవేత్తలతో సీఎం



యూఏఈ దౌత్యవేత్తతో ముఖ్యమంత్రి



దక్షిణ కొరియా దౌత్యవేత్తతో సీఎం జగన్



సెక్రటరీ ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ అసద్ సయ్యద్‌తో జగన్



ఫ్రాన్స్ దౌత్యవేత్తతో ముఖ్యమంత్రి

క్లుప్తంగా...

ఢిల్లీ నుంచి తాడేపల్లి చేరుకున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని మంగళవారం రాత్రి తాడేపల్లి చేరుకున్నారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు సన్నాహక సమావేశం కోసం ఆయన సోమవారం రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సు సన్నాహక సమావేశానికి హాజరయ్యారు. ఢిల్లీలో సాయంత్రం 6 గంటలకు బయలుదేరి రాత్రి 8.26 గంటలకు తాడేపల్లి చేరుకున్నారు.

63.87 లక్షల మందికి రూ.1,759.99 కోట్లు

- నేటినుంచి వలంటీర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీ
- ఇప్పటికే సచివాలయాల వారీగా నిధుల విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 63,87,275 మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి సామాజిక పింఛన్ల రూపంలో రూ.1,759.99 కోట్లను పంపిణీ చేయనుంది. ఈ మొత్తాన్ని ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వారీగా బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. బుధవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఒకటో తేదీ నుంచి ఐదురోజులు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.11.5 కోట్లతో 2 పాదరక్షల తయారీ కేంద్రాలు

- ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సహకార పథకాలపై సమీక్షలో మంత్రి నాగార్జున

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతులకు, యువకులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణతోపాటు వారి జీవనోపాధి మెరుగుపరిచేలా సహాయాన్ని అందిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆర్థికసాయంతో లిడ్‌క్యాప్ ద్వారా రూ.11.5 కోట్లతో ప్రకాశం జిల్లా రాచర్ల మండలంలోని యడవల్లి, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలోని వెల్లటూరు గ్రామాల వద్ద పాదరక్షల తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆర్థికసాయంతో అమలు చేస్తున్న పథకాల ప్రగతిని ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షించారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, పీఎం అజయ్ పథకాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. లిడ్‌క్యాప్ ద్వారా 300 మంది యువకులకు రూ.కోటి వ్యయంతో చర్మ వస్తువుల తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పీఎం అజయ్ పథకంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం చేసే ఎస్సీ రైతుల్లో 29,272 మందికికూడా సాయం చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చిన్నరాముడు, జనరల్ మేనేజర్ సునీల్‌రాజ్‌కుమార్, రైతుసాధికార సంస్థ సీఈవో రామారావు, స్త్రీనిధి సంస్థ ఎండీ నాంచారయ్య, లిడ్‌క్యాప్ ఎండీ డోలా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో కేసు ఉండగా విశాఖ రాజధాని అని ఎలా అంటారు?

టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి/టెక్కలి: రాజధాని కేసు సుప్రీంకోర్టులో ఉండగా విశాఖ రాజధాని అని సీఎం జగన్ ఎలా అంటారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అమరావతిని మార్చనని చెప్పి ఎన్నికలకు వెళ్లి గెలిచిన జగన్ ఇప్పుడు రాష్ట్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎంకు సంబంధించిన వారికి సమస్య వచ్చినప్పుడు దాన్ని డైవర్ట్ చేయడానికి కొత్త విషయాలను తెరపైకి తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర రాజధాని విషయంలో చట్టం చేసే అధికారం ప్రభుత్వానికి లేదని హైకోర్టు చెప్పిందని తెలిపారు. ఆయన మంగళవారం టెక్కలిలో మీడియాతో మాట్లాడారు. ఇటీవల పోలీసులను విమర్శించిన మాట వాస్తవమేనని, ఆ తర్వాత తన మాటను వెనక్కి తీసుకున్నానని తెలిపారు. వారాహి యాత్రను రాష్ట్రంలో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.

టీడీపీ వల్లే బీసీలకు నిజమైన స్వాతంత్య్రం

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెలో లోకేశ్

పలమనేరు/బైరెడ్డిపల్లి: బీసీలకు నిజమైన స్వాతంత్య్రం టీడీపీ వల్లే వచ్చిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా మంగళవారం చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లెలో బీసీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో బీసీలకు 90 శాతం సబ్సిడీపై రుణాలిచ్చామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యల కారణంగా త్వరలో కుల వృత్తులు కనుమరుగవడం ఖాయమన్నారు. తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతామన్నారు. లోకేశ్ పాదయాత్ర మంగళవారం పలమనేరు నియోజకవర్గంలోని కృష్ణాపురం టోల్‌గేట్ వద్ద మొదలై బైరెడ్డిపల్లి మండలంలోకి ప్రవేశించింది. పాదయాత్రకు జనం కరువయ్యారు. జనం రాకపోవడంతో టీడీపీ శ్రేణుల్లో నైరాశ్యం ఆవహించింది.

ఏపీలో విద్యారంగం అద్భుతం

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులపై ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసల జల్లు

- ప్రపంచంలో ఎక్కడాలేని స్ఫూర్తిదాయక విద్యా కార్యక్రమాలు ఇక్కడ అమలు
- టెన్త్ ఇంగ్లిషు పాఠ్య పుస్తకంలో తన జీవితగాథను చేర్చడంపై ఆనందం
- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- విద్యారంగ పురోగతికి వైఎస్ జగన్ మార్గదర్శకుడు అంటూ ప్రశంస
- ఎంతో మంచి పాలకుడు.. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది
- విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడిన తీరుతో నిక్ సంభ్రమాశ్చర్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం, ట్యాబ్‌ల పంపిణీ భేష్

■ ప్రపంచంలో ఎక్కడా జరగని విధంగా స్ఫూర్తిదాయకమైన విద్యా కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయి. విద్యారంగంలో నమ్మశక్యం కాని పురోగతిని తీసుకొచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు..

■ ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది.

(గుంటూరులో ప్రపంచ ప్రఖ్యాత ప్రేరణాత్మక వక్త నిక్ వుజిసిక్ ప్రశంసల వర్షం)

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు.. అందులో స్పష్టత, వారు అడుగుతున్న ప్రశ్నలకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ మంత్రముగ్ధులయ్యారు. 'ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది' అంటూ ఆయన ఫిదా అయ్యారు. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను నిక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థినులకు లక్ష్యసాధన, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముఖాముఖీగా మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు నగరంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన వేలాది మంది టెన్త్ విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపడుతున్న కార్యక్రమాలపై మరోమారు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉండటం అభినందనీయమంటూ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. అలాగే, 'నేను ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో పర్యటించా. కానీ ఏ దేశంలో లేని అనుభూతి, ప్రత్యేకతను నేను గుంటూరులో పొందాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఎంతోమంది నన్ను హీరో అని పిలిచి ఉండవచ్చు.. కానీ, అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇక్కడ పొందాను. వెలకట్టలేని విద్యకు, విజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు. ఎంతో మంచి పాలకుడు మీకు ఉన్నారు. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది. గుంటూరు ప్రాంతం విజ్ఞానం, విద్యపరంగా ఎంతో సామర్థ్యం ఉన్న ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా ఎందరినో కలిశాను. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎంతో కలవబోవడం ఎంతో ప్రత్యేకానుభూతిగా ఉంది'.. అంటూ నిక్ తన అనుభూతిని పంచుకున్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు..

ఇది సామాన్యమైన విషయం కాదు..

ఏపీలోని ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు నేను మాట్లాడిన ఫారిన్ ఇంగ్లిష్ భాషాశైలిని అర్థంచేసుకుని, అంతేస్థాయిలో ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడిన తీరు ఎంతో అద్భుతం. ఏపీలో ప్రభుత్వ పాఠశాలలు ఇంత గొప్పగా ఉంటాయని నేను ఊహించలేదు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ఒక ప్రభుత్వ పాఠశాల సకల హంగులతో ఉండటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను ఇంత గొప్ప ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు.

నా జీవితగాథపై పాఠ్యాంశమా!?

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 10వ తరగతి ఇంగ్లిషు టెక్స్ట్‌బుక్‌లోని మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో 'ఆటిట్యూడ్ ఆల్టిట్యూడ్' పేరుతో తన జీవితగాథను ముద్రించడం ఆశ్చర్యకరం. పాఠ్యాంశంగా నాకు చోటు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మీ పాఠ్య పుస్తకంలో రాసిన నా జీవితం గురించి చదివారా? (మీ గురించి చదివామని విద్యార్థులు చెప్పగా, ఆయన అంతులేని ఆనందానికి లోనయ్యారు.)


సభలో ప్రసంగిస్తున్న వుజిసిక్

నాడు-నేడుతో పాఠశాల రూపం మార్చేశారు..

నిక్ వుజిసిక్‌తో టెన్త్ విద్యార్థిని సాజిదా మాట్లాడుతూ.. 'నేను చిన్నతనం నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నాను. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయన చలువతో మా పాఠశాలలో అన్ని రకాల వసతులతో చదువుకుంటున్నాం. జగనన్న విద్యాకానుక కిట్లు, గోరుముద్ద, ఇంగ్లిషు మీడియంతో నేను ప్రస్తుతం విదేశాల నుంచి వచ్చిన మీతో ఆంగ్లంలో ఇలా మాట్లాడగలుగుతున్నాను.. వైఎస్ జగన్ కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటాను'. (ఆత్మవిశ్వాసంతో సాజిదా చెప్పిన మాటలకు నిక్ సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు.)

నాడు-నేడుతో 'కార్పొరేట్'ను తలదన్నేలా..

మరో విద్యార్థిని డి. శిరీష మాట్లాడుతూ.. 'ఇంగ్లిష్ టెక్స్ట్‌బుక్‌లో మీ బయోగ్రఫీ చదివి స్ఫూర్తి పొందా. ప్రపంచం మెచ్చే మోటివేషనల్ స్పీకర్‌గా ఎదిగిన తీరుతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. నాడు-నేడుకు ముందు ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎంతో దుర్భరంగా ఉండేది. సరిపడా తరగతి గదుల్లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అయితే, జగన్ మావయ్య సీఎం అయిన తరువాత నాడు-నేడు ద్వారా కల్పించిన వసతులతో మేం కార్పొరేట్ పాఠశాలలను మించిన స్థాయిలో ఆధునిక తరగతి గదులు, నూతన ఫర్నిచర్‌పై కూర్చుని తరగతి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ లైట్ల మధ్య ఏకాగ్రతతో చదువుకునేందుకు అవకాశం కలిగింది. జగనన్న విద్యాకానుక కిట్‌తో ఉచిత పాఠ్య పుస్తకాలు, బ్యాగులను పొందడంతో పాటు 8వ తరగతిలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబుల్లో నాణ్యమైన బైజూస్ కంటెంట్ లోడ్ చేసిన తీరు అద్భుతం'.. అంటూ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను శిరీష నిక్ దృష్టికి తెచ్చింది.

దేశంలోనే బెస్ట్ సీఎం వైఎస్ జగన్

ఇక సీఎం వైఎస్ జగన్ ఎంతో విజన్ కలిగిన నాయకునిగా దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారని నిక్ వుజిసిక్ అభివర్ణించారు. ఆ తర్వాత వేణుగోపాల్‌నగర్‌లోని కోన బాల ప్రభాకరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న డ్రాయింగ్ టీచర్ పుష్ప స్వయంగా గీసిన నిక్ చిత్రాన్ని ఆయనకు బహూకరించగా ఆయన ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు ఆర్. ధనుంజయరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.


సభలో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థిని ట్యాబ్‌ను పరిశీలిస్తూ.. పాఠ్యపుస్తకంలో నిక్‌పై పాఠం

కాలాన్ని ఎదిరించిన కాలు!

ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తిత్వ నిపుణుడు, ప్రేరణాత్మక వక్త నిక్ వుజిసిక్ రాసిన వ్యాసాలు అత్యంత ప్రాచుర్యం పొందాయి. ఆయన స్ఫూర్తిదాయక ప్రసంగాలు లక్షల మందిలో వెలుగులు నింపి కొత్త జీవితాన్ని ప్రసాదించాయి. టెట్రా అమీలియా సిండ్రోమ్ కారణంగా నిక్ కాళ్లు, చేతులు లేకుండా జన్మించినా నిక్ నైరాశ్యం చెందలేదు. అతి స్వల్పంగా ఉన్న ఎడమ తుంటి భాగం సాయంతో శరీరాన్ని బ్యాలెన్స్ చేసుకుంటారు. ఆయన మెల్‌బోర్న్‌లో పుట్టారు. 2002లో ఆస్ట్రేలియా నుంచి అమెరికా చేరుకుని అక్కడే స్థిరపడ్డారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా మారాలని నిర్ణయించుకుని 2005లో లైఫ్ వితౌట్ లిమిట్స్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. 2007లో ఆటిట్యూడ్ ఈజ్ ఆల్టిట్యూడ్ అనే మరో సంస్థను ప్రారంభించారు.

కొద్దిపాటి కాలుతోనే అన్నీ..

నిక్ కష్టాల గురించి తెలుసుకోవాలంటే పొద్దున్నే లేవగానే ఒళ్లు విరుచుకునేందుకు కాళ్లు చేతులు లేకపోవడం.. కాస్తంత దురదగా అనిపించినప్పుడు, ప్రేమగా కౌగిలించుకునేందుకు చేతులు లేకపోవడం ఎలా ఉంటుందో ఊహించుకోవాలి. 26 ఏళ్లగా ఆయన్ను ఇవేమీ ఆపలేకపోయాయి. ఫుట్‌బాల్, గోల్ఫ్‌తోపాటు ఈత, సర్ఫింగ్ లాంటివి ఆయన వ్యాపకాలు. అవయవ శేషంగా మిగిలిన కొద్దిపాటి కాలుతోనే ఆయన టైప్ చేస్తుంటారు. పెన్నుతో రాస్తుంటారు. ఏదైనా వస్తువులను తీసుకునేందుకు ఆసరాగా వినియోగిస్తుంటారు. తన కాలును ఆయన సరదాగా చికెన్ డ్రమ్‌స్టిక్ అని వ్యాఖ్యానిస్తుంటారు.

సాధారణ బడికే..

ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం నిర్వహించే స్పెషల్ స్కూళ్లకు కాకుండా సాధారణ పాఠశాలలకే పంపాలని తన తల్లిదండ్రులు తీసుకున్న కఠిన నిర్ణయం తనను రాటుదేల్చిందని నిక్ చెబుతుంటారు. నిక్ పుట్టగానే ఆస్పత్రిలో ఆయన్ను చూసిన తండ్రి షాక్ తిని వాంతి చేసుకున్నాడు. నాలుగు నెలల వయసు వచ్చే వరకు నిక్ తల్లి సైతం ఆయన్ను దరిచేర్చుకోలేకపోయారు.

- న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ ఆథర్
- ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రాచుర్యం పొందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు
- 2005లో యంగ్ ఆస్ట్రేలియన్ అవార్డు
- ద బటర్ ఫ్లై సర్కస్ షార్ట్ ఫిల్మ్‌లో నటనకు 2010లో ఉత్తమ నటుడిగా ఎంపిక.
- ప్రపంచ ఆర్థిక సదస్సు సందర్భంగా 2011లో స్విట్జర్లాండ్‌లో నిక్ ప్రసంగం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.
- 2012లో జీవిత భాగస్వామి కనే మియహరను కలుసుకున్నారు. వీరికి నలుగురు సంతానం.

ఏప్రిల్‌లోపే విశాఖ నుంచి పాలన

- అనేక ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నాయి
- వైవీ సుబ్బారెడ్డి వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: ఏప్రిల్ లోపే విశాఖ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించనున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మూడు రాజధానులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం సింహాచలంలోని గోశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధాని ఏర్పాటుకు భవనాల సమస్య రాదన్నారు. విశాఖలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, అదే విధంగా వీఎంఆర్‌డీఏ భవనాలు కూడా చాలా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను కూడా లీజ్‌కి తీసుకుంటామన్నారు. ఐటీ కంపెనీలు లిమిటెడ్‌గానే ఉన్నాయి కాబట్టి ఆ బిల్డింగ్స్‌ను కూడా అవసరమైతే రాజధానికి ఉపయోగించుకుంటామన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు పరిపాలనా వికేంద్రీకరణ అనేది జరిగి తీరుతుందన్నారు. సీఎం నివాసంలో కీలకంగా ఉండే నవీన్ అనే వ్యక్తితో పాటు పలువురికి సీబీఐ నోటీసులు ఇచ్చిందనేది పూర్తిగా అవాస్తవమని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు రాసింది సత్య దూరమని, కేవలం ఇది సీఎం వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సీఎం జగన్ ఇంట్లో గత 12 ఏళ్లుగా నవీన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సతీమణితో మాట్లాడాలంటే తనతోపాటు కుటుంబ సభ్యులందరూ నవీన్‌కే ఫోన్ చేస్తుంటామని వెల్లడించారు.

సీబీఐ విచారణ చేయాలి..

అవినాష్‌రెడ్డిని సీబీఐ విచారణ చేస్తున్న సమయంలో గదిలో అధికారులు మాత్రమే ఉంటారని, అలాంటప్పుడు లోపల జరిగిన సంభాషణ, విచారణ ఇదే అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాశాయన్నారు. లోపల జరిగిన విచారణ విషయాలను ఈ పత్రికలకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముందే మాట్లాడుకుని పార్టీపై నిందలా?

- కోటంరెడ్డి తీరుపై బాలినేని ఫైర్



నెల్లూరు (సెంట్రల్)/ఒంగోలు సబర్బన్: తెలుగు దేశం పార్టీలోకి వెళ్లేందుకు ముందుగానే చంద్రబాబుతో మాట్లాడుకుని వైఎస్సార్‌సీపీపై నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి నిందలు వేయడం సరికాదని మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. టీడీపీ వాళ్లతో మాట్లాడకుండా ఉంటే.. 2024లో రూరల్ నుంచి టీడీపీ తరఫున పోటీచేస్తామని ఏ విధంగా చెప్పగలవని ప్రశ్నించారు. పార్టీ మారాలనుకుంటే వెళ్లవచ్చని, కానీ సొంత పార్టీపై నిందలు వేసి వెళ్లడం సరికాదని చెప్పారు. ఆయన మంగళవారం నెల్లూరులోను, ఒంగోలులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మూడురోజులుగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటున్నారని చెప్పారు. కానీ రుజువులు చూపడం లేదన్నారు. ఏ ఆధారం లేకుండా నిందలు వేయడం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మరో పార్టీ నాయకుడితో ఫోన్‌లో మాట్లాడుకుని, అది బయటకు రాగానే ఫోన్ ట్యాపింగ్ అంటారా? అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపిస్తూ, మీడియాకు లీకులిస్తున్న కోటంరెడ్డి.. ట్యాపింగ్ జరుగుతోందని ఎప్పుడైనా సీఎం వైఎస్ జగన్‌కు చెప్పారా అని అడిగారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని గుర్తుచేశారు. ఎవరు ఉన్నా లేకున్నా పార్టీ స్ట్రాంగ్‌గా ఉందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీలో పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రామోజీ.. బడ్జెట్ గురించి తెలుసుకో :మంత్రి కాకాణి



నెల్లూరు (సెంట్రల్): ఈనాడు రామోజీకి విషయ పరిజ్ఞానం లేదని, రాష్ట్ర బడ్జెట్‌కు, కేంద్ర బడ్జెట్‌కు తేడా కూడా తెలియని స్థితిలో ఉండడం సిగ్గుచేటని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. రామోజీ ముందు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ల గురించి తెలుసుకోవాలని సూచించారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద చల్లాలని అభూత కల్పనలతో నీతిమాలిన రాతలు రాయడం పచ్చపత్రికలకు అలవాటైపోయిందని మండిపడ్డారు. చేతనైతే గత చంద్రబాబు ప్రభుత్వం పనితీరు, ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం తేడాలని విశ్లేషించే ధైర్యం ఉందా అని నిలదీశారు. తెలుగుదేశం హయాంలో వ్యవసాయం ఎంత అధ్వానంగా ఉందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. అర్హత ఉన్న ఒక్క రైతుకు కూడా రైతుభరోసా అందలేదని రాసే సాహసం రామోజీ చేయలేకపోయారని, దీన్నిబట్టి చూస్తే ఈనాడు కథనాలు అసత్యాలని స్పష్టంగా తెలుస్తోందని చెప్పారు.

రైతు భరోసాపై మడతలు కాదు.. చంద్రబాబుకు రామోజీ చిడతలు!!

చెప్పినదానికన్నా ఎక్కువ ఇస్తున్నా... రామోజీ మడతపేచీ రాతలు

- అందులో కేంద్రం వాటా కూడా ఉందంటూ అడ్డగోలు వాదన
- బడ్జెట్‌లో నిధులివ్వటం కేంద్రం బాధ్యత; వాటిని ఖర్చు చేసేది రాష్ట్రాలే
- కేంద్రం నిధులను ఏవో విదేశీ నిధుల్లా పేర్కొంటూ దుర్మార్గపు రాతలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర రైతాంగానికి ఈ ప్రభుత్వమిస్తున్నంతటి భరోసా గతంలో ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదనేది నిస్సందేహం. మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంతటి చిత్తశుద్ధితో రైతాంగానికి మేలు చేయటం లేదనేది కూడా వాస్తవం. అందుకే విత్తనాలు ఇవ్వటం నుంచి పండించిన పంటను విక్రయించుకునే దాకా రైతుకు సహాయంగా ఉంటూ చేయి పట్టి నడిపిస్తున్నారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. కాకపోతే ఈ బృహత్ యజ్ఞాన్ని 'ఈనాడు' ఏనాడూ ప్రశంసించలేదు. పైపెచ్చు ప్రతి పనిలోనూ రంధ్రాన్వేషణే పనిగా పెట్టుకుంది. ప్రతి ఏటా రూ.12,500 చొప్పున రూ.50 వేల సాయం చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి... అధికారంలోకి వచ్చాక ఆ హామీకన్నా మిన్నగా రైతు సంక్షేమానికి నడుం బిగించారు ముఖ్యమంత్రి. అందుకే మరో వెయ్యి అదనంగా జోడించి ఏడాదికి రూ.13,500 చొప్పున ఐదేళ్లలో రూ.67,500 ఇవ్వటానికి సంకల్పించారు. దాన్ని ఆచరణలో చేసి చూపిస్తున్నారు. ఏటా సగటున 52.38 లక్షల మంది రైతుల చొప్పున గడిచిన మూడేళ్లలో రూ.25,971.33 కోట్ల సాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. దీన్ని కూడా ఏనాడూ సానుకూలంగాంశంగా ప్రస్తావించని 'ఈనాడు'... 'రైతు భరోసాపై ఎన్ని మడతలో'... అంటూ చిత్రవిచిత్రమైన రాతలకు దిగటమే అసలైన దుర్మార్గం. 50 వేలిస్తామని చెప్పి రూ.67,500 చొప్పున ఇస్తుంటే... కోత పెట్టారని రాశారంటే రామోజీని ఏమనుకోవాలి? 42 శాతం నిధులను పీఎం కిసాన్ కింద కేంద్రమే ఇస్తోందంటే... అవి బడ్జెట్ ద్వారా రాష్ట్రానికిచ్చే నిధులే కదా? రాష్ట్రాల నుంచి పన్నుల ద్వారా సమీకరించిన మొత్తాన్ని బడ్జెట్ ద్వారా, పన్నుల్లో వాటాగా కేంద్రం రాష్ట్రాలకిస్తే... రాష్ట్రాలు వాటిని ప్రాధాన్యాల వారీగా ఖర్చుచేస్తాయి. ఈ మాత్రానికి కేంద్రమంటే ఏదో విదేశాల నుంచి తెస్తున్నట్టు ఎందుకీ దుర్మార్గపు రాతలు రామోజీరావు గారూ? రైతుకు ఇస్తామని చెప్పిన మొత్తం కన్నా దాదాపు 35 శాతం అధికంగా చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఒక్క అక్షరం ముక్క కూడా రాయని మీరు... లేనిపోని అవాస్తవాలతో జనాన్ని తప్పుదోవ పట్టించేలా రాయటం భావ్యమా?

చంద్రబాబు ఏం చేసినా రైటేనా?

2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు బేషరతుగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి... అన్నదాతల ఓట్లతో అధికారంలోకి వచ్చారు. కానీ ఆ తరవాత రుణమాఫీని పూర్తిగా అటకెక్కించేసినా 'ఈనాడు' ఏనాడూ ఒక్క అక్షరం కూడా రాయలేదెందుకు? అన్నదాతలను నమ్మించి మోసం చేయటం కరెక్టా? గద్దెనెక్కగానే రూ.87,612 కోట్ల రుణాలను మాఫీ చేస్తానని నమ్మించి... చివరకు రకరకాల ఆంక్షలతో కేవలం రూ.15వేల కోట్లతో రుణమాఫీ చేసేసినట్లుగా చెబితే... అది తప్పని, రైతులను మోసం చేయటమేనని ఎందుకు అడగలేదు? 2019లో ఎన్నికలు సమీపిస్తున్నాయనగా... 'అన్నదాత సుఖీభవ' పేరిట ఏటా రైతులకు రూ.15వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తానని చంద్రబాబు చెప్పినప్పుడు... అధికారంలో ఉన్నన్నాళ్లూ ఎందుకు చేయలేదని నిలదీయలేదేం? ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా... రూ.15 వేలు ఇస్తానని చెప్పి కూడా ఎన్నికలకు మూడు నెలల ముందు రైతులకు కేవలం రూ.4 వేలు చేతిలో పెట్టి, కౌలురైతులకు పూర్తిగా మొండి చెయ్యి చూపించినపుడు మీ పత్రిక ఏమైపోయింది? చంద్రబాబు ఇచ్చిన రూ.4వేలలో కూడా రూ.2వేలు కేంద్రానివే కదా? మరి అప్పుడేమైపోయింది మీ పాత్రికేయం? మరి ఇప్పుడెందుకీ మడతపేచీ రాతలు?

అన్నదాత సుఖీభవతో పోల్చి చూడొచ్చుగా?

సీఎం వైఎస్ జగన్ పాదయాత్ర చేస్తూ రైతుల కష్టాలను చూసి... తాను గెలిస్తే ఏటా రూ.12,500 చొప్పున ప్రతి రైతు కుటుంబానికి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీని చూసిన చంద్రబాబు... రైతుల ఓట్లు దక్కవేమోనన్న భయంతో ఎన్నికలకు 3 నెలల ముందు 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రకటించారు. ప్రతి రైతు కుటుంబానికీ రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తానంటూ 2019 ఫిబ్రవరి 17న జీవో–28ని జారీ చేశారు. జీవో ఇచ్చినా డబ్బులు మాత్రం ఇవ్వలేదు. దాన్ని పీఎం కిసాన్ సాయంతో ముడిపెట్టి తొలుత రూ.1000, ఎన్నికలకు నెల రోజుల ముందు రూ.3వేల చొప్పున జమ చేసి చేతులు దులుపుకున్నారు. ఇలా చెల్లించిన సొమ్ములో రూ.675 కోట్లు పీఎం కిసాన్ కింద కేంద్రం జమ చేసినవే కదా? మరి అప్పుడెందుకు ప్రశ్నించలేదు రామోజీరావు గారూ? బాబు మాదిరిగా భూ విస్తీర్ణంతో ముడిపెట్టకుండా... చివరికి 5 సెంట్ల భూమి ఉన్న రైతుకూ రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించటం ఏ తరహా పాత్రికేయం?

కౌలురైతులకూ పెట్టుబడి సాయం

ఇక సొంత భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రైతులకే కాదు... అటవీ (ఆర్వోఎఫ్ఆర్), దేవదాయ సాగుదారులకూ పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. నాడు కౌలురైతులకు కాదు కదా అటవీ, దేవదాయ భూ సాగుదారులకూ పైసా కూడా విదల్చలేదు చంద్రబాబు. కానీ గత మూడున్నరేళ్లలో 3,71,732 మంది కౌలుదారులు, 3,07,866 మంది అటవీ, దేవదాయ భూ సాగుదారులకు రూ.892.45 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించిందీ ప్రభుత్వం.

టీడీపీ హయాంలో... (2014-19... ఐదేళ్లలో)

ఎరువులు:-174.60 లక్షల టన్నులు (ఏటా సగటున 35 లక్షల టన్నులు)	రుణాలు:-397.89 లక్షల మందికి రూ.3.64 లక్షల కోట్లు	అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్: 46.75 లక్షల రైతు కుటుంబాలకు రూ.2,440.29 కోట్లు	వడ్డీలేని పంట రుణాలు: 40.60లక్షల మందికి రూ.685.46 కోట్లు
పంటల బీమా:-30.85 లక్షల మందికి రూ.3441.20 కోట్లు			

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో (2019-22 ... మూడున్నరేళ్లలో)

రాయితీ విత్తనం: 61.52 లక్షల మందికి రూ.1037.90 కోట్ల విలువైన 36.09 లక్షల క్వింటాళ్లు	ఎరువులు: 138.62 లక్షల టన్నులు (ఏటా సగటున 37 లక్షల టన్నులు)	రుణాలు: 403.17 లక్షల మందికి రూ.5.67 లక్షల కోట్లు)	రైతు భరోసా-పీఎం కిసాన్: 52.38 లక్షల రైతు కుటుంబాలకు రూ.25,971.33 కోట్లు
వడ్డీలేని పంట రుణాలు: 73.88 లక్షల మందికి రూ.1838.61 కోట్లు		పంటల బీమా: 44.28 లక్షల మందికి రూ.6684.84 కోట్లు	



“ఈ ప్రపంచం శాశ్వతమా; ఆత్మ, శరీరం ఒకటా లాంటి వివాదాలకు వాస్తవ జీవితంతో సంబంధం లేదు. కామక్రోధాలు అధిగమించి, సదాచరణ, ఆత్మజ్ఞానం, ఆంతరంగిక మనశ్శాంతికి తోడ్పడేవి కావు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, ఫిబ్రవరి, 1

వేయాల్సిన అడుగులు ఎన్నో...

దాదాపు 5 నెలలు... 135 రోజులు... 12 రాష్ట్రాలు... 2 కేంద్ర పాలిత ప్రాంతాలు... 75 జిల్లాలు... 4 వేల కిలోమీటర్లు... దేశానికి దక్షిణపు కొస నుంచి ఉత్తరపు కొస దాకా పాదయాత్ర... కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' (బీజేవై)కు అనేక లెక్కలున్నాయి. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికల్లో దెబ్బతిన్నాక, 2022 వేసవిలో ఉదయ్‌పూర్ 'చింతనా శిబిరం'లో ఆత్మవిమర్శలో పడ్డ కాంగ్రెస్ దూరమైన ప్రజలకు దగ్గర కావాలన్న 'నవ సంకల్పం'తో చేసుకున్న పాదయాత్ర ప్రతిపాదన ఎట్టకేలకు విజయవంతమైంది. విద్వేషాన్ని పెంచుతున్న బీజేపీకి విరుగుడు తామే అన్న పార్టీ చిరకాలపు మాటను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి తనకు తానే తరలిన ఆకాశంలా రాహుల్ నడక సాగించారు. కార్యకర్తల్లో ఉత్సాహంతో సారథిగా ఆయనను బలోపేతం చేసినా, సోనియా మార్కు పొత్తుల చతురత కనిపించని ఈ యాత్ర వచ్చే ఎన్నికల్లో ఏ మేరకు లాభిస్తుందన్నది ప్రశ్న. పార్టీ పునరుజ్జీవనానికి ఇదొక్కటీ సరిపోతుందా అన్నది అంతకన్నా కీలక ప్రశ్న.

2014 ఎన్నికల్లో కనిష్ఠంగా 44 సీట్లే గెలిచిన గ్రాండ్ ఓల్డ్ పార్టీకి 2017 డిసెంబర్‌లో అధ్యక్షుడై, ఆపైన 2019లో 52 సీట్లే తేగలిగిన నేతగా రాహుల్‌కు ఇది పరీక్షాకాలం. వదులుకున్న పార్టీ కిరీటాన్ని మరోసారి నెత్తినపెట్టాలని తల్లి సోనియా, సమర్థకులు ప్రయత్నించినా, యువరాజు దేశసంచారానికే మొగ్గుచూపారు. అసమ్మతి, పార్టీ నుంచి పెద్దల నిష్క్రమణలు పెరుగుతున్న నేపథ్యంలో పార్టీనీ, కార్యకర్తల్నీ ఒక్కతాటిపైకి తేవడానికీ, మరీ ముఖ్యంగా తన వెంట నడపడానికీ ఆయన అందుకున్న వ్యూహాత్మక అస్త్రం బీజేవై. ప్రాంతీయ పార్టీలు, మోదీ ప్రభంజనం మధ్య కాంగ్రెస్ నానాటికీ తీసికట్టుగా మారుతున్నప్పుడు ఆ పార్టీకి దశాబ్దాలుగా మూలస్తంభమైన కుటుంబానికి శ్రమదమాదులు తప్పవు. 'ఇది భారత్ జోడో కాదు, కాంగ్రెస్ జోడో' అని బీజేపీ ఆది నుంచి అల్లరి చేస్తున్నది అందుకే.

అయితే, మతం ఆసరాగా విభజన రాజకీయాలు విజృంభిస్తున్న వేళ... దేశమంతా 'కలసి పాడుదాం ఒకే పాట... కదలి సాగుదాం వెలుగుబాట' అంటూ ప్రేమ, సమైక్యతల రాగంతో రాహుల్ ముందుకు రావడం విస్మరించలేనిది. ఈ యాత్ర అనేక లోపాలతో నిండిన చిరు ప్రయత్నమే అయినప్పటికీ... వివిధ రాజకీయ, ఆర్థిక, సామాజిక వర్గాల్లో, నేతల్లో, మేధావుల్లో కాంగ్రెస్‌కు కొంత సానుకూలత తెచ్చింది. ప్రతి ఒక్కరితో సంభాషిస్తూ, పెరిగిన గడ్డంతో, సామాన్యుల్లో ఒకరిగా తిరుగుతున్న యువరాజుపై సదభిప్రాయమూ పెంచింది. విభజనకు అడ్డుకట్టగా భారతదేశపు మూలకందమైన భిన్నత్వంలో ఏకత్వపు ప్రేమను రాహుల్ భుజాన వేసుకోవడం దేశానికి చారిత్రక అవసరమనే భావన కలిగించింది. ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కీ ఇది అత్యవసరమే. అందుకే, సరైన సమయానికి భారత్ జోడో జరిగిందనుకోవాలి.

గత నాలుగేళ్ళలో మూడే అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగా గెలిచిన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో విజయం కీలకం. దాని మాటేమో కానీ, 75 ఏళ్ళ క్రితం భారత తొలి ప్రధాని నెహ్రూ శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌లో తొలిసారి జాతీయ జెండా ఎగరేసినచోటే, పాదయాత్ర ఆఖరి రోజున రాహుల్ కూడా పతాకావిష్కరణతో చెప్పినమాట చేసిచూపారు. ప్రతీకాత్మకమే అయినా ప్రజాబాహుళ్యంలోకి కాంగ్రెస్ అనుకున్న సందేశాన్ని పంపడానికి ఇది పనికొచ్చింది. అధికార బీజేపీపై సమరానికి ప్రతిపక్షాలన్నీ ఏకమవుతాయని చెప్పాలనుకున్న బహిరంగ సభ వ్యూహం మాత్రం ఆశించిన లక్ష్యాన్ని అందుకోలేదు. ఏకంగా 21 పార్టీల నేతల్ని కాంగ్రెస్ ఆహ్వానించినా, భారీ హిమపాతం సహా కారణాలేమైనా వచ్చింది ఒకరిద్దరే. ఇది నిరాశాజనకమే. పైగా, ఆమధ్య ఢిల్లీలో, మళ్ళీ ఇప్పుడు ఇలాగే జరిగి, ప్రతిపక్ష ఐక్యత మిథ్యేనని తేలిపోవడం మరో దెబ్బ.

వ్యక్తిగతంగా మాత్రం రాహుల్‌కు ఈ పాదయాత్ర కలిసొచ్చింది. 'నాన్ సీరియస్ పొలిటీషియన్', 'పప్పు' లాంటి ఎకసెక్కపు మాటల ఇమేజ్‌ను ఈ యువనేత తుడిచేసుకోగలిగారు. నడకలో పదుగురితో మమేకమై, ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకొనే ప్రయత్నం చేశారు. అయితే, పాదయాత్ర చేసినంత మాత్రాన ఓటర్లు వరాల వర్షం కురిపిస్తారనీ, సారథ్యం స్థిరపడుతుందనీ అనుకుంటే పొరపాటు. ప్రత్యామ్నాయ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్ళి, దేశానికి కొత్త దిశానిర్దేశం చేసినప్పుడే అవి సాధ్యం. సుదీర్ఘ యాత్రతో రాహుల్ మారిన మనిషయ్యారని ఒక విశ్లేషణ. ఆయన స్నేహశీలత జనానికి తెలియడమూ మంచిదే. హర్యానా సహా కొన్ని రాష్ట్రాల్లో ఆయన పాపులారిటీ పెరిగిందనీ సర్వేల సారం. కానీ, ఇప్పటికీ మోదీకి దీటుగా కాంగ్రెస్, రాహుల్ మారనే లేదన్నది నిష్ఠురసత్యం. దాన్ని సరిదిద్దుకొనేలా ఎలాంటి భవిష్యత్ కార్యాచరణ చేపడతారన్నది ఆసక్తికరం.

ప్రతిపక్ష కూటమికి దీర్ఘకాలం సహజ సారథి అయిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ స్థానానికి కూడా పోటీని ఎదుర్కొంటోంది. మోదీకి ప్రత్యామ్నాయం తామేనని చిత్రించుకొనేందుకు పలువురు ప్రాంతీయ సారథులు తొందరపడుతున్నారు. తమలో తాము తోసుకుంటున్నారు. ఈ అనైక్యతతో చివరకు పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీరుస్తుంది. ప్రతిపక్షాలు అది గ్రహించాలి. 2024 సార్వత్రిక ఎన్నికల లోగా ఈ ఏడాదే 9 రాష్ట్రాల అసెంబ్లీ పోరు ఉంది. ఈ ప్రయాణంలో పెద్దన్నగా కాంగ్రెస్ ఆచరణాత్మక దృక్పథంతో పట్టువిడుపులు చూపాలి. ప్రేమ పంచిన ప్రేమ వచ్చును అని కవి వాక్కు. 'మొహబ్బత్ కీ దుకాన్' పెట్టుకొని దేశం తిరిగిన పార్టీకీ, నేతకూ ఏం చేయాలో చెప్పనక్కర్లేదు. దేశం ఈ మూల నుంచి ఆ మూలకు ఒక పాదయాత్ర ముగిసిపోయి ఉండవచ్చు. కానీ, కాంగ్రెస్, రాహుల్‌లు నడవాల్సిన దూరం చాలానే ఉంది. వేయాల్సిన అడుగులు మిగిలే ఉన్నాయి.

పంపకంలో ప్రజలకు వాటా దక్కేనా?

విశ్లేషణ



డి. పాపారావు

నేడు దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. దేశంలో నెలకొని ఉన్న దశాబ్దాల రికార్డు స్థాయి నిరుద్యోగం, పెరిగిపోతోన్న కటిక పేదల సంఖ్య, నింగినంటుతోన్న ధరలు, పడిపోతోన్న దేశీయ ఆర్థిక వృద్ధి రేటు వంటి సమస్యల వలన నేడు ప్రజల దృష్టి, ఈ సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్ ఏమైనా చేయగలదా అనే దానిపై కేంద్రీకరించి ఉంది. ఏ బడ్జెట్ అయినా ఒక్కసారిగా, ఆ ఒక్క ఆర్థిక సంవత్సర కాలంలోనే సమస్యలన్నింటినీ పరిష్కరించేయలేదు. కానీ, అందుబాటులో ఉన్న వనరుల మేరకు ఆ దిశగా సాధ్యమైనంత మేరకు ప్రయత్నం చేయటం వీలయ్యేదే! ఆ పని తాజా బడ్జెట్ చేస్తుందా?

ఒక దేశం తాలూకూ బడ్జెట్‌ను, ఆ దేశంలోని సంపదను సృష్టించే ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం తదితర సామాన్య జనానికి మేలు చేసే విధంగానూ రూపొందించొచ్చు; ధనవంతులు, కార్పొరేట్లు లేదా ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే విదేశీ మదుపుదారుల ప్రయోజనాల కోసమూ రూపొందించవచ్చు. మన దేశీయ బడ్జెట్లు ఇప్పటివరకూ ఏ తరహాలో రూపొందాయి? దీనికి జవాబు సరళం. గతంలో మన బడ్జెట్లు, ప్రభుత్వ విధానాలు అందుబాటులో ఉన్న సంపదలో అత్యధిక వాటా దానిని సృష్టించిన ప్రజలకు పంపిణీ చేసి ఉంటే, నేడు మన దేశంలో 'కె' (ఆంగ్లాక్షరం కె ఆకృతిలో; ధనవంతులు పైకి, పేదలు కిందికి) తరహా తీవ్ర ఆర్థిక అసమానతల పరిస్థితి ఉండేది కాదు. ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నా మన దేశం పై స్థానంలో ఉండడం గమనార్హం. ఆర్థిక సంస్కరణల క్రమంలో సంపద సృష్టి జరిగింది. కానీ, ఆ సంపద సృష్టికర్తలకు చేతిలో మొబైల్ ఫోన్ మినహా దక్కిందేమీ లేదు. ఈ సంస్కరణలు తెచ్చిన ప్రైవేటీకరణ విధానాలు కనీస అవసరాలైన విద్య, వైద్యాలను ఖరీదైనవిగా మార్చేశాయి.

మొత్తంగా బడ్జెట్ల క్రమంలో లబ్ధి పొందింది – ఒక వైపున అంతర్జాతీయ (కొంతమేరకు దేశీయ) ఫైనాన్స్ పెట్టుబడిదారులు, మరోవైపున కార్పొరేట్ సంస్థలు మాత్రమే. ఈ రెండు తరహాల వారికీ మేలు చేసేందుకే – ప్రతీ బడ్జెట్‌లోనూ ద్రవ్యలోటును తగ్గించటం... అలాగే కార్పొరేట్లకు అనేకానేక రాయితీల వంటివి నిండుగా ఉంటాయి. ద్రవ్యలోటును ఆర్థిక వ్యవహారాలకు కేంద్ర బిందువుగా చేయటం ఎందుకోసం? సుమారుగా నాలుగు దశాబ్దాల క్రితం, అంటే 1980ల ముందర – ఈ ద్రవ్యలోటు అంశానికి అటు బడ్జెట్లలోనూ, ఇటు ఆర్థిక వ్యవహారాలలోనూ ప్రాధాన్యత లేదు. నాడు ప్రపంచంలోని మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలోనూ – 'కీన్స్' సిద్ధాంతాల ప్రాతిపదికన నడిచిన సంక్షేమ రాజ్యానిదే పెద్దపీట. నాడు ప్రభుత్వాల ప్రధాన బాధ్యత– దేశంలోని ప్రజల బాగోగులు కోరి... అలాగే కార్పొరేట్ల మనుగడకు కూడా అనుకూలమైన విధంగా – జన సామాన్యం తాలూకూ కొనుగోలు శక్తిని... అంటే మార్కెట్లో సరుకులు, సేవలకు డిమాండును కాపాడటం. ఈ పరిస్థితి 1980ల అనంతరం మారిపోయింది. సరుకులు, సేవలను ఉత్పత్తి చేసి లాభాలను పొందే కార్పొరేట్ సంస్థల ప్రాధాన్యత తగ్గి... గతంలో ఈ కార్పొరేట్ సంస్థల స్థాపనకూ, లేదా వాటి కార్యకలాపాల నిర్వహణకూ పెట్టుబడులను సరఫరా చేసే ఫైనాన్స్ పెట్టుబడులది పై చేయి అయ్యింది. అప్పటి వరకూ పారిశ్రామిక వ్యవస్థకు కేవలం వెన్నుదన్నుగా మాత్రమే ఉన్న ఫైనాన్స్ పెట్టుబడులు పూర్తిస్థాయిలో స్వతంత్రంగానూ... మరో మాటలో చెప్పాలంటే, ఉత్పాదక, పారిశ్రామిక పెట్టుబడుల కంటే శక్తిమంతంగానూ తయారయ్యాయి. ఈ క్రమంలోనే – షేర్ మార్కెట్లు, ఫైనాన్స్ వ్యాపారాలు (ప్రస్తుతం 'వెంచర్ క్యాపిటల్' అని పిలిచే



వాటితో సహా), రియల్ ఎస్టేట్ వంటి స్పెక్యులేటివ్ పెట్టుబడులది పై చేయి అయ్యింది. ఈ తరహా పెట్టుబడుల అవసరాల కోసం ముందుకు వచ్చిందే 'ద్రవ్యలోటు' ఉండరాదు అనే సూత్రీకరణ. దీనిలో భాగంగానే ప్రపంచంలోని దరిదాపు అన్ని దేశాల కేంద్ర బ్యాంకులకు ద్రవ్యోల్బణాన్ని ఒక నిర్దిష్ట స్థాయిలో అదుపులో ఉంచటం గురుతర బాధ్యత అయింది.

ద్రవ్యలోటు అధికంగా ఉండటమంటే, ప్రభుత్వం తాలూకూ ఖర్చులు దాని ఆదాయం కంటే అధికంగా ఉండటం అని. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉంటే ఆ అదనపు ఖర్చుకు అవసరమైన డబ్బును ప్రభుత్వం ముద్రించవలసి రావచ్చు లేదా అప్పుగా తెచ్చుకోవాల్సి రావచ్చు. దీని వలన వాస్తవ ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణీ పెరిగి– ద్రవ్యోల్బణం పెరుగుతుందనేది లెక్క. ద్రవ్యోల్బణం పెరగటమంటే... అనివార్యంగా ఆ దేశం తాలూకూ కరెన్సీ విలువ తగ్గుదలే. ఈ కరెన్సీ విలువ తగ్గుదల ఆ దేశీయ షేర్ మార్కెట్లలో లేదా ఇతరత్రా స్పెక్యులేటివ్ వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టినవారి లాభాల తాలూకు నికర విలువ తగ్గుదలకు దారితీస్తుంది. కాబట్టి ఈ ఫైనాన్స్ పెట్టుబడిదారులు – మన కరెన్సీ విలువ తగ్గరాదని కోరుకుంటారు. ఇది వారి లాభాలను కాపాడుకోవటం కోసం. దీని కోసం వారు మన ప్రభుత్వం ప్రజల అవసరార్థం వ్యయాలను పెంచుకోవడాన్ని అంగీకరించలేరు. కాబట్టి ఈ ద్రవ్యలోటు సిద్ధాంతకర్తలు – వివిధ దేశాల ప్రభుత్వాలు పొదుపు చర్యలను పాటించాలనీ, సాధ్యమైనంతగా ప్రజలకు లభించే సంక్షేమ పథకాలపై కోతలు పెట్టాలనీ కోరుకుంటారు.

ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తర్వాత మన పాలకులు కూడా ఈ ద్రవ్యలోటును లక్ష్మణరేఖగా ఆమోదించుకొని, దానికి లోబడే తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిరుద్యోగం, పేదరికం పెరగటం వంటి ఎన్ని సమస్యలు ఉన్నా మన ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పనా కార్యక్రమాలపై పెట్టే ఖర్చులను ఇంకా తగ్గిస్తూనే పోతోంది. దీనిలో భాగంగానే నేడు ఆర్థిక మాంద్యం లేదా మందగమన పరిస్థితులు ఉన్నా – ప్రభుత్వం మాత్రం బడ్జెట్లో తన ఆర్థిక లోటు లక్ష్యాన్ని ప్రస్తుతం ఉన్న 6.4 శాతం నుంచి 2024 ఆర్థిక సంవత్సరం చివరికి 5.9 శాతానికి తగ్గించటంగా చేసుకుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎరువుల సబ్సిడీలపై వేటు, ఆహార సబ్సిడీల కుదింపు వంటివి ఉండనున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సబ్సిడీలకు పాలకులు ఇప్పటికే మంగళహారతి పాడేశారు.

ఇక తరువాతిది కార్పొరేట్ పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వటం. ఇది గత 8 సంవత్సరాల బీజేపీ హయాంలో మరింత నిర్మొహమాటంగా వేగం పుంజుకుంది. 2019లో కార్పొరేట్ ట్యాక్సును భారీగా 10 శాతం మేర తగ్గించేశారు. దీని వలన ప్రభుత్వానికి సాలీనా 1.45 లక్షల కోట్ల రూపాయల ఆదాయం తగ్గిపోయింది. అలాగే, కార్మిక సంస్కరణల పేరిట – ఉద్యోగులు, కార్మికులు, గిగ్ వర్కర్ల వంటివారిని పిండి పిప్పిచేసి తమ లాభాలను పెంచుకొనేందుకు కార్పొరేట్లకు మరిన్ని దారులను తెరుస్తున్నారు. ప్రొడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్ పేరిట – ఉత్పత్తిని తగిన మేరకు పెంచిన కార్పొరేట్లకు రాయితీల పేరు చెప్పి లక్షల కోట్ల రూపాయలను ధారాదత్తం చేస్తున్నారు. ఇంత చేసినా వాస్తవంలో ఈ కార్పొరేట్ల నుంచి – ఇటు కొత్త పెట్టుబడుల రూపంలో గానీ, అటు అదనపు ఉపాధి కల్పన రూపంలో గానీ ఫలితం ఏమీ దక్కడం లేదు. వాస్తవ ఆర్థిక వ్యవస్థలో ప్రజల చేతిలో డబ్బు లేదనీ లేదా వారికి కొనుగోలు శక్తి లేదనే విషయాన్ని విస్మరిస్తూ... బడ్జెట్ తర్వాత బడ్జెట్‌ను మూస తరహాలో వేస్తూనే పోతోంది ప్రభుత్వం. హరిత ఇంధనానికి ప్రోత్సాహం, మౌలిక వనరులకు ఊతం వంటి పేర్లేవి చెప్పినా... అదంతా అంతిమంగా కార్పొరేట్లకు రాయితీలు, కానుకలుగా మాత్రమే ఉండిపోగలదు.

స్థూలంగా కాకులను కొట్టి గద్దలకు వేసే సరళిలో సాగుతోన్న ప్రభుత్వ విధానాలు రానున్న ఎన్నికల నేపథ్యంలో కాస్తంత కరుకుదనాన్ని తగ్గించుకున్నా – అవి పెద్దగా మారి ప్రజానుకూలంగా సంపదను పంపిణీ చేసే సాహసానికి దిగలేవు. సంవత్సరానికి ఒక రోజు ముందుకు వచ్చే ఈ బడ్జెట్ రోజునైనా లేకుంటే మిగతా 364 రోజులైనా జరుగుతోంది ఒకటే... అది జనం మీద భారాలు... కార్పొరేట్లు, ధనవంతులకు నజరానాలు! కాదూ కూడదంటే ఈ దేశంలోని కూలీ జనం కులీనులూ లేదా పన్ను చెల్లింపుదారుల పైసలను 'ఉచితాలుగా' దిగమింగేస్తున్నారంటూ ఎదురుదాడులు! ధనికుల, ధనస్వామ్య ఆరాధనలో... వినిమయ సమాజపు వస్తు వ్యామోహంలో పడి వాస్తవాలను చూడలేని దుఃస్థితిలో జన సామాన్యం కొనసాగినంత కాలం ఈ దగాకూ, దాని మనుగడకూ ఢోకా లేదు.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇది మోసమే!



మోకాలి నొప్పితో ఒక కార్పొరేట్ ఆస్పత్రి(ఢిల్లీ)కి వెళ్లాను. హిప్ ఫ్రాక్చర్ అయిందని డాక్టర్ చెప్పారు. కానీ ఎక్స్‌రే/సీటీ చూపించలేదు. టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ చేసుకునేలా ఒత్తిడి చేశారు. సెకండ్ ఒపీనియన్ తీసుకునే సమయం ఇవ్వలేదు. తర్వాత ఏ ఫ్రాక్చరూ లేదని తెలిసింది. నేను జనవరి 1న ఆరోగ్యంగా రన్నింగ్ చేస్తున్నాను. 31న నడవలేకపోయాను. ఆసుపత్రికి రూ.7,42,845 చెల్లించాను. ఈ డబ్బుతో వైకల్యం కొనుక్కున్నట్టు అయింది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

పెంచిన ఫలితం



ఆత్మాహుతి బాంబుదాడి చాలా తీవ్రమైన చర్య. ఎవరో ఒకరు ప్రాణం ఇస్తారు. అలాంటి వ్యక్తులు ముస్లింలు కాదని వాదించడం పూర్తిగా తప్పు. యూఎస్ఎస్ఆర్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా విత్తిన జిహాదీ సిద్ధాంతపు సహజ పరిణామం ఇది. అప్పుడు జిహాద్ అనేది రాజ్యం నుంచి పాఠశాలలకు ఔట్‌సోర్సు అయింది. ఇప్పుడు దాని ఫలితాలు కనబడుతున్నాయి.

– సయ్యద్ షబ్బార్ జైదీ, పాక్ ఆర్థికవేత్త

ద్వంద్వ వాదన



తాలిబన్లు అఫ్గానిస్తాన్‌ను బాంబులతో పేల్చుతున్నప్పుడూ, నిస్సహాయ అఫ్గాన్లను చంపుతున్న ప్పుడూ వాళ్లు ఇస్లాం కోసం పోరాడుతున్న ముజాహిదీన్లు అని పాకిస్తానీయులు అనేవాళ్లు. అదే తాలిబన్లు పాకిస్తాన్ లోపల ఆత్మాహుతి దాడులు జరుపుతుంటే వాళ్లను కూలీ సైనికులనీ, ఇస్లాంతో వారికి ఏ సంబంధం లేదనీ అంటున్నారు. ఎంత కపటం!

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

నివారణా మార్గాలు




పోలీసులు నేరాలను నివారించలేరు. అవి జరిగిన తర్వాత వాళ్లు వస్తారు. నేరాల నివారణ అనేది సామాజిక కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం, అవకాశాలను సృష్టించడం ద్వారా మాత్రమే జరుగుతుంది.

– మహమ్మద్ సఫా, యూఎన్ ప్రతినిధి

తెలుగులో చెప్పాల్సిందే! కానీ...

అభిప్రాయం



మంగారి రాజేందర్

అన్ని భారతీయ భాషల్లో సుప్రీం కోర్టు తీర్పులను అందుబాటులో ఉంచుతామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ గత వారం ఓ సభలో అన్నారు. భాషా అవరోధాన్ని కృత్రిమ మేధస్సు ఆధారంగా, దాన్ని ఉపయోగించుకొని అధిగమిస్తామని కూడా ఆయన అన్నారు. 'బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర, గోవా' ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ భారత పౌరులు అర్థం చేసుకునే భాషలో తీర్పులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.


సుప్రీం తీర్పులు ఇంగ్లిష్‌లో ఉండటం వల్ల ఆ తీర్పుల్లో ఏం రాశారో తెలుసుకోవటానికి చాలామంది దేశ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రజలే కాదు చాలామంది యువ న్యాయవాదులు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కృత్రిమ మేధస్సు అనువాదాలూ, అదే విధంగా ప్రభుత్వ అనువాదకులు చేసే అనువాదాలు కృతకంగా ఉండి... ప్రాంతీయ భాషలో చదువుకోవడం కన్నా ఇంగ్లిష్‌లోనే చదువు కోవడం మంచిదన్న అభిప్రాయానికి ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కూడా భారత ప్రధాని గ్రహించి ఈ అనువాదాలను సరిచూసేందుకు రిటైర్డ్ న్యాయమూర్తుల సహాయం తీసుకుంటామని కూడా అన్నారు.

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం 1960 లోని నిబంధన 3(2) ప్రకారం శాసన వ్యవస్థలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులూ, జారీ చేసే ఆర్డినెన్స్‌లూ, నియమాలూ, రెగ్యులేషన్స్‌నూ తెలుగులో ప్రవేశపెట్టాలి. ఈ చట్టం రెండు రాష్ట్రాలకూ వర్తిస్తుంది. నాకున్న సమాచారం ప్రకారం ప్రభుత్వం అదే విధంగా శాసన సభల్లో ప్రవేశపెడుతుంది. రాజ పత్రంలో ప్రచురితమవుతాయి. కానీ అవి ప్రజలకి అందుబాటులో ఉండవు. ఒకవేళ ప్రభుత్వం వాటిని అందుబాటులోకి తెచ్చినా అవి ఎవరికీ అర్థం కాని విధంగా ఉంటాయి. గొట్టు భాషలో ఉంటాయి. తెలుగులో ప్రావీణ్యం ఉన్న వ్యక్తులు కూడా అర్థం చేసుకోలేరు. ఉదాహరణకి 'ద ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఏక్ట్, 1958' (The probation of offenders Act, 1958)ను తెలుగులో అనువదించి ప్రచురించారు. ఈ చట్టానికి తెలుగు అనువాదం 'అపరాధుల పరిరక్షణ చట్టం, 1958'. చట్టం పేరు వరకు అనువాదం ఫర్వాలేదు. కానీ ఈ చట్టంలో ఉన్న 19 నిబంధనలను అర్థం చేసుకోవడానికి చాలా శ్రమించాల్సి వస్తుంది.

ఈ చట్టం ప్రభుత్వం ప్రకటించిన తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అనువాదం చేయడానికి అందులో చేసిన అనువాదం – "ఆ రాజ్య ప్రభుత్వం రాజీ పత్రంలో అధిసూచన ద్వారా నియతం చేయు తేదీన అమలులోకి వచ్చును". అదే విధంగా 'నిర్దేశించిన' అంటే ఈ చట్టంలోని నియమాల ప్రకారం నిర్దేశించిన అని రాయాల్సిన దానికి... 'విహిత పరచబడిన' అని అనువదించారు. అంటే ఈ చట్టం కింద చేయబడిన నియమావళి ద్వారా విహితపరచబడిన అని అర్థం. ఇది అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడవలసి వస్తుంది. 'నిబంధన' అన్న పదాన్ని 'పరిచ్ఛేదము' అనీ, 'గతంలో శిక్షపడిన' అన్న పదానికి గాను "పూర్వపు దోష స్థాపన జరిగిన' అనీ అనువదించారు. ఇట్లా చెప్పుకుంటూ పోతే చాలా గొట్టు పదాలు కనిపించి ఆ తెలుగు అనువాదాన్ని చదవడం మానేస్తారు. గ్రాంథిక వాసన లేని సరళమైన అనువాదాల ఆవశ్యకత ఎంతో అవసరం. తీర్పులు ప్రాంతీయ భాషల్లో రావడం సంతోషించదగ్గ పరిణామమే అయినప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగు తీర్పులు, అదీ ప్రాంతీయ భాషల్లో తీర్పులను తీసుకొని రావడాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ఈ రెండు సంఘటనలు భాషాభిమానులకు సంతోషాన్ని కలుగజేశాయి. ఇది ఇలా ఉంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చేపట్టిన ఈ చర్యల ద్వారా స్ఫూర్తి పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మరో అడుగు ముందుకు వేశారు. మొన్న రిపబ్లిక్ డే సందర్భంగా మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను కూడా త్వరలో తెలుగులో అందించడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. సామాన్యుడు తీర్పులను అర్థం చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తామని కూడా అన్నారు. సుప్రీంకోర్టు అడుగు జాడల్లో తాము నడుస్తామని కూడా ఆయన అన్నారు. ఇలాంటి భరోసా తెలంగాణ హైకోర్టు నుంచి రాలేదు. బహుశా వస్తుందని ఆశించవచ్చు.

ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తులు గుర్తించాల్సిన అంశం ఏమిటంటే – హైకోర్టు తీర్పులు తెలుగులో అనువాదం చేయడం ఎంత ముఖ్యమో, అంతకన్నా ముఖ్యం – జిల్లా న్యాయ వ్యవస్థలో తెలుగులో న్యాయపాలన జరగడం. హైకోర్టులలో తెలుగు భాషా వినియోగానికి అవరోధాలు ఉన్నాయి కానీ జిల్లా కోర్టుల్లో తెలుగు వినియోగానికి ఎలాంటి అవరోధాలూ లేవు. ఎలాంటి



అవరోధాలు లేనప్పటికీ తెలుగులో న్యాయపాలన జరగడం లేదు. జిల్లా కోర్టుల్లో తెలుగులో న్యాయపాలన జరిగే విధంగా చర్యలు ఉభయ హైకోర్టులూ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయం పట్ల రెండు హైకోర్టులూ తమ దృష్టిని కేంద్రీకరిస్తాయని ఆశించడం అత్యాశ కాదు.

తెలుగులో న్యాయపాలన జరగాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టును సంప్రదించి ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఆ జీవోల ప్రకారం... సివిల్, క్రిమినల్ కేసుల్లో తీర్పులను జిల్లాల్లో ఉన్న కోర్టులు వెలువరించవచ్చు. నాలాంటి ఒకరిద్దరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులను వెలువరించారు. నా తెలుగు తీర్పులకి వచ్చిన ప్రతిస్పందన చూసి మరికొందరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులను వెలువరించారు. నాలాంటి వ్యక్తులు పదవీ విరమణ చేసిన తరువాత ఆ స్ఫూర్తి పూర్తిగా కనుమరుగైపోయింది.

జిల్లా కోర్టుల్లో సాక్షుల విచారణ దాదాపుగా తెలుగులోనే జరుగుతుంది. వారు చెప్పిన విషయాలను ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేస్తారు. ఆ తరువాత తీర్పులు ఇంగ్లిష్‌లో వస్తాయి. తాము కేసు ఎందుకు ఓడిపోయామో – అవతలి వ్యక్తి కేసు ఎందుకు గెలిచాడో తెలియని పరిస్థితి. దీని వల్ల కోర్టుల మీద విశ్వసనీయత తగ్గే అవకాశం ఉంది.

హైకోర్టు కన్నా, కింది కోర్టులే ప్రజలకి దగ్గరగా ఉంటాయి. ఆ కోర్టులకే ప్రజలు ఎక్కువగా వెళ్తుంటారు. అక్కడ న్యాయపాలన తెలుగులో జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒక వ్యక్తి ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ మాతృ భాషలో ఉన్న వ్యక్తీకరణ ఇతర భాషల్లో ఉండదు. తెలుగులో హైకోర్టు తీర్పులు ఎంత అవసరమో జిల్లా కోర్టుల్లో తెలుగులో న్యాయపాలన జరగడం అంతకన్నా ముఖ్యం. భారత ప్రధాని, భారత ప్రధాన న్యాయమూర్తి ప్రాంతీయ భాషల్లో తీర్పులు వెలువరించడం గురించి శ్రద్ధ తీసుకుంటున్న సందర్భంలో ఉభయ రాష్ట్రాల్లోని ప్రధాన న్యాయమూర్తులు తెలుగులో న్యాయపాలన గురించి శ్రద్ధ తీసుకుంటారని ఆశిద్దాం.


తెలుగులో తీర్పులు చెప్పడంలో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. కానీ కాలక్రమంలో ఆ ఇబ్బందులను అధిగమించవచ్చు. జ్యుడీషియల్ అకాడమీ, అధికార భాషా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగులో న్యాయపాలన' సదస్సు జరిగి ఫిబ్రవరి 13వ తేదీకి పది సంవత్సరాలు వస్తాయి. అయినా తెలుగులో న్యాయ పాలన విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేను జ్యుడీషియల్ అకాడమీకి గెస్టు లెక్చర్లు ఇవ్వడానికి వెళ్లినప్పుడల్లా నెలకి రెండు మూడు తీర్పులు వెలువరించమని కోరుతున్నప్పటికీ ఆ దిశగా పురోగతి కనిపించడం లేదు. ఈ దిశగా హైకోర్టుల సూచనలు అత్యంత అవసరం. ఇప్పుడున్న నేపథ్యంలో అది ఎంతో దూరం లేదని అనిపిస్తుంది.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు । 94404 83001

ఎఱుక పిడికెడు ధనం

కార్యసాధనకు అంగబలం, అర్థబలం ఉండాలి అని చెపుతారు. ధనంతో సాధించేవి కొన్ని మాత్రమే. మనవాళ్ళు అనుకునే మనుషులు ఉంటే జరిగే పనులు ఎన్నో! మనుషులు ధనాన్ని సమకూర్చగలరు. ధనంతో మనుషులను కొనటం కష్టం. అందుకే 'ఎఱుక పిడికెడు ధనం' అనే మాట వాడుకలోకి వచ్చింది. ఏదైనా పని జరుపుకోటానికో, కొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడో విషయం తెలిసిన వారు... అంటే ఎఱుక కలిగినవారు ఎవరైనా ఉంటే బాగుండు అని అనుకుంటారు ఎవరైనా. కనీసం పరిచయస్తులు ఉంటే అదొక ధైర్యం. వారి నుండి ఆశించేది ఆర్థిక సహాయం కాదు. పని జరగటానికి కావలసిన సులువు. అదే జ్ఞానం! అంటే ఎఱుక. ఇక్కడ ఎఱుక అంటే మనకి పరిచయం ఉన్నవారు అనీ, విషయ పరిజ్ఞానం ఉన్నవారు అనీ రెండు అర్థాలు. విషయ పరిజ్ఞానం ఉంటే ఇంకా పని ప్రారంభించక ముందే సగం కార్యాన్ని సాధించినట్టు. వైద్యరంగంలో దానినే 'నిదానమే ప్రధానం' అంటారు. నిదానం అంటే రోగ నిర్ధారణ. రోగం తెలిస్తే మందు ఇవ్వటం తేలిక. ఏ రంగం అయినా అంతే! ఇదంతా లౌకిక వ్యవహారం. అసలు విషయానికి వస్తే..



జ్యోతిర్మయం

ఎఱుక అంటే జ్ఞానం, తెలిసి ఉండటం. ఏది తెలుసుకోవాలో అది జ్ఞానం. ఆ పై తెలుసుకోవలసినది మిగిలి ఉండదు. అదే ఆధ్యాత్మిక జ్ఞానం. ఏదైనా ఒక అంశాన్ని లోతుగా పరిశీలించుకుంటూ పోతే చేరేది భగవత్తత్త్వం దగ్గరకే. అదే వేదాంతం. అంటే వేదాలకి చివర ఉండేది. వేదాలు చిట్టచివరికి సారభూతంగా చెప్పేది దైవాన్ని గురించే. అందుకే ఏ రంగంలోనైనా విస్తృతంగా అధ్యయనం చేసి మూలాలకు వెళ్ళినప్పుడు ఇచ్చే డిగ్రీ 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ'. ఇక్కడ ఫిలాసఫీ అంటే తత్త్వశాస్త్రం. ఈ ఎఱుక పిడికెడు అంటే గుప్పెడు ధనం. మన శరీరంలో పిడికెడు ప్రమాణంలో ఉండేది గుండె. అది ప్రాణం రూపంలో దైవం ఉండే చోటు. అదే మాటను కృష్ణుడు చెప్పాడు కూడా. 'హృద్దేశే అర్జున తిష్ఠతి' అని భగవద్గీతలో కూడా చెప్పాడు. ఏ జీవికైనా అతి విలువైన ధనం ప్రాణమే కదా! ప్రమాణానికే కాదు పట్టుదలకూ, అందుబాటులో ఉండటానికీ కూడా పిడికిలిని ప్రతీకగా చెపుతారు.

– డాక్టర్ ఎస్. అనంత లక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.ఏకాదశి ప.3.39 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: మృగశిర తె.4.43 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి ఆరుద్ర, వర్జ్యం: ఉ.8.58 నుండి 10.43 వరకు, దుర్ముహూర్తం: ప.11.50 నుండి 12.35 వరకు, అమృతఘడియలు: రా.7.16 నుండి 9.01 వరకు, భీష్మ ఏకాదశి; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.50.

మహాశివరాత్రికి ప్రత్యేక ఏర్పాట్లు

- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ
- ఆదేశాలు జారీ చేసిన దేవదాయ శాఖ కమిషనర్

సాక్షి, అమరావతి: మహాశివరాత్రి నేపథ్యంలో ప్రముఖ శైవ క్షేత్రాలన్నింటిలో దేవదాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మహాశివరాత్రి రోజున రాష్ట్రంలో భక్తుల తాకిడి అత్యధికంగా ఉండే శ్రీశైలం, శ్రీకాళహస్తి, కోటప్పకొండ, మహానంది ఆలయాలకు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న నలుగురు అడిషనల్, రీజనల్ జాయింట్ కమిషనర్ స్థాయి అధికారులను ఒక్కొక్క ఆలయానికి ఒక్కొక్కరిని చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అడిషనల్ కమిషనర్ –1 చంద్రకుమార్‌ను కోటప్పకొండ ఆలయానికి, అడిషనల్ కమిషనర్ –2 రామచంద్రమోహన్ శ్రీకాళహస్తి ఆలయానికి, ఎస్టేట్స్ విభాగం జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్‌ను శ్రీశైల ఆలయానికి, కర్నూలు డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రాణా ప్రతాప్‌ను మహానంది ఆలయానికి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమిస్తున్నట్లు కమిషనర్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్రంలోని మిగిలిన శైవక్షేత్రాలకు సంబంధించి రెండు ప్రాంతాల ప్రాంతీయ జాయింట్ కమిషనర్లు (ఆర్‌జేసీలు) ఆయా ఆలయాల వారీగా తమ పరిధిలోని సీనియర్ అధికారులను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్లుగా నియమించాలని కూడా ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రయాణికులతో కళకళ



దొమెస్టిక్ టెర్మినల్

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెరుగుతున్న రద్దీ

- 2019–20లో దేశీయంగా 11,30,583 మంది ప్రయాణికుల రాకపోకలు
- కోవిడ్ కారణంగా 2020–21లో సగానికిపైగా తగ్గిన ప్రయాణికులు
- తరువాత క్రమంగా పెరుగుతున్న రాకపోకలు
- గతేడాదితో పోలిస్తే 2022–23లో 9 నెలల్లోనే భారీగా పెరిగిన ప్రయాణికులు

విమానాశ్రయం (గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం (గన్నవరం) ప్రయాణికులతో కళకళ లాడుతోంది. ఒకప్పుడు రోజుకు 56 దేశీయ విమాన సర్వీసులు, సగటున 3,300 మంది ప్రయాణికులతో ఈ విమానాశ్రయం కళకళలాడింది. కోవిడ్ పరిస్థితుల కారణంగా గత మూడేళ్లుగా తగ్గుముఖం పట్టిన ప్రయాణికుల రాకపోకలు క్రమంగా పుంజుకుంటున్నాయి. ముఖ్యంగా గత ఆరునెలల్లో దేశీయంగా ప్రయాణికుల వృద్ధి గణనీయంగా నమోదవుతోంది. ప్రస్తుతం రోజుకు సగటున 2,600 మందికిపైగా ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా ప్రస్తుతం ఉన్న సర్వీసులు పెంచడంతోపాటు కొత్త రూట్లలో సర్వీసులు అందుబాటులోకి వస్తే మరింత వృద్ధి సాధించే అవకాశం ఉందని ఎయిర్‌పోర్ట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

9 నెలల్లో 6,94,293 మంది ప్రయాణికుల రాకపోకలు

ఈ విమానాశ్రయం నుంచి 2019–20లో రికార్డు స్థాయిలో దేశీయంగా 11,30,583 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. అనంతరం కోవిడ్ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులతో పాటు ప్రయాణికుల రద్దీ తగ్గుముఖం పట్టడంతో ఆ సంఖ్య 2020–21లో 5,07,215 మందికి చేరుకుంది. 2021–22లో ప్రయాణికుల సంఖ్య 6,25,131 మందికి పెరిగింది. గతేడాదితో పోలిస్తే 2022–23లో తొలి తొమ్మిది నెలల్లోనే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఈ కాలంలో 6,94,293 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. నెలకు సగటున 77 వేలమందికిపైగా ప్రయాణికులు ఇక్కడి నుంచి దేశీయంగా రాకపోకలు సాగించారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు ప్రయాణికుల ట్రాఫిక్ పదిలక్షల మందికి చేరువయ్యే అవకాశం ఉందని ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి రావాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడికి రోజుకు సుమారు 18 విమానాలు వస్తుండగా, 18 విమానాలు వెళుతున్నాయి. న్యూఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, తిరుపతి, కడపకు డొమెస్టిక్ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే న్యూఢిల్లీ, హైదరాబాద్, బెంగళూరుకు సర్వీసులు పెంచాలని ప్రయాణికుల నుంచి డిమాండ్ వస్తోంది. గతంలో నడిపిన ముంబై, వారణాసి సర్వీసులను పునరుద్ధరించడంతోపాటు షిర్డీకి సర్వీసులు నడపాలని కోరుతున్నారు. ఈ సర్వీసుల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నుంచి పౌరవిమానయాన శాఖకు, ఎయిర్‌లైన్స్ సంస్థలకు కూడా ప్రతిపాదనలు వెళ్లాయి.



ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల రద్దీ

2021-22, 2022-23లో తొలి 9 నెలల్లో ప్రయాణికుల రాకపోకల వివరాలు

నెల	2021–22	2022–23
ఏప్రిల్	43,621	70,047
మే	16,228	68,749
జూన్	25,149	76,317
జూలై	39,901	78,948
ఆగస్టు	50,404	84,264
సెప్టెంబర్	48,035	77,295
అక్టోబర్	55,431	78,393
నవంబర్	61,868	77,479
డిసెంబర్	74,047	82,801

జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.123 కోట్లు

తిరుమల: జనవరిలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటింది. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుమల శ్రీవారికి హుండీలో రూ.123 కోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. జనవరి 2 తేదీన శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ ఆదాయం లభించింది. టీటీడీ చరిత్రలోనే ఇది అత్యధిక ఆదాయాల్లో రెండోది. గత ఏడాది నుంచి తిరుమల శ్రీవారి ఆదాయం ప్రతి నెలా రూ.వంద కోట్లు దాటుతుండడం గమనార్హం.

22 రోజుల శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స

- విజయవాడ జీజీహెచ్‌లో ఇఎన్‌టీ వైద్యుల నిర్వహణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): పుట్టుకతోనే కుడివైపు ముక్కులో మాస్ పెరుగుదల ఉన్న 22 రోజుల శిశువుకు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ జీజీహెచ్ ఇఎన్‌టీ విభాగ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆ శిశువుకు ఎముకల ఫైబ్రోమా వ్యాధిగా నిర్ధారించిన వైద్యులు, ఆస్పత్రిలో ఉన్న అత్యాధునిక ఎండోస్కోపీ పరికరంతో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి కుడి నాసల్‌లోని మాస్‌ను తొలగించారు. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునిక పరికరాలతో పాటు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండడంతో క్లిష్టతరమైన , అరుదైన శస్త్ర చికిత్సలను సైతం విజయవంతంగా నిర్వహించగలుగుతున్నారు. ముక్కులో మాస్‌తో ఇబ్బంది పడుతున్న శిశువును పాత ప్రభుత్వాస్పత్రి నుంచి ఇక్కడికి రిఫర్ చేయగా, ఆమెకు పుట్టుకతోనే ఉన్న వ్యాధి నిర్ధారించి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఇఎస్‌టీ విభాగాధిపతి డాక్టర్ రవి తెలిపారు. ఇఎన్‌టీ వైద్యులు డాక్టర్ లీలాప్రసాద్, డాక్టర్ ఆదిత్య, ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ టి సూర్యశ్రీ, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

హిందూధర్మానికి ఉనికి ఆదిశంకరాచార్యులే..

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి
- ఘనంగా ముగిసిన శారదాపీఠం వార్షికోత్సవాలు
- రాజశ్యామల అమ్మవారికి గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పూజలు



స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

సింహాచలం: హిందూ ధర్మానికి ఉనికి జగద్గురు ఆదిశంకరాచార్యులే అని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి చెప్పారు. శ్రీశారదాపీఠంలో ఐదురోజులుగా జరిగిన వార్షికోత్సవాలు మంగళవారం మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన శాస్త్ర, శ్రౌతసభల్లో స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడారు. ఆచార్యుల పేరుతో మధ్వాచార్యులు, రామానుజాచార్యులు ప్రచారం పొందినా ప్రపంచవ్యాప్తంగా ఆదిశంకరాచార్యులే తెలుసని చెప్పారు. శంకరాచార్య తత్వాన్ని కాపాడుతున్న శాస్త్ర పండితులతో ఏటా వార్షికోత్సవాల్లో శాస్త్ర, శ్రౌతసభలు నిర్వహిస్తున్నామని, బిరుదులిచ్చి స్వర్ణ కంకణధారణ చేస్తున్నామని తెలిపారు. హిందూధర్మం అంటే ఆలయాలు, అర్చనలే అని సామాన్యులు భావిస్తారని, కానీ శాస్త్రం ఉంటేనే హిందూధర్మం నిలుస్తుందని తమ పీఠం నమ్ముతుందని చెప్పారు. రాజశ్యామల యాగం అంటే వ్యాపారం కాదన్నారు. అంగదేవతలతో కూడిన హోమాలు ఇందులో ఉంటాయన్నారు. అమ్మవారి అనుగ్రహం ఉన్నవారే యాగంలో పాల్గొంటారని తమ పీఠం ఎప్పుడూ విశ్వసిస్తుందని పేర్కొన్నారు. యాగంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యేవారంతా అదృష్టవంతులన్నారు. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకు రాజశ్యామల కృపను పొందారని చెప్పారు. ఈ సందర్భంగా శాస్త్రసభలో ప్రతిభకనబరిచిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి వ్యాకరణ భాస్కర బిరుదు ప్రదానం చేసి స్వర్ణకంకణధారణ చేశారు. పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో జరిగిన ఈ సభలో షట్‌శాస్త్ర పండితులు విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, చిర్రావూరి శ్రీరామశర్మ, ఓరుగంటి రామ్‌లాల్, మణిద్రావిడ శాస్త్రి, ఆర్.కృష్ణమూర్తి శాస్త్రి, ప్రముఖ శ్రౌత పండితులు దెందుకూరి రాఘవ ఘనాపాఠి పాల్గొన్నారు.

ఆశీస్సులందుకున్న గవర్నర్

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శారదాపీఠంలో రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠం ప్రాంగణంలోని మేధాదక్షిణామూర్తి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, దాసాంజనేయస్వామి ఆలయాలను సందర్శించారు. స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా మహాపూర్ణాహుతి

వైభవంగా జరిగిన రాజశ్యామలయాగం, శ్రీనివాస చతుర్వేద హవనం మహాపూర్ణాహుతి కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, భీమిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్, తెలంగాణకు చెందిన కంపెనీస్ లా ట్రిబ్యునల్ చైర్మన్ బదరీనాథ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ విశాఖ శారదాపీఠం చేస్తున్న ఆధ్యాత్మిక, సేవాకార్యక్రమాలు ఎంతో గొప్పవని చెప్పారు.

బాలిక కడుపులో కిలో వెంట్రుకలు

- గుడివాడలో శస్త్రచికిత్స చేసి తొలగించిన వైద్యుడు



వెంట్రుకల గడ్డను మీడియాకు ప్రదర్శిస్తున్న వైద్యుడు

గుడివాడటౌన్: కృష్ణాజిల్లా గుడివాడలో కడుపునొప్పితో బాధపడుతున్న బాలికకు శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న సుమారు కిలో వెంట్రుకలను తొలగించారు. ఈ శస్త్రచికిత్స వివరాలను డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణానికి చెందిన బాలిక (12) దీర్ఘకాలంగా కడుపు నొప్పి, వాంతులు, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతోంది. కుటుంబసభ్యులు ఆమెను గుడివాడలోని శ్రీరామా నర్సింగ్‌హోంలో చేర్పించారు. వైద్యులు ఎండోస్కోపి, స్కానింగ్‌ల ద్వారా కడుపులో నల్లని గడ్డ ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం శస్త్రచికిత్స చేసి దాన్ని వెలికితీశారు. దాన్ని వెంట్రుకల గడ్డగా గుర్తించారు. దీన్ని వైద్య విధానంలో ట్రికోబీజోఆర్ అంటారని, చిన్న వయసు నుంచి కొందరికి వెంట్రుకలు తినే అలవాటు ఉంటుందని డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. కొద్ది మొత్తంలో ఐతే బయటకు వస్తాయని, ఈ బాలిక ఎక్కువగా వెంట్రుకలు తినడానికి అలవాటుపడిందని, ఇవి కడుపులో పేరుకుపోయి జీర్ణకోశంలో పెద్ద గడ్డలా కట్టేశాయన్నారు. సుమారు కిలో బరువున్న వెంట్రుకలు జీర్ణాశయాన్ని నింపివేయడంతో తిన్న అన్నం ఇమడక బయటకు రావడం, మిగిలిన కొద్ది ఆహారం జీర్ణంగాక శక్తి కోల్పోవడం జరుగుతోందని చెప్పారు. దీంతో బాలిక అనారోగ్యం పాలైనట్టు తెలిపారు. రక్తహీనత కలిగినవారు ఈ విధమైన తిండికి అలవాటుపడతారని, తల్లిదండ్రులు గమనించాలని ఆయన సూచించారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక సౌకర్యాలు

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఎం.ఎన్.హరీంద్రప్రసాద్



వైద్యులతో మాట్లాడుతున్న హరీంద్రప్రసాద్ తదితరులు

గుంటూరు మెడికల్: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో ఎం.ఎన్.హరీంద్రప్రసాద్ మంగళవారం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను పరిశీలించారు. క్యాన్సర్ రోగులకు నాట్కో సెంటర్‌లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర క్యాన్సర్ సెంటర్‌గా మార్చడానికి అవసరమైన చర్యలపై వైద్యులు, అధికారులతో సమీక్షించారు. నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో జరుగుతున్న శస్త్ర చికిత్సల వివరాలు అడిగి తెలుసుకుని అవసరమైన పరికరాల కొనుగోలుకు ఆరోగ్యశ్రీ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ వరప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

'జీఎంఎఫ్‌సీ ఫార్మా'లో పేలిన రియాక్టర్లు

- ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు
- అనకాపల్లి జిల్లాలో ఘటన



పేలిన రియాక్టర్ల నుంచి వస్తున్న పొగ

రాంబిల్లి(అనకాపల్లి జిల్లా): జీఎంఎఫ్‌సీ ఫార్మా కంపెనీలో రియాక్టర్లు పేలడంతో ఒక కార్మికుడు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన అనకాపల్లి జిల్లా లాలంకోడూరు(రాంబిల్లి–అచ్యుతాపురం) పరిధిలో మంగళవారం జరిగింది. రియాక్టర్లలో మిథనాల్ సాల్వెంట్‌ను పరిమితికి మించి వినియోగించడంతో ఈ పేలుళ్లు సంభవించినట్టు కార్మికులు చెబుతున్నారు. తొలుత ఒక రియాక్టర్ పేలగా.. ఆ వెంటనే మరో రియాక్టర్ కూడా పేలిందని తెలిపారు. ఈ ప్రమాదంలో పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం గెడ్డలుప్పికి చెందిన సొంగల రామారావు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. జార్ఖండ్‌కు చెందిన ప్రభాకర్ ఝా, విశాఖ జిల్లా దువ్వాడ రాజీవ్‌నగర్‌కు చెందిన సుబ్బరాజు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన రవివర్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఆర్డీవో చిన్నికృష్ణ, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గఫూర్, తహసీల్దార్ భాగ్యవతి, ఎస్ఐ దీనబంధు, ఆర్ఐ రవికుమార్ తదితరులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు.

బళ్లారి సిటీ నుంచి గాలి లక్ష్మీఅరుణ పోటీ

- కేఆర్‌పీపీ వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి వెల్లడి



సాక్షి, బళ్లారి: కర్ణాటకలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా గాలి లక్ష్మీ అరుణ పేరును కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ (కేఆర్‌పీపీ) వ్యవస్థాపకుడు గాలి జనార్దనరెడ్డి ప్రకటించారు. ఆయన మంగళవారం గంగావతిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఆమె గెలుపునకు కృషి చేస్తామని, నగరంలో విస్తృతంగా ప్రచారం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ నాయకులు చెప్పారు.

కర్ణాటక సంగీత కళాకారిణి లలిత చంద్రన్ కన్నుమూత

- ఆమె బొంబాయి సిస్టర్స్‌లో ఒకరు



లలిత చంద్రన్ (ఫైల్)

తమిళ సినిమా: ప్రఖ్యాత కర్ణాటక సంగీత కళాకారుల ద్వయంలో ఒకరైన లలితా చంద్రన్ (70) మంగళవారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె సోదరి సి.సరోజిని. వీరు కేరళలోని తిరుచ్చూర్‌కు చెందినవారు. తల్లిదండ్రులు ముకుందమ్ భాయ్, చిదంబరం అయ్యర్. తండ్రి ఉద్యోగరీత్యా లలితా చంద్రన్, సరోజిని ముంబైలో పుట్టి పెరిగారు. కర్ణాటక క్లాసికల్ సంగీతంలో ప్రావీణ్యం సాధించడంతో వీరికి బొంబాయి సిస్టర్స్ అనే విశేష గుర్తింపు దక్కింది. తర్వాత వారు చెన్నైలోని అడయార్‌లో స్థిరపడ్డారు. దేశవ్యాప్తంగా కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహించి పేరు గడించారు. దూరదర్శన్‌తో పాటు పలు ప్రైవేట్ చానళ్లలోను సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఏఐఆర్‌లో టాప్‌గ్రేడ్ ఆర్టిస్టులుగా పలు అవార్డులు అందుకున్నారు. ఈ క్రమంలో బొంబాయి సిస్టర్స్‌లో ఒకరైన లలిత చంద్రన్ మంగళవారం అడయార్‌లోని స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు.

అమరా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ ఆత్మహత్య

- బ్యాంకు అధికారుల వేధింపులే కారణమని భార్య ఆరోపణ



వెంకటేశ్వరరావు (ఫైల్)

నాదెండ్ల: పల్నాడు జిల్లా సాతులూరు సమీపంలోని అమరా ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ అమరా వెంకటేశ్వరరావు (55) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంకటేశ్వరరావు భార్య సుధారాణి తెలిపిన వివరాల మేరకు గుంటూరు–కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు సమీపంలో 2011లో అమరా ఇంజినీరింగ్ కళాశాలను అమరా వెంకటేశ్వరరావు ఏర్పాటు చేశారు. అప్పట్లో బ్యాంకుల ద్వారా రూ.13 కోట్ల రుణం తీసుకున్నారు. 2017 వరకు రూ.25 కోట్లను తిరిగి చెల్లించారు. అయినా బ్యాంకు అధికారులు నోటీసులు పంపారు. కాగా,కళాశాలలోని పరికరాలు విక్రయించినా సుమారు రూ.16 కోట్లు వస్తాయని, దీంతో బ్యాంకు అప్పు తీరేదని, అయినా బ్యాంకు అధికారులు తమ మొర ఆలకించకుండా ఈ నెల 16న బహిరంగ వేలం వేశారని సుధారాణి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తన భర్త మనస్తాపానికి గురై ఆదివారం కళాశాల ఆవరణలో పురుగులమందు తాగారని తెలిపారు. ఇది గమనించి నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సోమవారం తెల్లవారుజామున మృతి చెందారని ఆమె చెప్పారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విశాఖ రాజధాని ప్రకటన హర్షణీయం

- 856వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఢిల్లీలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖ కేంద్రంగా రాజధాని రాబోతుందని ప్రకటించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 856వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు బాబు అండ్ కో రాష్ట్రంలో ఎన్ని యాత్రలు చేసినా అవి బాబుకు రాజకీయ శవయాత్రలుగా మిగిలిపోక తప్పదని హెచ్చరించారు. వికేంద్రీకరణ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించేందుకు గత 75 సంవత్సరాల భారతదేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని మూడు రాజధానుల దిశగా అడుగులు వేస్తున్న జగనన్నకు 5 కోట్ల మంది ప్రజలు రుణపడి ఉంటారన్నారు. 29 గ్రామాల్లో బాబు కనీస అభివృద్ధి కూడా చేయకుండా తాత్కాలిక భవనాల నిర్మాణం పేరుతో నిలువునా దోచేసినందునే నేడు ఈ ప్రాంతం పూర్తిగా వెనుకబడి పోయిందని చెప్పారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి సమానంగా అందుతుంటే ఓర్వలేక ఎల్లో మీడియాలో బాబు అండ్ కో దుష్ప్రచారానికి పూనుకోవడం దుర్మార్గం కాదా అన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, ఇందుపల్లి సుభాషిణి, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పల్లెబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆ గుండెలో 'ఆరోగ్యశ్రీ' చప్పుళ్లు!

- బీపీ, షుగర్‌తో గుండెజబ్బు
- తెలుసుకునేలోపే రెండు రక్తనాళాలు బ్లాక్
- బీటింగ్ బైపాస్ సర్జరీ చేసిన కర్నూలు జీజీహెచ్ వైద్యులు
- ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా అతిక్లిష్టమైన ఆపరేషన్
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.6 లక్షలకుపైనే ఖర్చు

కర్నూలు (హాస్పిటల్): బీపీ, షుగర్ ఉన్నాయనే విషయమే అతడికి తెలియదు. తెలిసేసరికే గుండె పనితీరు బాగా పడిపోయింది. ఈ పరిస్థితుల్లో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు (జీజీహెచ్‌కి) వచ్చిన ఓ వృద్ధుడికి బైపాస్ సర్జరీతో ప్రాణం పోశారు. ఈ విషయాన్ని మంగళవారం కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి వివరించారు. 'బేతంచర్లకు చెందిన వలీ (64) బండల పాలిష్, మటన్‌కొట్టే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి షుగర్, బీపీ ఉన్నాయి. ఈ విషయం చాలాకాలం అతనికి తెలియదు. మూడేళ్ల కిందట పరీక్షల్లో బయటపడటంతో అప్పటి నుంచి మాత్రలు వాడుతున్నాడు. అప్పటికే బీపీ, షుగర్ గుండె పనితీరుపై ప్రభావం చూపాయి. ఆయాసం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి రాగా.. గుండె పెద్ద (6 సెం.మీ. డయామీటర్)గా మారి పనితీరు 30 శాతానికి పడిపోయినట్లు వెల్లడైంది. యాంజియోగ్రామ్‌లో రెండు రక్తనాళాలు పూర్తిగా, ఒకటి 80 శాతం బ్లాక్ అయినట్లు గుర్తించాం. ఈ పరిస్థితుల్లో అతడికి ఆపరేషన్ చేయడం ప్రమాదకరం. ఓ పదిరోజులు ఆస్పత్రిలోనే ఉంచి హార్ట్ ఫెయిల్యూర్‌ను మందులతో నిదానంగా తగ్గించాం. తరువాత వారం రోజుల కిందట బీటింగ్ పద్ధతిలో బైపాస్ సర్జరీ చేశాం. ప్రస్తుతం అతడు కోలుకుని తనపని తాను చేసుకుంటున్నాడు. ఇలాంటి ఆపరేషన్లు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేయరు. ఒకవేళ చేర్చుకున్నా రూ.6 లక్షలకు పైగానే వసూలు చేస్తారు. కానీ ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఆపరేషన్ చేశాం..' అని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు.



ఆపరేషన్ అనంతరం వలీతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

రూ.45 కోట్ల విలువైన విదేశీ గంజాయి సీజ్

- సింక్ బేసిన్‌లో ఉంచి తరలింపు
- 54 కిలోలను సీజ్ చేసిన చెన్నై డీఆర్ఐ
- ఇద్దరు నిందితుల అరెస్టు



అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి

సాక్షి చెన్నై: విదేశాలలో లభించే అత్యంత ఖరీదైన గంజాయిని చెన్నై డీఆర్ఐ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... దేశంలోకి మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు నిఘా వర్గాలకు కొద్ది రోజుల కిందట సమాచారం అందింది. దీంతో చెన్నై డీఆర్ఐ అధికారులు నిఘా పెంచారు. గత వారం యూఎస్ నుంచి చెన్నై ఎయిర్ కార్గోకు దిగుమతి అయిన సింక్ బేసిన్‌లను పరిశీలించారు. మూడు రోజుల కిందట మంగళూరుకు చెందిన ఓ వ్యక్తి వీటిని దిగుమతి చేసుకున్నట్లు తేలింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన ఈ సింక్ బేసిన్‌ల మధ్య భాగంలో విదేశీ గంజాయి ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. సీజ్ చేసిన గంజాయి బరువు 54 కిలోలుగా గుర్తించారు. మార్కెట్ ధర రూ. 45 కోట్లుగా భావిస్తున్నారు. ఇది హైడ్రోపోనిక్ కలుపు (గంజాయి)గా తేలింది. అత్యంత శక్తివంతమైన హైడ్రోపోనిక్ కలుపును మట్టిలో కాకుండా నీటిలో పెంచుతారని విచారణలో తేలింది. దీంతో వీటిని దిగుమతి చేసుకున్న వ్యక్తితో పాటు అతడికి సహకరించిన మరో వ్యక్తిని చెన్నై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు గాలించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సీఎంవో స్టిక్కర్ వాహనం మాడ వీధుల్లోకి రాలేదు

- దుష్ప్రచారాన్ని నమ్మవద్దని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి

తిరుమల: సీఎంవో స్టిక్కర్ ఉన్న ఒక వాహనం శ్రీవారి ఆలయ మాడ వీధుల్లోకి ప్రవేశించిందంటూ కొన్ని ప్రసార మాధ్యమాల్లో, పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించింది. ఆలయ మాడ వీధుల్లోకి ప్రైవేట్ వాహనాల రాకపోకలపై నిషేధం కొనసాగుతోందని స్పష్టం చేసింది. ప్రముఖుల వాహనాలను వాహన మండపం పక్కన ఉన్న సెక్యూరిటీ గేటు వద్దకు మాత్రమే అనుమతిస్తారు. శ్రీవారి ఆలయం నుంచి రాంబగీచా గేటు వద్దకు వృద్ధులు, దివ్యాంగులను తీసుకెళ్లే బ్యాటరీ వాహనం కోసం సెక్యూరిటీ సిబ్బంది గేటును తీసి ఉంచారు. ఈ గేటు పక్కనే దాతల ద్వారా అందే వాహనాలను, అంబులెన్సును ఉంచుతారు. సదరు వార్తల్లో పేర్కొన్న వాహనాన్ని ఆ గేటు వద్దే పక్కకు తిప్పుకున్నారని.. మాడ వీధుల్లోకి ఆ వాహనం ప్రవేశించలేదని టీటీడీ తెలిపింది. టీటీడీ అధికారుల వైఫల్యం వల్ల మాడవీధుల్లోకి ఓ వాహనం వచ్చిందంటూ ప్రసారం చేయడం బాధాకరమని, భక్తులు ఇలాంటి వార్తలను నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

5 నుంచి నూతన పరకామణిలో లెక్కింపు

తిరుమలలో నిర్మించిన నూతన పరకామణి భవనంలో ఫిబ్రవరి 5 నుంచి కానుకల లెక్కింపు ప్రారంభం కానుంది. బెంగళూరుకు చెందిన మురళీకృష్ణ అందించిన రూ.23 కోట్ల విరాళంతో అధునాతన సౌకర్యాలతో కూడిన నూతన పరకామణి భవనాన్ని నిర్మించారు. దీనిని శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సెప్టెంబరు 28న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు. అనంతరం ఇతర అభివృద్ధి పనులు కూడా పూర్తి చేసి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్లుప్తంగా...

రేప్ కేసులో మరోసారి... ఆశారాంకు జీవితఖైదు



అహ్మదాబాద్: స్వయం ప్రకటిత బాబా ఆశారాం బాపూను 2013నాటి అత్యాచారం కేసులో దోషిగా తేల్చి జీవితఖైదు విధిస్తూ గాంధీనగర్‌లోని అదనపు సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు మంగళవారం కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బాధితురాలైన ఆశారాం మాజీ శిష్యురాలికి రూ.50,000 పరిహారం చెల్లించాలని జడ్జి డీకే సోనీ ఆదేశాలిచ్చారు. సూరత్‌కు చెందిన ఒక మహిళ మోతెరానిలోని ఆశారాం ఆశ్రమంలో శిష్యురాలిగా ఉండేది. 2001-2006 కాలంలో తనపై ఆశారాం పలుమార్లు అత్యాచారం చేశాడని 2013లో ఆమె కేసు వేసింది. ఈ కేసులోనే సోమవారం ఆయనను దోషిగా తేల్చిన కోర్టు తీర్పును మంగళవారానికి రిజర్వ్‌చేసిన విషయంతెల్సిందే. తీర్పును గుజరాత్ హైకోర్టులో సవాల్ చేస్తామని ఆశారాం తరపు న్యాయవాదులు చెప్పారు. ఈ కేసులో ఆశారాం భార్య లక్ష్మీబెన్, ఆయన కుమార్తె, నలుగురు శిష్యులను నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. 2013లో రాజస్తాన్ ఆశ్రమంలో బాలికపై అత్యాచారం కేసులోనూ 81 ఏళ్ల ఆశారాంను దోషిగా తేల్చడంతో ఆయన ఇప్పటికే జోధ్‌పూర్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు.

జార్ఖండ్‌లో ఘోర అగ్ని ప్రమాదం

14 మంది సజీవ దహనం

ధన్‌బాద్: జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలోని ఓ బహుళ అంతస్తుల భవంతిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నారులు, మహిళలుసహా 14 మంది అగ్నికి ఆహుతయ్యారు. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. జోరాఫాటక్ ప్రాంతంలోని ఆశీర్వాద్ టవర్ రెండో అంతస్తులో అంటుకున్న అగ్నికీలలు వేగంగా విస్తరించడంతో వీరంతా సజీవదహనమయ్యారు. మరణించిన వారిలో ముగ్గురు చిన్నారులు, పది మంది మహిళలు ఉన్నారు. గాయపడిన 11 మందికి ఆస్పత్రిలో చికిత్సచేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సుఖ్‌దేవ్ సింగ్ చెప్పారు. మంటలు ఆర్పేందుకు 40 అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగాయి. అపార్ట్‌మెంట్‌లో ఇంకా కనీసం 50 మంది చిక్కుకుని ఉంటారని మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ ట్వీట్‌చేశారు. పరిస్థితిని జిల్లా డెప్యూటీ కమిషనర్ స్వయంగా ఘటనాస్థలికొచ్చి పర్యవేక్షిస్తున్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పారు.

పేదరికరహిత భారత్

2047కల్లా సాకారమే ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్రపతి



మంగళవారం బడ్జెట్ సమావేశాల తొలి రోజు రాష్ట్రపతి ముర్మును పార్లమెంట్‌కు తోడ్కొని వస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ: ''కేంద్రంలో నిర్భీతితో కూడిన సుస్థిరమైన, నిర్ణాయక ప్రభుత్వముంది. మన ఘన వారసత్వాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్తోంది. దేశాభివృద్ధికి, అన్ని వర్గాల వారి అభ్యున్నతికి నిష్పాక్షికంగా పాటుపడుతోంది. విప్లవాత్మక నిర్ణయాలతో ప్రతి విషయంలోనూ దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ఆమె తొలిసారి ప్రసంగించారు. 2047కల్లా పేదరికరహిత దేశంగా భారత్ స్వావలంబన సాధించేలా చూడటమే నరేంద్ర మోదీ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అతి పెద్ద శత్రువైన అవినీతిపై నిరంతరం రాజీ లేని పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. ఫలితంగా అవినీతిపరులపై ఎలాంటి సానుభూతీ చూపొద్దన్న సామాజిక స్పృహ పెరుగుతోందన్నారు. ఆత్మనిర్భర భారతాన్ని సాకారం చేసేందుకు వచ్చే పాతికేళ్ల అమృత కాలంలో ప్రజలంతా తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ విజయాలను రంగాలవారీగా గణాంకాల సాయంతో వివరిస్తూ రాష్ట్రపతి గంట పైగా ప్రసంగించారు. ముఖ్యాంశాలు...

- మోదీ సర్కారు తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నో విజయాలు, సానుకూల మార్పులు సాధించింది. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ఎంతగానో ఇనుమడింపజేయడం వాటిలో ముఖ్యమైనది.
- సమున్నత ఆకాంక్షలతో గొప్ప లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించే దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది. నిజాయతీకి పెద్దపీట వేస్తోంది. భారీ కుంభకోణాలు, ప్రభుత్వ పథకాల అమలులో అంతులేని అవినీతికి మంగళం పాడాలన్న జనాకాంక్షలను నిజం చేసి చూపిస్తోంది.
- పేదల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి వారిని సాధికారపరిచేందుకు కృషి చేస్తోంది.
- ఇన్నొవేషన్, టెక్నాలజీలను ప్రజా సంక్షేమానికి సమర్థంగా వినియోగిస్తూ కనీవినీ ఎరగని వేగంతో దూసుకెళ్తోంది. ఫలితంగా పేదలకు రోజుకు 11 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. 55 వేల గ్యాస్ కనెక్షన్లు అందుతున్నాయి. ఒక్క ముద్రా పథకం ద్వారానే రోజూ రూ.700 కోట్లకు పైగా రుణాలందుతున్నాయి. 300 పై చిలుకు పథకాల ద్వారా లబ్ధిదారులకు ఖాతాల ద్వారా నేరుగా నగదు అందుతోంది.
- ప్రజలకు దశాబ్దాల పాటు కలగానే మిగిలిన మౌలిక సదుపాయాలెన్నో పరిపూర్ణంగా అందుతున్నాయి.
- అటు సాంకేతికంగా, ఇటు సాంస్కృతికంగా దేశంలో అద్భుతమైన ప్రగతి చోటుచేసుకుంటోంది. మన డిజిటల్ ప్రగతి అభివృద్ధి చెందిన దేశాలకూ ఆదర్శంగా మారింది.
- అవసరాలకు అనుగుణంగా సత్వరం విధానాలను, వ్యూహాలను సమూలంగా మార్చుకునే ప్రభుత్వ సంకల్ప శక్తికి సర్జికల్ దాడులు మొదలుకుని ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ల రద్దు, ఉగ్రవాదంపై ఉక్కుపాదం, నియంత్రణ, వాస్తవాధీన రేఖల వద్ద శత్రువుల ప్రతి దుస్సాహసానికీ దీటుగా బదులివ్వడం వంటివన్నీ తార్కాణాలుగా నిలిచాయి. సైన్యాన్ని ఆధునీకరించేందుకు పెద్దపీట వేశాం.
- ఫలితంగా విధాన వైకల్యంతో కుంగిపోయే రోజులు పోయి శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా రాణిస్తూ ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది.
- అంతర్జాతీయ వేదికపైనా తనదైన కీలక పాత్ర పోషించేందుకు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది. సమస్యల పరిష్కారానికి ఇతర దేశాల వైపు చూసే స్థితి నుంచి ప్రతిష్టాత్మక జీ-20 కూటమి సారథిగా ప్రపంచ సమస్యల పరిష్కారానికి నడుం బిగించే స్థాయికి ఎదిగింది.
- రక్షణ, వైమానిక రంగాల్లోనూ గొప్ప ప్రగతి సాధించాం. అగ్నివీర్ పథకం యువతకు దేశ సేవ చేసేందుకు గొప్ప అవకాశంగా మారింది.
- మహిళలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ రూపుమాపేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు తెచ్చింది. ఫలితంగా సైన్యంతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళలు సత్తా చాటుతున్నారు. తొలిసారిగా మహిళల జనాభా పురుషులను మించిపోయింది. పీఎం కిసాన్ లబ్ధిదారుల్లోనూ 3 లక్షలకు పైగా మహిళలే!
- బంజారాలు, సంచార జాతుల సంక్షేమానికి తొలిసారిగా బోర్డు ఏర్పాటైంది.
- అటు అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఇటు అత్యాధునిక పార్లమెంటు భవన నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. ఆధ్యాత్మిక, యాత్రా స్థలాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోంది.
- మన యోగ, ఆయుర్వేదం ప్రపంచమంతా విస్తరిస్తున్నాయి.
- శిలాజేతర వనరుల ద్వారా 40 శాతం విద్యుదుత్పాదన లక్ష్యాన్ని తొమ్మిదేళ్ల ముందే చేరుకున్నాం.
- ఉగ్రవాదంపై మనం తీసుకున్న కఠిన వైఖరిని ప్రపంచమంతా స్వాగతిస్తోంది.
- ఆయుష్మాన్ భారత్ ద్వారా జనాభాలో ఏకంగా 50 కోట్ల మందికి ఉచిత చికిత్స అందింది. ప్రజలకు రూ.80 వేల కోట్లు మిగిలాయి.

కొత్తదనం కొరవడింది

రాష్ట్రపతి ప్రసంగంపై ఖర్గే



బీజేపీ సర్కార్ ఎప్పుడూ చెప్పే విషయాలనే మళ్లీ రాష్ట్రపతి తన ప్రసంగం ద్వారా పునరుద్ఘాటించారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పెదవి విరిచారు. 'దేశం అద్భుతంగా పురోగమించిందని రాష్ట్రపతి ప్రసంగం ద్వారా కేంద్రం చెప్పించింది. అదే నిజమైతే అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో పేదలు ఇంకా ఎందుకు ఇబ్బందులు పడుతున్నారు? పథకాల ఫలాలు ఎందుకు అణగారిన వర్గాల దాకా చేరడం లేదు? కొత్త కాలేజీలు, స్కూళ్లన్నీ ప్రైవేటురంగంలో వచ్చినవే. వాటి భారీ ఫీజుల వల్ల పేదలకు ఎలాంటి లబ్ధిచేకూరలేదు' అని ఆరోపించారు. అవినీతి అంతమైతే ఒకే వ్యక్తి రూ.1 లక్ష కోట్ల విలువైన షేర్ల పెట్టుబడుల ద్వారా ఎల్‌ఐసీ/ఎస్‌బీఐలను ఎలా మభ్యపెట్టగలిగాడు? మోదీకి ఆప్తుడైన ఆ ఒక్కడి చేతిలోకే తమ పెట్టుబడులు తరలిపోయాయని 30 కోట్ల మంది గగ్గోలు పెడుతున్నారు'' అంటూ ఖర్గే విమర్శించారు.

జనాకర్షకమేనా..!

- నేడే కేంద్ర బడ్జెట్
- ఐదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల
- లోక్‌సభ ఎన్నికల లోపు చివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే

సాక్షి, న్యూఢిల్లీ: ఊరటలు, ఊరడింపులు, ఉపశమనాల కోసం ఉద్యోగులు మొదలుకుని ఆర్థిక నిపుణులు, పరిశ్రమ వర్గాల దాకా అందరూ ఏటా ఎదురు చూసే తరుణం మరోసారి రానే వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ఉదయం 11 గంటలకు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఆదాయ పన్ను ఊరటపై ఎప్పట్లాగే వేతన జీవులు మరోసారి ఆశలు పెట్టుకోగా, భయపెడుతున్న ద్రవ్యోల్బణం కట్టడికి తీసుకోబోయే చర్యలపై ఆర్థిక నిపుణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జీడీపీ వృద్ధి 7 శాతానికి లోపే ఉంటుందన్న ఆర్థిక సర్వే అంచనాలు, ప్రపంచ మందగమన హెచ్చరికల నేపథ్యంలో కొన్నయినా కఠిన చర్యలు తప్పనిసరిగా కన్పిస్తున్నాయి. అలాగని వచ్చే ఏడాది కీలకమైన లోక్‌సభ ఎన్నికలున్నందున ప్రజలపై మరీ భారం మోపలేని పరిస్థితి. పైపెచ్చు ఎన్నో కొన్ని తాయిలాలు ప్రకటించాల్సిన అనివార్యత. వీటన్నింటినీ సంతృప్తి పరుస్తూ ఆర్థిక పద్దుకు రూపమివ్వడంలో నిర్మలా సీతారామన్ ఏ మేరకు నెగ్గుకొచ్చారో చూడాలి. వచ్చే ఎన్నికల ముందు ప్రవేశపెట్టే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కానుంది. ఉత్పత్తి రంగంతో పాటు కీలకమైన సరఫరా వ్యవస్థలను మరింతగా బలోపేతం చేసే దిశగా పలు చర్యలుంటాయని భావిస్తున్నారు. సంప్రదాయేతర విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచేందుకు మరిన్ని పథకాలను ప్రకటించే అవకాశముంది. ఎన్నికల వేళ పేద, మధ్య తరగతి వర్గాలకు పలు తాయిలాలూ ఉంటాయంటున్నారు. ఆదాయ పన్ను శ్లాబులను తగ్గించకపోయినా ఉద్యోగులకు ఎంతో కొంత ఊరటనిచ్చేలా 80సి పన్ను మినహాయింపుల పెంపు వంటి చర్యలుండవచ్చని చెబుతున్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వంటివాటిపై పలు వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. భారత్‌ను 10 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు పూర్తి ఆత్మనిర్భరత సాధించాలన్న మోదీ సర్కారు లక్ష్యాల సాధనకు ఎలాంటి రోడ్ మ్యాప్ ప్రకటిస్తారన్నది ఆసక్తికరం.



ప్రపంచానికి ఆశారేఖ: మోదీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ప్రతికూల ఆర్థిక పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ.. భారతదేశ బడ్జెట్ మాత్రం సామాన్య పౌరుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మన బడ్జెట్ ప్రపంచానికి ఆశారేఖ అవుతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆర్థిక వృద్ధి పుంజుకోవడం ఖాయమని ప్రపంచ ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారని గుర్తుచేశారు. మన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టనున్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు భారత్‌పై ప్రపంచం పెట్టుకున్న అంచనాలను అందుకునేలా ఉంటుందని పేర్కొన్నారు. ఇతర దేశాలు ఎన్నో ఆశలతో భారత్ వైపు చూస్తున్నాయని వ్యాఖ్యానించారు. భారత్‌లో ప్రపంచం చూసుకుంటున్న ఆశారేఖ మరింత వెలుగులీనుతుందని అన్నారు. అందరి ఆశలను నెరవేర్చేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని ప్రయత్నాలూ చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు మోదీ చెప్పారు.

'భారత్ ప్రథమం.. పౌరులు ప్రథమం'

పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం భారత రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ ఆత్మగౌరవానికి ప్రతిబింబమని ప్రధాని పేర్కొన్నారు. మహిళలను, ఘనమైన గిరిజన సంప్రదాయాలను గౌరవించుకోవడానికి లభించిన అవకాశమని వివరించారు. 'భారత్ ప్రథమం.. పౌరులు ప్రథమం' అనే ఏకైక లక్ష్యంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ తేల్చిచెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అదే స్ఫూర్తి కనిపించనుందని తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు సహకరిస్తాయని, అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశానికి ఉపయోగపడే విధానాల రూపకల్పన కోసం చక్కటి చర్చలు జరగాలన్నారు. మంగళవారం ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13 వరకూ జరుగుతాయి. మార్చి 12న మళ్లీ ప్రారంభమై, ఏప్రిల్ 6న ముగుస్తాయి.



పెన్షన్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ మంగళవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో కార్మికుల భారీ ర్యాలీ

సుప్రీం జడ్జీలుగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టు సీజేలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ బిందాల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్‌లను సుప్రీంకోర్టులో జడ్జీలుగా ఎంపికచేయాలని కేంద్రప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం సిఫార్సుచేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియంలో జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ సంజీవ్ ఖన్నా సభ్యులుగా ఉన్నారు. కొత్త జడ్జీల ఎంపిక కోసం డిసెంబర్ 13న కొలీజియం సమావేశమై ఆ తర్వాత తుది తీర్మానం చేసి ఆ వివరాలను తాజాగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, పట్నా హైకోర్టు సీజే జస్టిస్ సంజయ్ కరోల్, మణిపూర్ హైకోర్టు సీజే జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అసనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మనోజ్ మిశ్రాల పేర్లనూ కొలీజియం సిఫార్సుచేసింది. అన్ని రాష్ట్రాల హైకోర్టులకు సుప్రీంకోర్టులో ప్రాతినిధ్యం ఉండేలా, జడ్జీలుగా సుదీర్ఘ అనుభవం, హైకోర్టుల్లో వారి సీనియారిటీ, భిన్న వర్గాలకు సముచిత స్థానమిస్తూ వీరిని జడ్జీలను ఎంపికచేసినట్లు కొలీజియం తీర్మానం స్పష్టంచేసింది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టులో సీజేఐతో కలుపుకుని గరిష్టంగా 34 మంది జడ్జీలు ఉండవచ్చు. ప్రస్తుతం కోర్టులో 27 మంది జడ్జీలు కొనసాగుతున్నారు.

కొలీజియంలోకి కేంద్ర నామినీలా: స్టాలిన్

చెన్నై: న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన కొలీజియంలోకి కేంద్ర ప్రభుత్వం తరపున నామినీలు ఉండాలన్న వాదనలను తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ చీఫ్ ఎంకే స్టాలిన్ తప్పుబట్టారు. 'న్యాయవ్యవస్థ(జడ్జీలుగా)లో సమాజంలోని అన్ని వర్గాలవారికి ప్రాధాన్యత దక్కాలనేది అందరి చిరకాల వాంఛ. కొలీజియంలో కేంద్రం కలగజేసుకోవడమంటే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో జోక్యం చేసుకోవడమే. కొలీజియం సిఫార్సులను ఆమోదించకపోవడం, న్యాయ మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతికాదు' అని అన్నారు.

సిబ్బందిని తిడుతూ, అర్ధనగ్నంగా తిరుగుతూ...

విమానంలో మహిళ వీరంగం

ముంబై: అబుదాబి నుంచి ముంబైకి వస్తున్న విస్తారా ఎయిర్‌లైన్స్ విమానంలో ఇటలీకి చెందిన 45 ఏళ్ల మహిళ హంగామా సృష్టించారు. సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఎకానమీ క్లాస్ టికెట్ తీసుకున్న ఇటలీ దేశస్తురాలు పావోలా పెరూసియో తన ఎకానమీ సీటులో కూర్చోకుండా బిజినెస్ క్లాస్ సీటులో కూర్చుకునేందుకు ప్రయత్నించింది. విమాన సిబ్బంది అడ్డుకోవడంతో పట్టరాని ఆగ్రహంతో ఊగిపోయింది. అడ్డొచ్చిన సిబ్బందిని బూతులు తిట్టడం మొదలుపెట్టింది. ఒకరి ముఖంపై కొట్టింది. మరొకరిపై ఉమ్మేసింది. అర్ధనగ్నంగా తిరుగుతూ తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసింది. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే పోలీసులు ఆమెను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచారు.

మాజీ న్యాయ మంత్రి శాంతిభూషణ్ కన్నుమూత



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న న్యాయ కోవిదుడు, కేంద్ర మాజీ న్యాయ శాఖ మంత్రి శాంతి భూషణ్(97) మంగళవారం ఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కుమారులు జయంత్, ప్రశాంత్ భూషణ్ సైతం న్యాయవాదులుగా పేరొందారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన భూషణ్‌జీ చిర స్మరణీయులంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ స్థానంలో అక్రమాలకు పాల్పడి గెలిచారని అలహాబాద్ హైకోర్టులో కేసు వేసి నెగ్గిన రాజ్ నారాయణ్ తరపున శాంతి భూషణ్ వాదించారు. ఆ కేసులో ఇందిరాగాంధీ ఓడిపోవడం, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా కోర్టు ప్రకటించడంతో దేశంలో ఎమర్జెన్సీ విధించడం తెల్సిందే.

100కు చేరిన 'పెషావర్' మృతులు

పెషావర్: పాకిస్తాన్‌లోని పెషావర్ నగరంలో మసీదులో ఆత్మాహుతి దాడి ఘటనలో మృతుల సంఖ్య మంగళవారం 100కు చేరుకుంది. దాడికి పాల్పడింది తామేనని నిషేధిత ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) ప్రకటించింది. పాక్‌లో ఉగ్రవాదానికి శాశ్వత సమాధి తప్పదని అధ్యక్షుడు అరీఫ్ అల్వీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.

'వ్యభిచారానికి పాల్పడితే సైనికాధికారులపై చర్యలు'

న్యూఢిల్లీ: నీతి తప్పిన సైనికులు ఉంటే సైన్యంలో క్రమశిక్షణ దెబ్బతింటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పై అధికారులు వ్యభిచారానికి పాల్పడితే చర్యలు తీసుకొనే అధికారం సైనిక దళాలకు ఉందని తేల్చిచెప్పింది. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. వ్యభిచారం నేరం కాదంటూ చెబుతూ ఐపీసీ సెక్షన్ 497ను కొట్టివేస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. కానీ తప్పుడు పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోకుండా ఈ తీర్పు అడ్డుకోలేదని జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వెల్లడించింది.

మోదీకి విధేయులుగా గవర్నర్లు: ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పట్ల విధేయతను నిరూపించుకోవడానికి గవర్నర్లు పోటీ పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. గవర్నర్ల వ్యవహార శైలితోపాటు గౌతమ్ అదానీ అక్రమాలు, సరిహద్దుల్లో చైనా నుంచి చొరబాట్లను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో లేవనెత్తుతామని, కేంద్రాన్ని నిలదీస్తామన్నారు.

తొలి విడతకు ముందుగానే ముగింపు?

న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాల తొలి దఫా బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరి 13కు బదులు 10వ తేదీనే ముగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పలు పార్టీలు కోరాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. ''లోక్‌సభ సభా కార్యకలాపాల సలహా కమిటీ భేటీలో స్పీకర్ వద్ద వారీ విషయాన్ని ప్రస్తావించారు. వారి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుంటానని స్పీకర్ హామీ ఇచ్చారు'' అని చెప్పారు.

నాగాలు ఎటువైపు?

శాంతి ఒప్పందం చుట్టూ ఎన్నికలు ● నాగా సమస్య పరిష్కారం బీజేపీకి అగ్ని పరీక్ష

నాగాలాండ్‌లో అంతా ఒకటే పక్షం. అదే అధికార పక్షం. ప్రస్తుతం అక్కడ ప్రతిపక్షం ఊసే లేదు. అభివృద్ధే లక్ష్యంగా రెండేళ్ల క్రితం రాజకీయ పక్షాలన్నీ ఏకమై కొత్త సంప్రదాయానికి తెరతీశాయి. అయినా ఈ సారి ఎన్నికల్లో అదే పాత సమస్య నాగాల శాంతి చర్చలే ప్రధాన అంశంగా మారింది.

నాగాలాండ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలు ఈ ఏడాది శాంతి ఒప్పందం చుట్టూనే తిరుగుతున్నాయి. నాగాల చిరకాల డిమాండ్లు నెరవేర్చకపోవడంతో అధికార నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)-బీజేపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా నిలుస్తున్నాయి. 2018 ఎన్నికలకు ముందు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) చిరకాల మిత్రుత్వాన్ని వదులుకున్న బీజేపీ ఎన్‌డీపీపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్‌డీపీపీకి చెందిన నిఫూయి రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కేంద్రంలో అధికార బీజేపీ నాగాలు ఆశిస్తున్నట్టుగా ప్రత్యేక జెండా, రాజ్యాంగం ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడంతో వారంతా కాషాయ కూటమికి వ్యతిరేకంగా పని చేయడానికి సిద్ధమయ్యారు. దశాబ్దాల తరబడి వేర్పాటు వాదుల హింసాకాండతో రక్తమోడుతున్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించాలన్న లక్ష్యంతో 2021లో రాజకీయ పార్టీలన్నీ చేతులు కలిపి యునైటెడ్ డెమొక్రాటిక్ అలయెన్స్ (యూడీఏ) ఏర్పాటయ్యాయి. అధికారంలో ఉన్న నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), బీజేపీ కూటమిలో ప్రతిపక్ష నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) చేరడం రాజకీయంగా కొంత పుంతలకు దారి తీసింది.

ఎన్‌డీపీపీ-బీజేపీ కలసికట్టుగా పోటీ

రెండేళ్లుగా అభివృద్ధి ప్రయత్నాలు ముందుకు కదలకపోగా నాగా వేర్పాటు వాద సమస్య తీవ్రతరం కావడంతో ఫిబ్రవరి 27న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పీఎఫ్ ఒంటరి పోరాటానికి సిద్ధమైంది. గత ఎన్నికల్లో 26 సీట్లలో నెగ్గిన ఎన్‌పీఎఫ్ ఈ సారి అధికారంలోకి వచ్చేలా వ్యూహాలు రచిస్తున్నట్టుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అచ్చుబెమో కికోన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎవరితోనైనా పొత్తుకు సిద్ధమని తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో ఎన్‌డీపీపీ- బీజేపీ కలసి కట్టుగా పోటీ చేయనున్నాయి.మొత్తం 60 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో 40 సీట్లలో ఎన్‌డీపీపీ, 20 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నాయి. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ఒక్క స్థానం రాకపోయినా ఈ సారి 60 స్థానాల్లోనూ పోటీకి దిగుతోంది. ఎన్నికల తర్వాత ఎన్‌పీఎఫ్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కూడా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. గత ఎన్నికల్లో ఒక్క స్థానంలో నెగ్గిన జేడీ(యూ) ఈసారి నాగ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చింది. దీంతో బీజేపీ నుంచి జేడీ(యూ)లోకి భారీగా వలసలు మొదలయ్యాయి.

ఏమిటీ నాగాల సమస్య

నాగాల వివాదం ఇప్పటిది కాదు. దశాబ్దాల తరబడి భారత నేలపై రక్త చరిత్ర రాస్తూనే ఉంది. బ్రిటీష్ కాలంలో మొదలైన ఈ సమస్యపై ఇప్పటికీ నాగాలు పోరాటం చేస్తూనే ఉన్నారు. 1881లో నాగా తెగలు నివసించే నాగా హిల్స్ ప్రాంతాన్ని బ్రిటీష్ ఇండియాలో భాగం చేశారు. దీనిని నాగా తెగలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ భవిష్యత్ తామే నిర్ణయించుకుంటామని స్వతంత్ర నాగా దేశాన్ని ఏర్పాటు చేసుకుంటామంటూ పలు ఉద్యమాలు నడిపాయి. తమకు సొంత జెండా, రాజ్యాంగం కావాలంటూ 1946లోనే నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్ఎన్‌సీ) ఏర్పాటై వేర్పాటు వాదం దిశగా అడుగులు వేసింది. నాగా ఫెడరల్ ఆర్మీ (ఎన్ఎఫ్ఏ) పేరుతో ఏర్పాటైన తీవ్రవాదులు భారీగా హింసకు పాల్పడేవారు. దీంతో వారిని అణిచివేయడానికి 1958లో నాటి కేంద్ర ప్రభుత్వం సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తెచ్చింది. అప్పట్నుంచి కేంద్రం, నాగాల మధ్య విభేదాలు ముదురుతూనే ఉన్నాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్లు ఇప్పటికీ నాగాలు గట్టిగా చేస్తున్నారు. నాగాలు నివసించే ప్రాంతాన్ని అంతటినీ కలిపి 1963లో కేంద్రం నాగాలాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 1975లో ఎన్ఎన్‌సీలో ఒక వర్గంతో షిల్లాంగ్ శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రస్తుతం ఈ సమస్యపై ఎన్ఎన్‌సీలో చీలిక వర్గమైన ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం) బలంగా తన వాణి వినిపిస్తోంది. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పాటు మయన్మార్‌లో నాగాలు అధికంగా ఉన్న ప్రాంతాలన్నీ కలిసి గ్రేటర్ నాగాలాండ్ ఏర్పాటు చేసి సొంత రాజ్యాంగం, జెండా కావాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో ఎన్ఎస్‌సీఎన్ (ఐఎం) శాంతి ఒప్పందం కుదుర్చుకొని అప్పటి గవర్నర్ ఆర్.ఎన్.రవిని మధ్యవర్తిగా నియమించింది. అయినా చర్చలు ముందుకు సాగలేదు. దీంతో నాగాల శాంతి చర్చలే ఈ సారి అతి పెద్ద ఎన్నికల అంశంగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



మొత్తం అసెంబ్లీ స్థానాలు	మొత్తం ఓటర్లు
60	12.83 లక్షలు
పోలింగ్ తేదీ	**ఎన్నికల ఫలితాలు**
ఫిబ్రవరి 27	మార్చి 2

ప్రస్తుత అసెంబ్లీలో బలా బలాలు

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఎన్‌పీఎఫ్	26	38.8
ఎన్‌డీపీపీ	18	25.3
బీజేపీ	12	15.3
కాంగ్రెస్	0	2.1
ఇతరులు	4	18.5

ఎన్నికల్లో ప్రభావం చూపించే అంశాలు

- ప్రత్యేక జెండా, రాజ్యాంగం కోరుతూ గ్రేటర్ నాగాలాండ్ డిమాండ్ కోసం దశాబ్దాలైనా నాగా తెగలు గట్టిగా పట్టుపట్టడం
- ఏడు ఆదివాసీ సంస్థలతో కూడిన ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీఓ) రాష్ట్రంలోని 16 జిల్లాలతో కూడిన ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేయడం. ఈ డిమాండ్‌తో 2010 నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సెగలు పుట్టిస్తోంది.
- 500 కి.మీ. పొడవైన సరిహద్దుని పంచుకుంటున్న అసోం, నాగాలాండ్ మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యలు. అసోంలో ఉన్న కొంత భూభాగం తమదేనని, రాష్ట్రంలో కలిపేయాలంటూ డిమాండ్లు ఉన్నాయి.
- దాదాపుగా 22 లక్షల జనాభా కలిగిన నాగాలాండ్‌లో 90 వేల మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారు. వారికి ఉపాధి అవకాశాల కల్పన అతి పెద్ద సవాల్‌గా మారింది.
- నాసిరకం రోడ్లు, మౌలికసదుపాయాల కొరత, విద్య, ఆరోగ్యం కూడా ఎన్నికల్లో ప్రభావం చూపించనున్నాయి.



తేరుపై వేణుగోపాలుడు

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట పట్టణంలో ఉన్న చారిత్రక శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మ రథోత్సవం వేడుకలు మంగళవారం భక్తజనం మధ్య ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వి.మునియప్ప పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తేరు ఉత్సవాన్ని ప్రారంభించారు.

న్యూస్‌రీల్

6న బెంగళూరు, తుమకూరుకు ప్రధాని రాక

శివాజీనగర: ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 6న బెంగళూరు, తుమకూరులో పర్యటించబోతున్నారు. ప్రధాని నెల రోజుల్లో పర్యటనకు రావడం ఇది మూడోసారి. 6న బెంగళూరు అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రంలో భారత ఇంధన వారోత్సవాలను ఆయన ప్రారంభిస్తారు. ఆ తరువాత తుమకూరులోని గుబ్బి తాలూకా బిదరహళ్లి కావల్‌లో హెచ్‌ఏఎల్ హెలికాప్టర్ కర్మాగారాన్ని జాతికి అంకితం చేస్తారు. చిక్కనాయకహళ్లి, తిపటూరులో జల జీవన్ మిషన్ పథకాలకు కూడా మోదీ శంకుస్థాపన చేస్తారు. మరికొద్ది నెలల్లో ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అగ్రనేతల పర్యటనలు ఊపందుకున్నాయి. ప్రధాని పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహిళ కడుపులో రూ.7 కోట్ల కొకైన్

యశవంతపుర: రూ.ఏడు కోట్ల విలువ గల కొకైన్‌ను కలిగిన 58 క్యాప్సూల్స్‌ని బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జనవరి 14న ఆఫ్రికాకు చెందిన ఒక 40 ఏళ్ల మహిళ కడుపులో కొకైన్ గుళికలను పెట్టుకొని ఎమిరేట్స్ విమానంలో దిగింది. కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో డ్రగ్స్ సంగతి బయటపడింది. ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి గుళికలను వెలికితీశారు. ఆమెను అరెస్టు చేశారు. ఈ కొకైన్ విలువ రూ. 7 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

బంగారం వ్యాపారుల ఇళ్లలో ఐటీ సోదాలు

బనశంకరి: రాష్ట్ర రాజధానిలోని బంగారు వ్యాపారులకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. పన్నుల ఎగవేత ఆరోపణలపై బెంగళూరులో మంగళవారం 25 చోట్లకు పైగా బంగారు షాపులు, యజమానుల నివాసాలపై 300 మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. జయనగర, యశవంతపుర, బసవనగుడి, చిక్కపేటేతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు సాగాయి. జయనగర బంగారం వ్యాపారి రాజేశ్‌కుమార్ జైన్ ఇంట్లో రికార్డులు పరిశీలించగా పన్ను వ్యత్యాసాలు కనిపించాయి. గొడవలు జరగకుండా భద్రత కోసం సీఏఆర్ సిబ్బంది వెంట వచ్చారు. శంకరపురం బంగారువ్యాపారి ఉత్తమ్‌జైన్ ఫ్లాటులో సోదాలు చేసి ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాత్రి వరకూ సోదాలు కొనసాగాయి.

కానుకల వర్షం కురిసేనా?



కేంద్ర ఆర్థికమంత్రి రాష్ట్రంపై వరాల జల్లు కురిపిస్తారని ఆశాభావం

- నేడే కేంద్ర బడ్జెట్
- ఎన్నికల ఏడాది కావడంతో రాష్ట్రానికి కేటాయింపులపై ఆశలు



ఎన్నికల కోసమైనా తాయిలాలు ఇవ్వాల్సి ఉంది

సాక్షి, బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం బుధవారం కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో సమర్పించనుండగా, కన్నడనాడుకు భారీ కేటాయింపులు ఉంటాయని గంపెడాశలతో రాష్ట్రం ఎదురుచూస్తోంది. మే నెలలో రాష్ట్ర విధాన సభ ఎన్నికలు ఉండడంతో ఓటర్లను ఆకర్షించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు పథకాలను ప్రకటించే అవకాశముందని అంచనా.

ప్రధాని పర్యటనలతో లబ్ధి కలిగేనా

ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి తరచూ వస్తుండడంతో ఈసారి ఎన్నికల నేపథ్యంలో భారీ నజరానాలు దక్కనున్నట్లు అంచనాలు ఏర్పడ్డాయి. ప్రధాని పర్యటనల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ గురించి పదేపదే ప్రస్తావిస్తున్నప్పటికీ కేంద్రం నుంచి కర్ణాటకకు ఏమి రావడం లేదని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నారు. ఇలాంటి సందర్భంలో వివిధ పథకాలు, ప్రాజెక్టులను ఈ సారి బడ్జెట్‌లో కన్నడిగులకు కేటాయించి ఓటర్లను ఆకట్టుకోవడంతో పాటు ప్రతిపక్షాల నోళ్లు మూయించే అవకాశముంది. లేని పక్షంలో మరింత జోరుగా విమర్శలు తప్పవు.

రాష్ట్రం నుంచి భారీగా ప్రతిపాదనలు

- ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏయే పథకాలకు నిధులు కావాలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతిపాదనలు పంపించింది.
- 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రానికి రావాల్సిన రూ. 5 వేల కోట్లను విడుదల చేయాలని కోరింది.
- భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కూడా ప్రతిపాదనల్లో కోరింది. మేకెదాటు, మహదాయి ఎత్తినహోళె ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సత్వర అనుమతులు, నిధుల కేటాయింపులు జరుగుతాయని ఆశాభావంతో ఉంది.
- రాష్ట్రానికి పలు కొత్త రైళ్లు, రైల్వేప్రాజెక్టులను కేటాయించాలని, స్మార్ట్ సిటీ యోజన కింద మరిన్ని రాష్ట్రంలో నగరాలను చేర్చాలని కోరింది.
- వైద్య విజ్ఞాన సంస్థ అయిన ఎయిమ్స్‌ను మంజూరు చేయాలని కోరుతోంది.
- బెంగళూరు సబర్బన్ రైల్వేకు ఈసారి కేటాయింపులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాల్లో సస్పెన్స్ ఏర్పడింది.

బిళిగిరి అడవుల్లో కొత్త పక్షి జాతులు



మైసూరు: చామరాజనగర జిల్లాలోని బిళిగిరిరంగనాథ స్వామి పులుల అభయారణ్యం (బీఆర్‌టీ) లో రెండు కొత్త జాతి పక్షులను కనుగొన్నారు. ఎకో వాలంటీర్స్ గ్రూప్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో నిర్వహించిన పక్షుల అన్వేషణలో వీటిని గుర్తించారు. దాండేలి అడవుల్లో మాత్రమే కనిపించే ది గ్రేట్ హార్న్‌బిల్ అనే పక్షులు చాలా సంవత్సరాల తరువాత బీఆర్‌టీ అడవుల్లో దర్శనమిచ్చాయి. అవే కాకుండా నాదర్న్ షావెలర్, నాదర్న్ పిన్నెల్ పక్షులు కనిపించాయి. ఇక్కడ 11 సంవత్సరాల తరువాత పక్షుల సమీక్ష జరిపారు. మొత్తం 50 మంది స్వయం సహాయకులతో కూడిన 25 బృందాలు కెమెరాలు, బైనాక్యులర్లను ఉపయోగించి కొత్త రకం పక్షుల కోసం గాలించారు. 274 వైవిధ్య పక్షి జాతులు ఇక్కడ ఉన్నట్లు కనుగొన్నారు.

పార్కులో కూర్చుంటే జరిమానా

- పట్టపగలు ఓ పోలీస్ వసూళ్లపర్వం
- సోషల్ మీడియాలో బాధితురాలి ఆక్రోశం

కృష్ణరాజపురం: మా సేవలు ఊరికే రావు. ప్రజలకు భద్రత కల్పించాలంటే.. చాలా ఖర్చవుతుంది అన్నట్టుగా ఉంది కొందరు ఖాకీల వ్యవహారశైలి. వారి వల్ల నిజాయతీగా పనిచేసేవారిని కూడా అనుమానంతో చూసే పరిస్థితి నెలకొంది.

ఐటీ సిటీలో సంపిగెహళ్లి, ఆడుగోడి పోలీసులు ప్రజల నుంచి డబ్బు తీసుకోవడం రచ్చ కావడం మరిచిపోకముందే మరో సంఘటన చోటుచేసుకుంది. ఉద్యానవనంలో కూర్చుని ఉన్న స్నేహితులను ఓ కానిస్టేబుల్ బెదిరించి వారి వద్ద నుంచి రూ. 1000 వసూలు చేశాడు.

ఫొటోలు తీసి, డబ్బు ఇవ్వాలని..

వివరాలు.. జనవరి 29వ తేదీన నగరంలోని వైట్‌ఫీల్డ్ వద్ద కుందళహళ్లిలో ఉన్న ఉద్యానవనంలో ఆర్ష లతీఫ్ అనే యువతి, స్నేహితునితో కూర్చుని ఉంది. కులాసాగా మాట్లాడుకుంటూ ఉండగా ఒక కానిస్టేబుల్ వచ్చి వారిని తన మొబైల్‌తో ఫొటోలు తీయసాగాడు. ఇక్కడ పార్కులో ఏం చేస్తున్నారు?, ఇక్కడ ఉండడానికి అనుమతి లేదు అని వారిని గదమాయించాడు.



సదరు పోలీస్, బైక్ ఫోటోను జత చేసి ట్వీట్ చేసిన బాధిత యువతి ఆర్ష లతీఫ్

తాము ఏమీ చేయడం లేదని, ఊరికే కూర్చుని ఉన్నామని చెప్పారు. పార్క్‌లో కూర్చోడానికి కూడా పర్మిషన్ కావాలా? అని యువతీ యువకుడు అడిగారు. దాంతో కానిస్టేబుల్.. ఏమిటీ రూల్స్ మాట్లాడుతున్నారు? రండి స్టేషన్‌కు వెళదాము, అక్కడ అన్నీ బయటకి వస్తాయని బెదిరించారు. ఇక్కడే అయితే రూ. వెయ్యి జరిమానా కట్టి వెళ్లిపోండి. స్టేషన్‌కు వస్తే మీకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించి, వారి వద్ద నుంచి రూ . వెయ్యి ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. తరువాత తమ బాధాకర అనుభవం ఇదీ యువతి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ బాగోతంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సదరు పోలీస్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.



వసూళ్లకు పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్

పేదలకు గృహాల పంపిణీ

బనశంకరి: యలహంక నియోజకవర్గంలో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో లక్ష బహుళ అంతస్తుల వసతి పథకం ద్వారా నిర్మించిన ఇళ్లను సీఎం బసవరాజ బొమ్మై మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు 15 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించి నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. కావాల్సింది రూ.15 వేలకోట్లు, కానీ కేటాయించింది రూ.3 వేల కోట్లు అని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను పక్కదారి పట్టించడం సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శలతో మండిపడ్డారు. తాము వచ్చిన తరువాత 492 ఎకరాలు భూమిని వేర్వేరు ప్రాంతాల్లో తీసుకుని మొదటి దశలో 5 వేల ఇళ్లు నిర్మించి అందిస్తున్నామని, దశలవారీగా 50 వేల ఇళ్ల ను అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వి.సోమణ్ణ, ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ పాల్గొన్నారు.



కొత్తగా నిర్మించిన గృహ వసతి సముదాయాలు

డీకే సీడీ నా వద్ద ఉంది

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ లఖన్ జార్కిహొళి

శివాజీనగర: బెళగావికి వచ్చినపుడు డీకే శివకుమార్ ఎక్కడ ప్యాంట్ విప్పుతున్నారు అనేది తెలుసు. నా ఆయన సీడీ ఉంది అని బెళగావికి చెందిన బీజేపీ మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి సోదరుడు, ఎమ్మెల్సీ లఖన్ జార్కిహొళి ఆరోపించారు. డీకేని రాజకీయంగా ఓడిస్తానని జార్కిహొళి సోమవారం ప్రకటించడం తెలిసిందే. ఈ తరుణంలో లఖన్ మంగళవారం ట్వీట్ చేస్తూ ఏకవచనంతో డీకేపై విమర్శలు గుప్పించారు. తన వద్ద ఆయన సీడీ ఉందని చెప్పారు. లఖన్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అయినా సొంత పార్టీ నేతపై విమర్శలు చేయడంతో ఆయన బీజేపీలోకి చేరతారనేది ఖాయమైంది.

డీకేపై సీఎంకు రమేశ్ ఫిర్యాదు

గతంలో తనపై సీడీ విడుదల చేసిన డీకే మీద విచారణ జరిపించాలని రమేశ్ జార్కిహొళి బెంగళూరులో సీఎం బొమ్మైని కలిసి ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ లేఖను ఈ సందర్భంగా విడుదల చేశారు. సీడీలు ఉన్నాయంటూ నాయకులను, ఉన్నతాధికారులను బెదిరిస్తున్నారని చెప్పారు. దేవనహళ్ళి గస్తీలో ఇటువంటి సీడీలు లభించాయని తెలిపారు.

క్లుప్తంగా

సామూహిక వివాహాల్లో ఒక్కటైన జంటలు



వివాహాల్లో ఒక్కటైన వధూవరులు

రాయచూరు రూరల్: మానవుడు నిత్య జీవితంలో భక్తిభావన పెంపొందించుకునేందుకు కృషి చేయాలని సుత్తూరు శివరాజ దేశికేంద్ర స్వామీజీ పిలుపునిచ్చారు. దేవదుర్గ తాలూకాలోని గబ్బూరు బూదిబసవేశ్వర 20వ జాతర ఉత్సవాల్లో భాగంగా 174 సామూహిక వివాహాల్లో దంపతులకు పెళ్లిళ్లు చేసి మాట్లాడారు. నేడు మానవుడు పని ఒత్తిళ్లతో ప్రతి నిత్యం ఎంతో మదనపడుతున్నాడని, ప్రతి రోజూ కొంత సమయాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేటాయించాలన్నారు. సమావేశంలో గబ్బూరు బృహన్మఠ బూదిబసవేశ్వర శివాచార్య మహాస్వామీజీ, ఎమ్మెల్యేలు శివనగౌడ నాయక్, బసనగౌడలున్నారు.

కువైట్‌లో చిక్కుకున్న మహిళ.. జిల్లా యంత్రాంగం సాయం

మైసూరు: కొడగు జిల్లా విరాజపేట తాలూకా కరడిగోడు గ్రామానికి చెందిన పార్వతి అనే మహిళ కువైట్‌కు ఉపాధి కోసం వెళ్లి వీసా గడువు ముగిసిపోవడంతో అక్కడే చిక్కుకుపోయింది. దీంతో కరడిగోడులో ఉన్న బాధితురాలి తల్లి కొడగు కలెక్టర్‌కు సాయం కోసం విజ్ఞప్తి చేసింది. కలెక్టర్ ఆదేశాలతో కొడగు జిల్లా అత్యవసర సేవల నిర్వహణాధికారి ఆర్.ఎం. అనన్య వాసుదేవ కువైట్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయంతో మాట్లాడారు. వీసాను పునరుద్ధరించడంతో ఆమె తిరిగి భారత్‌కు చేరుకుంది. మంగళవారం ఉదయం 9.30 గంటలకు చెన్నై విమానాశ్రయంలో దిగి సొంతూరికి వచ్చింది.

మినీ విధానసౌధ పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి: పట్టణ ప్రజల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుందని ఎమ్మెల్యే జేఎన్.గణేష్ తెలిపారు. పట్టణ చరిత్రలో నూతనంగా ప్రారంభమై ప్రగతిలో ఉన్న మినీ విధాన సౌధ నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీక్షించారు. ఇకపై ప్రభుత్వ కార్యాలయాలన్నీ మినీ విధానసౌధలో ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ముగిసిన బాలల ప్రతిభా శిబిరం

మండ్య: సాంస్కృతిక రంగంలో రాణించడానికి డబ్బులు ముఖ్యం కాదు, మంచి తపన ఉండాలి. అలాంటివారిని రంగభూమి, శిక్షణ, బాలల సాంస్కృతిక రాయబారిగా చేయాలి అని కొత్తత్తి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు నిర్మల అన్నారు. బాల వికాస అకాడమీ ధారవాడ, నందిని సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండ్య తాలూకాలోని కొత్తత్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వారంరోజులు జరిగిన బాలల ప్రతిభా శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిలోను ఏదో ఒక కళ ఉంటుందని, వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా బాలల ప్రదర్శనలు అలరించాయి.

జల్‌జీవన్ పథకం పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో జల్ జీవన్ మిషన్‌తో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ తెలిపారు. మంగళవారం తాలూకాలోని అరసికెరెలో నూతనంగా జల్‌జీవన్ పథకం పనులకు రూ.కోటి నిధులు కేటాయించారన్నారు. భూములకు నీరందించేందుకు చెరువులకు రూ.2 కోట్లతో పైపులైన్లు, వంతెనల నిర్మాణాలు చేపడుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఫ్లవర్ షోకు 3.30 లక్షల వీక్షకులు

- రూ. 1.97 కోట్ల ఆదాయం



బనశంకరి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గత పదిరోజులుగా లాల్‌బాగ్ ఉద్యానంలో జరిగిన 213వ ఫలపుష్ప ప్రదర్శన సోమవారంతో సమాప్తం కాగా, మొత్తం 3.30 లక్షల మంది సందర్శించారు. టికెట్ల అమ్మకాల ద్వారా రూ.1.97 కోట్లకు పైగా ఆదాయం గడించి రికార్డు సృష్టించింది. గత ఏడాది ఆగస్టులో దివంగత రాజ్‌కుమార్, పునీత్‌రాజ్‌కుమార్ థీమ్‌తో ఏర్పాటుచేసిన స్వాతంత్య్ర దినోత్సవ ఫ్లవర్ షోను 9 లక్షలమందికిపైగా వీక్షించగా రూ.3.36 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి బెంగళూరు చరిత్ర థీమ్‌తో ప్రదర్శన సాగిందని లాల్‌బాగ్ జాయింట్ డైరెక్టర్ ఎం.జగదీశ్ తెలిపారు.

మైసూరు జిల్లాలో చిరుతల కట్టడికి టాస్క్‌ఫోర్స్



టి.నరిసిపుర తాలూకాలో ఇటీవల చిరుత దాడిలో మరణించిన వృద్ధురాలు





చిరుత బలితీసుకున్న యువతీ యువకులు (ఫైల్)

బెడద ఉన్న ప్రాంతాల్లో ముమ్మర గస్తీ

మైసూరు: మైసూరు జిల్లాలో చిరుతల దాడులు ఎక్కువ కావడంతో పాటు వాటి దాడుల్లో అనేకమంది ఇప్పటికే ప్రాణాలు కోల్పోవడంతో జిల్లా యంత్రాంగం ఆ మృగాల అడ్డుకట్టకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. జిల్లాలోని టి.నరిసిపుర తాలూకాలో మూడు నెలల్లో నలుగురిని చిరుతలు ప్రాణాలు తీశాయి. ఒక యువతి, యువకుడు, వృద్ధురాలు ఇందులో ఉన్నారు. పలుగురు ఈ దాడుల్లో గాయపడ్డారు. అలాగే మైసూరు నగరంతో పాటు నంజనగూడు, హెచ్‌డి కోటె, సరగూరు, మండ్య, పాండవపుర, నాగమంగళ పరిధిలో చిరుతల సంచారం ఎక్కువగా ఉండటంతో వాటికి అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. గత మూడు సంవత్సరాల్లో ఎక్కువగా చిరుతలు గ్రామాల్లోకి, పొలాల్లోకి వచ్చి పశువులను, వీధి కుక్కలను చంపడం జరిగింది.

బృందాలుగా పహరా

ఈ నేపథ్యంలో జిల్లాలో మొదటిసారి చిరుతల టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ బృందాలు చిరుతల బెడద ఉన్న గ్రామాల్లో సంచరిస్తూ చిరుతలు దాడులు చేయకుండా గస్తీ నిర్వహిస్తారు. ఒక ఉన్నతాధికారిని టాస్క్‌ఫోర్స్ చీఫ్‌గా నియమించారు. ఈ అధికారి సుమారు 58 మంది సిబ్బందితో కలిసి 4 ఉప విభాగాల్లో 5 వాహనాలతో కాపలా కాస్తారు. అదనంగా కాంట్రాక్టు సిబ్బందిని విధుల్లోకి తీసుకుంటారు. గ్రామస్తులతో చిరుతల సంచారంపై సమాచారం తీసుకుంటూ వాటి కట్టడికి ప్రయత్నాలు సాగిస్తారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన



బళ్లారిటౌన్: కౌల్‌బజార్‌లోని ఎస్టీ విద్యార్థుల హాస్టల్‌లో నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్న స్థానిక అధికారులపై చర్యలు చేపట్టాలని మంగళవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, జెఎంఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు నగరంలో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. జిల్లాధికారితో పాటు ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులపై అట్రాసిటీ చట్టం కింద తనిఖీ జరపాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వార్డెన్ శివప్పను ఉద్యోగం నుంచి వెంటనే తొలగించాలని, ఇటీవల హాలకుంది వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హాస్టల్ విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం అందించాలని, హాస్టల్‌లో నాసిరకం ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తూ నిధులు కాజేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేశారు. ఆందోళనలో సంఘాల నేతలు భీమనగౌడ, దొడ్డబసవరాజు పాల్గొన్నారు.

ధార్మిక కేంద్రం ఎమ్మిగనూరు



మాట్లాడుతున్న మంత్రి శ్రీరాములు, స్వామీజీ

కంప్లి: ఆధ్యాత్మిక, ధార్మిక కేంద్రం ఎమ్మిగనూరు గ్రామం మఠాధిపతులకు, దేవతలకు నిలయం కావడం ఈ గ్రామస్తుల పుణ్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీ.శ్రీరాములు తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరులో చలవాది సమాజ ఆరాధ్య దైవ్యమైన మూక మారెమ్మ దేవి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, దేవస్థానం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమాలు ఎమ్మిగనూరు మఠాధిపతి వామదేవ శివాచార్యుల సాన్నిధ్యంలో జరిగాయి. అతిథులుగా మాజీ ఎమ్మెల్యే టీహెచ్.సురేష్‌బాబు, మాజీ ఎంపీ జే.శాంత, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిందపడిన బైకిస్టుపై దూసుకెళ్లిన లారీ

బనశంకరి: దేవనహళ్లిలో అధ్వాన్నంగా మారిన రోడ్డులో బైకిస్టు జారి పడగా అదే సమయంలో వెనుక నుంచి లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాగేపల్లి కి చెందిన వెంకటేశ్ మంగళవారం దేవనహళ్లిలో బైకులో వెళుతున్నాడు. గుంతలమయంగా మారిన రోడ్డులో బైకు స్కిడ్ అయ్యింది. కిందపడిన వెంకటేశ్ పై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలతో చనిపోయాడు. దేవనహళ్లి ట్రాఫిక్‌పోలీసులు కేసునమోదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో స్నాచర్ ఆత్మహత్యాయత్నం

పోలీస్ స్టేషన్‌లో ఫినాయిల్ తాగి చైన్‌స్నాచర్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన బెంగళూరు రాజగోపాల నగర పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. స్నాచింగ్ కేసులో అరెస్టైన సుల్తాన్ మరుగుదొడ్డిలోకి వెళ్లి ఫినాయిల్ తాగాడు. వెంటనే పోలీసులు సుల్తాన్ ను ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

మరో వారంలో జేడీఎస్ రెండో జాబితా

- పూర్తి మెజార్టీ లభిస్తే పంచరత్న పథకాలు అమలు చేస్తాం
- మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి



మాట్లాడుతున్న మాజీ సీఎం కుమారస్వామి

సాక్షి,బళ్లారి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మరో వారం రోజుల్లో జేడీఎస్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటిస్తామని ఆ పార్టీ నేత, మాజీ సీఎం కుమారస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లాలోని సండూరు నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోను, విలేకరులతో మాట్లాడారు. సండూరు నియోజకవర్గం నుంచి సోమప్పతో పాటు 76 నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ప్రకటించామన్నారు. రెండో జాబితాను సిద్ధం చేస్తున్నామన్నారు. బళ్లారితో పాటు ఇతర జిల్లాల్లో కూడా పార్టీ నాయకులను, కార్యకర్తలను ఇతర పార్టీల నాయకులు హైజాక్ చేస్తున్నారన్నారు. అయితే జనం తమ వైపు ఉన్నందున పార్టీ అధికారంలోకి వచ్చేందుకు వీలవుతుందన్నారు. రెండు జాతీయ పార్టీలను జనం తిరస్కరిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందేనన్నారు. 2018లో తాను సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పని చేశామన్నారు. అయితే అధికారం చలాయించడానికి అవకాశం ఇవ్వలేదని, దీంతో ఆశించిన అభివృద్ధి పనులు చేయలేదన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలతో అభివృద్ధి చేయడం వీలుకాదన్నారు. స్వతంత్రంగా అధికారంలోకి వచ్చేందుకు జేడీఎస్‌కు సహకారం అందించాలన్నారు. తమ పార్టీకి పూర్తి మెజార్టీ ఇస్తే పంచరత్నాలు అమలు చేస్తామన్నారు. హాసన్ జిల్లాలో అభ్యర్థుల ప్రకటనతో పార్టీలో చోటు చేసుకున్న విభేదాలు పరిష్కారం అవుతాయన్నారు. అభ్యర్థుల ప్రకటనతో ఇలాంటివి సహజమేనన్నారు. జేడీఎస్ అధికారంలోకి వస్తే ప్రతి ఎకరాకు రూ.10 వేలు సహాయధనం ఇస్తామన్నారు. పంచరత్నాలతో రాష్ట్రం సమగ్రాభివృద్ధికి దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో జేడీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాంతీయ పార్టీలూ విజయం సాధిస్తాయి

- 108 సేవలకు వైఎస్సారే ఆదర్శం
- కేఆర్‌పీపీ అధ్యక్షుడు గాలి జనార్దన్ రెడ్డి



కళ్యాణ రథానికి పూజల్లో పాల్గొన్న గాలి దంపతులు, కుమార్తె



పాల్గొన్న అభిమానులు

గంగావతి రూరల్: గంగావతి క్షేత్రంతో పాటు కిష్కింధా అంజనాద్రి అభివృద్ధికి రూ.500 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తామని మాజీ మంత్రి, కేఆర్‌పీపీ వ్యవస్థాపకులు గాలి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం తాలూకాలోని ఆనెగుందిలోని శ్రీరంగనాథ దేవస్థానం ముందు కళ్యాణ రథయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడారు. బళ్లారిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేసి అక్కడి నుంచి కిష్కింధా వరకు 8 లైన్ల రోడ్డు విస్తరణ ఏర్పాటుతోపాటు క్షేత్ర సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆనాడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని ఆదర్శంగా తీసుకొని తాను, అప్పటి రాష్ట్ర ఆరోగ్య మంత్రి బి.శ్రీరాములు కర్ణాటకలో కూడా 108 సేవలను ప్రారంభించామన్నారు. చాలామంది ప్రాంతీయ పార్టీలు సక్సెస్ కావడం చాలా కష్టం అంటున్నారు కానీ పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపకులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి సక్సెస్ అయ్యారు, తమిళనాడులో ప్రాంతీయ పార్టీలు విజయవంతం అయినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కుటుంబంతో కలిసి కళ్యాణ రథానికి పూజలు చేసి ప్రారంభించారు.

అమ్మవారికి విశేషాలంకారం



గంగాభవాని దేవికి అలంకరణ

చింతామణి: పట్టణంలోని నారసింహపేటలో వెలసిన గంగాభవానికి అమ్మవారికి మాఘమాసం మంగళవారం పురస్కరించుకొని ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తాదులు దర్శించుకొని పూజలు చేశారు. అలాగే తాలుకాలోని అంబాజీ దుర్గా హోబళి చాంద్రహళ్లి గ్రామంలో మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం ప్రారంభించారు. విగ్రహ ప్రతిష్ఠాపన ను వేద పండితులు ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్ నేత ర్యాలీ

బళ్లారిఅర్బన్: నగరంలోని 4వ వార్డు గుగ్గరహట్టి ప్రాంతంలోని మంగళవారం కాంగ్రెస్ నాయకుడు నారా భరత్ రెడ్డి ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా కుక్కర్లను పంపిణీ చేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తమకు కాంగ్రెస్ పార్టీ అదరించి ఎమ్మెల్యే టిక్కెట్ అవకాశం కల్పిస్తుందని ఎంతో నమ్మకం ఉందన్నారు. అవినీతి నిర్మూలకు యువకులతో కలిసి నగరంలో పోరాడుతున్నానన్నారు. అన్వర్‌బాషా, వార్డు కార్పొరేటర్ డీ.త్రివేణి, కమిల సూరి, హొన్నప్ప, వివేక్, మించు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధరామేశ్వర జయంతి



ఊరేగింపులో గవియప్పను సన్మానిస్తున్న దృశ్యం

హొసపేటె: భోవి సోదరులు ఎంతో కష్టజీవులని, విద్యావంతులై అన్ని రంగాల్లో ముందుకు రావాలని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప తెలిపారు. మంగళవారం విజయనగర జిల్లా భోవి వడ్డర సంఘం, తాలూకా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్మయోగి సిద్ధరామేశ్వర జయంతి ఊరేగింపును ప్రారంభించి ఆయన మాట్లాడారు. భోవి సమాజ సోదరులు ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. అనంతరం సిద్ధరామేశ్వర స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. ఆ సమాజ నేతలు దొడ్డరామణ్ణ, వెంకటరమణ, అంజిని, గాళెప్ప, చిదానందప్ప, హనుమంతప్ప, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ చూడొద్దన్నారని బాలుడు ఆత్మహత్య

యశవంతపుర: మొబైల్‌ఫోన్‌ని ఎక్కువగా వాడవద్దని తల్లిదండ్రులు మందలించినందుకు బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళూరు పట్టణంలోని కోటిమురలో జరిగింది. జగదీశ్ కొడుకు జ్ఞానేశ్ (14) 9వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో ఎప్పుడూ మొబైల్ చూస్తూ ఉండేవాడు. దీంతో తల్లిదండ్రులు ఇది మంచి పద్ధతి కాదని గదమాయించారు. దీంతో ఆక్రోశానికి లోనైన జ్ఞానేశ్ రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న కార్మికులు

బళ్లారి రూరల్ : అన్ని ప్రభుత్వ శాఖలు, వసతి నిలయాల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఏఐయూటీయూసీ బళ్లారి శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ప్రమోద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ముందు చేపట్టిన కార్మికుల ధర్నాలో పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ధర్నాలో కార్యదర్శి జి.సురేశ్, వసతినిలయ కార్మికులు పాల్గొన్నారు.

రాయచూరులో..

రాయచూరు రూరల్: కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని రాష్ట్ర సంయుక్త హాస్టల్ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ఆందోళన చేపట్టి మాట్లాడారు. అనంతరం స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో గాయత్రి, అణ్ణప్ప, వీరేష్, సులోచన, అంబిక, పార్వతి, ఉమాదేవి, నాగమ్మలున్నారు.

కాంట్రాక్టు పౌర కార్మికుల సమ్మె!

బనశంకరి: నగర, స్థానిక సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న చెత్తసేకరణ వాహనాల డ్రైవర్లు, నీటి సరఫరా సహాయకులు ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని బుధవారం నుంచి సమ్మె చేయనున్నారు. కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఎంబీ నాగణ్ణగౌడ తెలిపారు. రాష్ట్రంలో 15 వేలకు పైగా కార్మికులు ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పారు.

హమాలీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వండి

బళ్లారి రూరల్ : నగరంలోని హమాలీలకు ప్రభుత్వం పక్కా ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని హమాలీల సంఘ అధ్యక్షుడు వీరయ్య తెలిపారు. మంగళవారం పత్రికా భవన్‌లో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎంసీ హమాలీల మాదిరిగా కాటన్‌మిల్లు, ఆయిల్‌మిల్లు హమాలీలకు పక్కా ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న నగరంలో భారీ పోరాటం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాటానికి కాంగ్రెస్ మాజీ మంత్రి దివాకర్‌బాబు మద్దతుగా నిలిచి పాల్గొననున్నట్లు తెలిపారు. హమాలీ సంఘం ప్రముఖులు పోతప్ప, తిమ్మప్ప పాల్గొన్నారు.



మధ్వనవమి శోభాయాత్ర

మైసూరు: మైసూరు సరస్వతిపురంలో ఉన్న శ్రీ కృష్ణధామ దేవాలయంలో శ్రీకృష్ణమిత్ర మండలి, శ్రీకృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో మధ్వ నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమధ్వాచార్యుల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవమాన హోమం, విష్ణు సమహ్రనామ పారాయణ, సుమధ్వ విజయ పారాయణ, వాయుస్తుతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మహామంగళ హారతి అనంతరం ఉత్సవ మూర్తులను తేరులో ఉంచి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

విద్యార్థులను సత్పౌరులుగా తీర్చిదిద్దాలి



హీరో శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కంప్లి: విద్యార్థులను ఉత్తమ విద్యాబోధనతో సత్పౌరులుగా తీర్చిదిద్దాలని తెలుగు సినీ నటుడు శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని కమ్మవారి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయనగర పాఠశాలకు విచ్చేసిన ఆయనను నిలువెత్తు పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కేఎస్ఎస్‌వీబీ సుబ్బారావు, పదాధికారులు కోనేరు శ్రీరామకృష్ణ, కే.శ్రీనివాసరావు, భట్టా ప్రసాద్, అల్లు అశ్వత్‌నాయుడు, ఎస్.కొండయ్య, ఎస్.పురుషోత్తం, చిగురుపాటి రామబసవేశ్వర రావు, నాగేశ్వరరావు, పీ.సత్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం కే.విష్ణు పాల్గొన్నారు.

బీజేపీలోకి భారీగా చేరికలు

కంప్లి: పట్టణంలోని తుంగభద్ర కార్యాలయంలో పెద్ద ఎత్తున యువత, ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు సమక్షంలో బీజేపీలో చేరగా వారందరినీ కాషాయ కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. బ్రహ్మయ్య, పురుషోత్తం, సిద్దప్ప, పంపాపతి, వీరేష్, సుధాకర్, డాక్టర్ వెంకటేష్, లింగనగౌడ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

కోలారులో సిద్ధరామయ్యకు ఇల్లు సిద్ధం

- ఇంటిని పరిశీలించిన యతీంద్ర సిద్ధరామయ్య



సిద్ధరామయ్య కోలారులో బస చేసే ఇల్లు ఇదే

కోలారు : వచ్చే ఎన్నికల్లో మాజీ సీఎం సిద్ధరామయ్య కోలారు నుంచి పోటీ చేయాలని నిర్ణయించడంతో ఆయన కోసం కాంగ్రెస్ నాయకులు ఇంటిని సిద్ధం చేశారు. నగర సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని సిద్ధరామయ్య నివాసాన్ని ఎంపిక చేశారు. మంగళవారం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్య కోలారుకు వచ్చి సిద్ధరామయ్య నివాసం ఉండే ఇంటిని పరిశీలించి వెళ్లారు. ఇదే సమయంలో అయన నగరంలోని కోలారమ్మ ఆలయం, బసవనత్త గ్రామంలోని గంగమ్మ ఆలయం, మధ్యాహ్నం క్లాక్ టవర్ వద్ద ఉన్న దర్గాను సందర్శించారు., అనంతరం ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో మైనారిటీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు.

వీడియో తీసి మహిళకు బెదిరింపులు

- పరారీలో నిందితుడు

బనశంకరి: జ్యూస్‌లో మత్తు మందు కలిపి ఇచ్చి అసభ్యంగా వీడియోలు తీసి బెదిరిస్తున్న దుండగునిపై ఓ మహిళ రామమూర్తినగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. మండ్య జిల్లా డింకా గ్రామానికి చెందిన మంజు సుంకదకట్టెలో ఉండేవాడు. అక్కడే నివసించే ఒక మహిళ తమ ఊరికి చెందినదేనని తెలిసి పరిచయం పెంచుకున్నాడు. మహిళ ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేవాడు. 2020లో మంజు ఒక యువతితో కలిసి మహిళ పనిచేసే చోటుకు వెళ్లి తన పుట్టిన రోజుకు రావాలని తెలిపాడు. మహిళ వెళ్లగా, పండ్లరసంలో మత్తుమందు కలిపి ఇవ్వగా, అది తాగిన మహిళ స్పృహ కోల్పోయింది. ఈ సమయంలో మొబైల్ ఫోన్‌తో అశ్లీలంగా వీడియోలు తీశాడు. మూడో రోజు ఆమెకు వీడియోలు చూపించి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. తనతో మాట్లాడాలని, లేకపోతే ఈ వీడియో మీ భర్తకు చూపిస్తానని, సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేస్తానని వేధించాడు. చివరకు రెండేళ్ల అనంతరం మహిళ ఫిర్యాదు చేసింది. పరారీలో ఉన్న మంజు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సన్మానం

బనశంకరి: తుమకూరు జిల్లా శిర తాలూకాలో హందికుంట అగ్రహార చెరువులో మునిగిపోతున్న ఇద్దరు బాలికలను ఆర్టీసీ బస్ డ్రైవర్ మంజునాథ్ కాపాడారు. ఈ నేపథ్యంలో మంగళవారం శాంతినగరలోని కేఎస్ఆర్‌టీసీ ఆఫీసులో సంస్థ ఎండీ అన్బుకుమార్ ఆయనను సన్మానించి రూ.10 వేలు నగదు పురస్కారం అందజేశారు.

త్వరలో సద్గురు ఆశ్రమం ప్రారంభం

కోలారు : చిట్నహళ్లి వద్ద రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సద్గురు ఆశ్రమాన్ని త్వరలో ప్రారంభిస్తున్నట్లు ఆశ్రమం ధర్మదర్శి ఎస్.వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆశ్రమంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలతో ప్రజలను ఆధ్యాత్మికత వైపు మళ్లించడానికి ఆశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హార్మోనియం విద్వాంసుడు నారాయణస్వామి, దాస సాహిత్య పరిషత్ సభ్యుడు బళె సీతారాం, గోపాలకృష్ణప్ప పాల్గొన్నారు.

సిద్ధూ ఓటమికి ప్రతిన బూనండి

- ఆర్‌పీఐ కార్యాధ్యక్షుడు వెంకటస్వామి

కోలారు : నియోజకవర్గం నుంచి మాజీ సీఎం సిద్ధరామయ్య పోటీ చేస్తే ఆయనను చిత్తుగా ఓడిస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని ఆర్‌పీఐ జాతీయ కార్యాధ్యక్షుడు వెంకటస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్ధరామయ్యను ఓడించడానికి దళితులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలను అందించాలి

హొసపేటె: నరేగా పథకం కింద ఉపాధి పనులను చేపట్టిన కూలీ కార్మికులకు వేతన బకాయిలను అందించాలని డిమాండ్ చేస్తూ విజయనగర జిల్లా గ్రామీణ కూలీ కార్మికుల సంఘం నాయకురాళ్లు అక్క మహాదేవి, కొట్రమ్మ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులు అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.

యాత్ర విజయవంతానికి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

మాలూరు : ఫిబ్రవరి 3న కేజీఎఫ్‌కు వస్తున్న ప్రజా ధ్వని యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. నగర, గ్రామీణ ప్రాంతాల నుంచి 20 వేల మంది పార్టీ కార్యకర్తలు కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రజాధ్వని కార్యక్రమం కోసం పిచ్చర్ రోడ్డులో భారీ వేదికను నిర్మిస్తారన్నారు.

ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న విద్యార్థులు

శ్రీనివాసపురం: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గుముఖం పట్టడంపై ఉపాధ్యాయులు ఆత్మావలోకనం చేసుకోవాలని ఎమ్మెల్యే రమేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తాలూకా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభ్యసన పండుగను ప్రారంభించి మాట్లాడారు. బీఈఓ ఉమాదేవి, పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు దింబాల అశోక్, తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం నాగరాజ్ , బిఆర్‌సి సమన్వయ అధికారి కె సి వసంత పాల్గొన్నారు.

పాఠ్యేతరాలతో ప్రతిభ వృద్ధి

మాలూరు : విద్యార్థులు పాఠాలతో పాటు, పాఠ్యేతర కార్యక్రమాల్లో కూడా పాల్గొంటే ప్రతిభ వృద్ధి చెందుతుందని కర్ణాటక పబ్లిక్ పాఠశాల అభివృద్ధి సమితి అధ్యక్షుడు అక్రం పాషా తెలిపారు. మంగళవారం మాస్తి గ్రామంలోని పాఠశాల ప్రాంగణంలో క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన 2 రోజుల అభ్యసన పండుగను ప్రారంభించి ఆయన మాట్లాడారు. అభ్యసన పండుగలో నేర్పించే విషయాలు విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతో సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో క్షేత్ర శిక్షణా సమన్వయ అధికారి ఎం.నంజుండేగౌడ, వైస్ ప్రిన్సిపాల్ వెంకటప్ప, ఉపాధ్యాయులు నారాయణస్వామి, సురేష్, సీఆర్‌పీ ఆనందకుమార్ పాల్గొన్నారు.

పోలీసుశాఖకు గౌరవం తీసుకురండి




శిక్షణలో ఉత్తమ ప్రతిభ చూపిన కానిస్టేబుల్‌కు కప్ అందజేస్తున్న ఐజీపీ రవికాంతగౌడ, హాజరైన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు

తుమకూరు : పోలీసులు ప్రజలతో గౌరవంగా నడుచుకోవాలని ఐజీపీ డాక్టర్.బి.ఆర్. రవికాంతగౌడ సూచించారు. శిక్షణ ముగించుకున్న 12వ బ్యాచ్‌కు చెందిన 104 మంది మహిళా పోలీసులకు తుమకూరులోని పోలీసు కవాతు మైదానంలో మంగళవారం నిర్వహించిన పాసింగ్‌ఔట్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. మహిళా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. సమస్యలతో ఠాణా మెట్లు ఎక్కే ప్రజలతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఆరోపణలకు తావివ్వకుండా నిబద్ధతతో పనిచేయాలన్నారు. ప్రతిభ చూపిన కానిస్టేబుళ్లకు బహుమతులు అందించి అభినందించారు. కాగా ఏడు జిల్లాలకు చెందిన మహిళా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు హాజరు కావడంతో మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగ బాధ్యతల్లోకి అడుగు పెడుతున్న తమ పిల్లలను ఆశీర్వదించి అభినందించారు.

క్లుప్తంగా

త్వరలో రోడ్డు పనులు పూర్తి

మండ్య : రూ.14 కోట్లతో శ్రీరంగపట్టణం–కేఆర్ పేటె, చెన్నరాయపట్టణ రోడ్డు పనులు జరుగుతున్నాయని రాష్ట్ర పట్టు, యువ సబలీకరణ, క్రీడా శాఖ మంత్రి డాక్టర్ నారాయణగౌడ తెలిపారు. మంగళవారం ఆయన కేఆర్‌పేటలో విలేకరులతో మాట్లాడారు. అధ్వానంగా మారిన ఈ రోడ్డు దుస్థితిని ప్రజాపనుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. త్వరలో పనులు పూర్తవుతాయన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : విజయపుర పట్టణ ఎస్‌ఐగా నియమితులైన ఎం.ఆర్.అయ్యణ్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ వీరేంద్ర ప్రసాద్ ఎస్‌ఐను అభినందించారు.

వాల్మీకి జాతరను జయప్రదం చేయండి



సమావేశంలో పాల్గొన్న వాల్మీకి నాయకులు

గౌరిబిదనూరు: దావణగెరె సమీపంలోని రాజనహళ్లిలో ఫిబ్రవరి 8, 9వ తేదీలలో జరుగనున్న వాల్మీకి మఠం 25వ వార్షికోత్సవం, 5వ వాల్మీకి జాతర, ప్రసన్నానంద స్వామీజీ 16వ పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని తాలూకా వాల్మీకి నాయక వర్గం నాయకుడు ఆర్.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కాటనకల్లు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్ల విషయంలో స్వామీజీ చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. తాలూకా నుంచి పెద్ద సంఖ్యలో సముదాయ ప్రజలు తరలివెళ్లాలన్నారు. బాబణ్ణ, సీటీ నాగరాజప్ప పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

యశవంతపుర: ప్రేమికురాలితో మాట్లాడుతున్న యువకుడిపై యువతి మాజీ ప్రియుడు, అతడి స్నేహితులు దాడి చేశారు. మంగళూరు కొడికల్ రోడ్డు బాపూజీనగరకు చెందిన సాగర్(23) తన ప్రియురాలితో కలిసి జనవరి 28న పుత్తూరులో కంబళ పోటీలు వీక్షించేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఆ యువతి మాజీ ప్రియుడు చేరుకొని ఆ యువతితో ఏమిటి సంబంధం, ఎందుకు మాట్లాడుతున్నావని సాగర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కౌశిక్, యజ్ఞేశ్, కేశవ, సృజన్, వినీత్, లతేశ్, మన్విత్, మోహిత్, హేమంత్‌పై పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొబ్బరికి మద్దతు ధర రూ. 11,750

- 2నుంచి పేర్ల నమోదుకు అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ వై.ఎస్.పాటిల్

తుమకూరు : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొబ్బరి కొంటామని కలెక్టర్ వై.ఎస్.పాటిల్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో మాట్లాడారు. క్వింటాలు కొబ్బరికి రూ.11,750 చెల్లిస్తామన్నారు. ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్ల వరకు కొబ్బరి కొనుగోలు చేస్తామని చెప్పారు. ఫిబ్రవరి 2నుంచి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తుళు రెండో అధికారిక భాష అమలుపై కమిటీ

శివాజీనగర: తుళు భాషను రెండో అధికారిక రాష్ట్ర భాషగా ప్రకటించాలనే డిమాండ్లపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం డాక్టర్ మోహన్ ఆళ్వా నేతృత్వంలో కమిటీని నియమించింది. డాక్టర్ కేశవ బంగేరా, డాక్టర్ మాధవ కొణాజి, గణేశ్ అమీన్ సంకమర్, పృథ్వీరాజ్ కవత్తారు మణిపాల, వసంత్ శెట్టి, ఉడుపి, చంద్రహాస కణంతురు, సంధ్యా ఆళ్వా, కన్నడ సంస్కృతి శాఖ డైరెక్టర్‌ను సభ్యులుగా నియమించింది. వారం రోజుల్లో ఈ కమిటీ నివేదిక అందించాలని సూచించినట్లు కన్నడ సంస్కృతి శాఖ కార్యదర్శి కే.ఆర్. రమేశ్ తెలిపారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

బొమ్మనహళ్లి : అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కర్ణాటక రక్షణ వేదిక (ప్రవీణ్‌కుమార్ శెట్టి వర్గం) బెంగళూరు నగర జిల్లా కార్యదర్శి ఎస్.రాజేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు బెంగళూరు దక్షిణ విభాగం విద్యాశాఖ అధికారి కే.పంకజను కలిసి వినతి పత్రం అందజేశారు. స్టేట్ సిలబస్‌కు అనుమతి తీసుకొని సెంట్రల్ సిలబస్ బోధిస్తూ లక్షల్లో ఫీజులు గుంజుతున్నారని ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. మహేష్ గౌడ, వసంత్, ప్రశాంత్, పల్లవి, జ్యోతి పాల్గొన్నారు.

గుజరీ దుకాణం దగ్ధం

యశవంతపుర: గుజరీలో అగ్నిప్రమాదం జరిగి లక్షల రూపాయల విలువైన సామగ్రి దగ్ధమైంది. కార్వార జిల్లా కుమటా పట్టణంలోని అళ్వేకోడిలో బాషాషేక్ అనే వ్యక్తి గుజరీ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి మంటలు చెలరేగి దుకాణం మొత్తం వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అప్పటికే వస్తు సామగ్రి కాలిబూడిదైంది.

యువతితో లాడ్జికి వెళ్లిన బీఎంటీసీ డ్రైవర్

- అనుమానాస్పద మృతి

బనశంకరి: విధులకు బయలుదేరిన బీఎంటీసీ డ్రైవరు లాడ్జిలో అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన కెంగేరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడు చెన్నపట్టణ కు చెందిన పుట్టేగౌడ(28) గత 6 నెలల నుంచి బీఎంటీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఇంట్లో డ్యూటీకని చెప్పి బయటకు వచ్చాడు. సాయంత్రం సమయానికి కెంగేరి లాడ్జిలో శవంగా కనిపించారు. మృతదేహంపై గాయాలు ఉన్నాయని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఒక యువతితో కలిసి లాడ్జికి వచ్చి కొద్దిసేపు ఇద్దరు గడిపారు. తరువాత యువతి గదికి బయటి నుంచి లాక్ చేసుకుని వెళ్లింది. లాడ్జి సిబ్బంది గదిని తనిఖీ చేయగా పుట్టేగౌడ మృతి చెంది ఉన్నాడు. మృతుని సోదరుడు సిద్దేగౌడ కెంగేరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తల, ముఖంపై గాయాలు ఉన్నాయని, దీనిపై విచారణ చేయాలని కోరాడు.

పథకాలపై ప్రచారం



కేంద్ర పథకాలను వివరిస్తున్న ఎం.సతీష్‌రెడ్డి

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి ఎమ్మెల్యే, బీబీఎంపీ ఎం.సతీష్ రెడ్డి మంగళవారం మంగమ్మపాళ్య వార్డులోని ఎళ్లకుంటెలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి అనంతరం ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. రమేష్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హత్య

యశవంతపుర: లారీ డ్రైవర్ హత్యకు గురైన ఘటన దక్షిణకన్నడ జిల్లా కార్కళ వద్ద జరిగింది. తమిళనాడుకు చెందిన మణి(36) వివిధ రకాల విత్తనాల లోడుతో సోమవారం కార్కళ వద్ద ఉన్న కర్మాగారానికి చేరుకున్నాడు. సాయంత్రం కావటంతో అన్‌లోడ్ కాలేదు. లారీని అక్కడే నిలిపేశాడు. రాత్రి 8:30 గంటల సమయంలో కేకలు వినిపించాయి. కార్మికులు వెళ్లి చూడగా. డ్రైవర్ మణి గొంతుకు దుండగులు శాలువా బిగించినట్లు హత్య చేసినట్లు తేలింది. కార్కళ రూరల్ పోలీసులు వచ్చి పరిశీలించారు. మరో లారీ డ్రైవర్ వీరబాహు, మణి మధ్య గొడవ జరిగిందని పోలీసులకు సమాచారం అందింది. ఆ దిశగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జాకీ విరిగి ఇద్దరి మృతి

యశవంతపుర: జాకీ విరిగి ట్రాక్టర్ డ్రైవర్, మరొకరు మృతి చెందారు. ఈ ఘటన చిక్కమగళూరు జిల్లా కొప్ప తాలూకా నిలువాగిలు వద్ద జరిగింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం(30), సునీల్ మంగళవారం ట్రాక్టర్‌ను తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో టైర్ పంక్చర్ అయ్యింది. టైరును మార్చే క్రమంలో జాకీ విరిగిపోయింది. దీంతో ఇద్దరూ ట్రాలీ కింద నలిగిపోయి మృతి చెందారు. హరిపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యాపారంలో నష్టపోయి ఆత్మహత్య

మైసూరు: వ్యాపారంలో నష్టపోయిన వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మైసూరులోని రాజీవ్ నగరకు చెందిన మోయిన్‌ఖాన్(32) సీవీ రోడ్డులో గుజరి వ్యాపారం చేసేవాడు. కొంతకాలంగా వ్యాపారం సరిగా జరగక నష్టాలు వచ్చాయి. ఈక్రమంలో రెండు రోజుల క్రితం బంధువుల అంత్యక్రియలకు భార్యా పిల్లలతో కలిసి వెళ్లాడు. వారిని అత్తగారి ఇంటి వద్ద వదలిపెట్టి మైసూరు వచ్చి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా.. చిన్నారి మృతి

యశవంతపుర: ఆటో బోల్తాపడి చిన్నారి మృతి చెందిన ఘటన దక్షిణకన్నడ జిల్లా బెళ్తంగడి వద్ద జరిగింది. కార్కళ నిట్టెకి చెందిన సంతోష్, గీతా దంపతులు తమ ఏడాది వయస్సున్న చిన్నారితో ఆటోలో వెళ్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చిన్నారి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. పూంజాలకట్టె పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈతకు వెళ్లి ఇద్దరు బాలల జల సమాధి

బనశంకరి: ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు మృతి చెందారు. ఈఘటన కోణణకుంటే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జరగనహళ్లి నివాసులైన మోహన్(13), జయంత్(13) సోమవారం పాఠశాలకు వెళ్లకుండా జేపీ నగరలో ఉన్న ఎంఎన్‌సీ స్పోర్ట్స్ అకాడమి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈతకొడుతూ నీట మునిగి మృతి చెందారు. పోలీసులు వెళ్లి మృతదేహాలను వెలికి తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా ఈత కొట్టే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడంలో నిర్వాహకులు విఫలమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈత కొలను నిర్వహణలో లోపాలు ఉండటంతో తమ కుమారుడు మృత్యువాత పడ్డాడని మోహన్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఈత కొలను నిర్వాహకుడిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.

మేయర్‌కు ఫిర్యాదుల వెల్లువ

మైసూరు: మైసురు మహా నగర పాలికె ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అదాలత్‌లో మేయర్ శివకుమార్ పాల్గొని ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పాలికె అధికారులు సమస్యలపై స్పందించడం లేదని, నీటి పన్నులు పెంచి పంపారని, ఇంటి పన్నులను సరిగా కట్టించుకోవడం లేదని, సీఆర్ ఇవ్వడం లేదని, యూజీడీ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పెద్ద సంఖ్యలో ప్రజలు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయా సమస్యలు పరిష్కరించాలని మేయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బాలుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యశవంతపుర: విజయపురలో ఓ సముదాయానికి చెందిన బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఛత్రపతి శివాజీపై ఆ బాలుడు అనుచితంగా కామెంట్లు చేస్తూ వాటిని స్టేటస్‌లో పెట్టాడు. హిందూ సంఘాల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

క్రేన్ల వినియోగంపై ఆంక్షలు

బనశంకరి: ఎయిర్‌షో 2023 నేపథ్యంలో యలహంక చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాల పనుల్లో క్రేన్ల వినియోగంపై బీబీఎంపీ ఆంక్షలు విధించింది. క్రేన్ల ఎత్తు తగ్గించాలని, లేదా వినియోగం ఆపివేయాలని ఆదేశించింది. మాంసం దుకాణాల్లో విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించింది. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు ఈ ఆదేశాలు అమలులో ఉంటాయి.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

మైసూరు: మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఆరోపణలపై చామరాజనగర ఉత్తర పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మునియప్పను సస్పెండ్ చేస్తూ చామరాజనగర జిల్లా ఎస్పీ శివకుమార ఆదేశాలు జారీ చేశారు. హనూరు తాలూకాకు చెందిన మహిళను మునియప్ప వసతి గృహానికి తీసుకెళ్లి అసభ్యకరంగా వ్యవహరించాడు. ఆమె మనో వేదనతో అస్వస్థతకు గురవ్వగా సిమ్స్‌కు తరలించారు. వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై అధికారులు విచారణ చేపట్టి సదరు హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

15 రోజుల్లో పేదలకు హక్కు పత్రాలు

చిక్కబళ్లాపురం: పేదల సంక్షేమమే ధ్యేయమని వైద్యశాఖ మంత్రి సుధాకర్ అన్నారు. తాలూకాలోని దొడ్డ మరళిలో మంగళవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. చిక్కబళ్లాపురం నియోజకవర్గంలో సీఎం గ్రామ వసతి పథకం కింద 22 వేల మందికి ఇంటి హక్కు పత్రాలు, బసవ వసతి పథకం కింద 4 వేల ఇళ్ల గృహ నిర్మాణాలకు అనుమతి పత్రాలను 15 రోజుల్లో అందజేస్తామన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు తుదిదశలో ఉన్నాయని, త్వరలో ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. తారకరత్న ఆరోగ్య పరిస్థితి గంభీరంగానే ఉందని పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. మండ్య ఎంపీ సుమలత బీజేపీలో చేరుతున్నారా అని అడగ్గా మంత్రి అశోక్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించండి

చింతామణి: బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చాలని డీసీ నాగరాజు ఆదేశించారు. సోమవారం ఆయన తాలూకాలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఓటు హక్కు కోసం అర్హులైన వారు ఆన్‌లైన్‌లో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ మునిస్వామిరెడ్డి, నగరసభ కమిషనర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

విడాకుల కోసం వచ్చి దండలు మార్చుకున్నారు



జడ్జి సమక్షంలో దండలు మార్చుకుంటున్న దంపతులు మంజునాథ్, పార్వతమ్మ

తుమకూరు : విడాకులకు ప్రయత్నిస్తున్న దంపతులకు న్యాయమూర్తి బుద్ధిమాటలు చెప్పి వారిని ఒక్కటి చేశారు. వివరాలు.. తుమకూరు జిల్లా చిక్కనాయకనహళ్లి తాలూకా పరిధిలోని దసోడి సమీపంలో ఉన్న మరెనాడులో మంజునాథ్, పార్వతమ్మకు దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే తనకు దేవుడు ఆవహించాడని, భార్యను వదిలివేయాలని చెప్పాడని అంటూ మంజునాథ్ భార్యకు దూరంగా ఉన్నాడు. దీంతో ఇద్దరూ విడాకుల కోసం చిక్కనాయకనహళ్లి కోర్టును ఆశ్రయించారు. జడ్జి వెంకటేశ్ ఆ దంపతులతో మాట్లాడారు. మూఢ నమ్మకాలతో దాంపత్య జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అనంతరం దంపతులను ఒప్పించి ఒక్కటి చేశారు. అనంతరం దంపతులు పరస్పం దండలు మార్చుకొని సంతోషంగా ఇంటికెళ్లారు.

హోసూరు వార్తలు..

ఏనుగు దాడిలో రైతు మృతి

కెలమంగలం: ఒంటి ఏనుగు దాడి చేసిన ఘటనలో రైతు మృతి చెందాడు. తళి సమీపంలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన రైతు లగుమప్ప (53). మంగళవారం అదే ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో పశువులు మేపుతుండగా ఒంటి ఏనుగు దాడి చేసింది. తీవ్ర గాయాలేర్పడిన లగుమప్ప కేకలు వేయడంతో స్థానికులు ఘటనా స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తళి పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్ టవర్ ఎక్కిన రైతు

హోసూరు: హోసూరు సమీపంలోని ఉద్దనపల్లి ప్రాంతంలో 5వ సిఫ్‌కాట్ ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా ఆ ప్రాంత రైతులు ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూగనూరు గ్రామానికి చెందిన రైతు సుబ్రమణి (50) ఉద్దనపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న సెల్‌ఫోన్ టవర్‌పైకి ఎక్కి ఆందోళనకు దిగాడు. తమ భూములను లాక్కోరాదని కేకలు వేశాడు. గమనించిన అతని కొడుకు తండ్రిని సమాధానపరిచి కిందకు దింపాడు. అంతలో ఉద్దనపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సుబ్రమణిని అరెస్ట్ చేశారు.

ముళ్లపొదల్లో రేషన్ బియ్యం..

జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలో అనుమానాస్పద స్థితిలో ఉన్న 1,750 కిలోల రేషన్ బియ్యాన్ని అధికార్లు స్వాధీనపరుచుకొన్నారు. వివరాల మేరకు ఆహారభద్రతా శాఖా తహసీల్దార్ ఇళంగోవన్ నేతృత్వంలో అధికారులు క్రిష్ణగిరి సమీపంలోని కొత్తూరు గ్రామంలో గస్తీ తిరుగుతుండగా ఖాళీ స్థలంలో 50 కిలోల చొప్పున బరువున్న 35 బస్తాలు దాచిపెట్టి ఉన్నాయి. బియ్యాన్ని స్వాధీనపరుచుకొని నిందితుల కోసం గాలిస్తున్నారు.

విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌కు సన్మానం



బసవరాజగౌడను సన్మానిస్తున్న దృశ్యం

విజయపుర(బెంగళూరు గ్రామీణ): బెంగళూరు గ్రామీణ జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన బసవరాజెగౌడను మంగళవారం విజయపుర పట్టణంలో ప్రాధానోపాధ్యాయుల సంఘం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు కె.హెచ్. చంద్రశేఖర్, చంద్రేశఖర్ హడపద్, నారాయణ స్వామి, మునిరాజయ్య, గోవిందరాజు, కమలమ్మ, గీతాంజలి, కృష్ణప్ప, చంద్రప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

కృష్ణరాజపురం : బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె కాంగ్రెస్ ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ ఎన్నికల ప్రచారం చేపట్టారు. మంగళవారం అనుగొండనహళ్లి పరిధిలోని దేనగుండి గ్రామ పంచాయతీ పరిధిలోని మేడహళ్లిలో భార్యతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు.

శుభ్రత దేశసేవతో సమానం



జాతాలో పాల్గొన్న జడ్జి విజయదేవరాజ అరస్

గౌరిబిదనూరు: శుభ్రత దేశసేవతో సమానమని సీనియర్ జడ్జి విజయదేవరాజ అరస్ అన్నారు. మహాత్ముడి వర్ధంతిని పురస్కరించుకొని పరిసరాల శుభ్రతపై నగరసభ, విద్యా శాఖ, తాలూకా న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతాను కోర్టు ఆవరణలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పొడి, తడి చెత్తను వేరు చేసి పౌరకార్మికులకు అందజేయాలన్నారు. అడిషనల్ సివిల్ జడ్జి డీకే మంజునాథాచారి, కమిషనర్ గీత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రామదాసు, కార్యదర్శి దయానంద్, బ్రైట్ రంగనాథ్, కోమల, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శివణ్ణ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలను రూపుమాపాలి



కార్యక్రమంలో పాల్గొన్న నటుడు చేతన్

తుమకురు : సమాజంలో నెలకొన్న అసమానతలు రూపుమాపేందుకు విద్యార్థులు తమవంతు కృషి చేయాలని నటుడు చేతన్ అన్నారు. తుమకూరులోని కన్నడ భవనంలో నటుడు చేతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మహిళా ప్రభుత్వ పీయూ కళాశాలకు కన్నడ సాహిత్య పస్తుకాలు అందజేసి మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమకు నచ్చిన రంగంలో పురుషులతో సమానంగా రాణించాలన్నారు. వంటపని, చిన్నారులను చూసుకోవడం తదితర పనులన్నీ మహిళలకే వదిలేయకుండా పురుషులు కూడా భాగం పంచుకోవాలని సూచించారు.

మూడు నగరాల్లో డబుల్ డెక్కర్ బస్సులు

శివాజీనగర: ప్రయాణీకుల సౌకర్యార్థం కేఎస్ఆర్‌టీసీ సంస్థ ప్రయోగాత్మకంగా బెంగళూరుతోపాటు మైసూరు, తుమకురు నగరాల్లో డబుల్ డెక్కర్ ఓపెన్ టాప్ బస్సులను ప్రవేశపెట్టనుంది. గతంలో బెంగళూరులో డబుల్ డెక్కర్ బస్సులు నడిపించారు.ఏ కారణం చేతనే వాటిని రద్దు చేశారు. అయితే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో ఆయా నగరాల్లో ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కేఎస్ఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీ.అనుప్‌కుమార్ తెలిపారు. సాంస్కృతిక నగర మైసూరుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. నగర అందాలను తిలకించేందుకు డబుల్ డెక్కర్ బస్సు అనుకూలంగా ఉంటుందని భావించి ఓపెన్ టాప్ తరహాలో ఈ బస్సులు నడిపిస్తామన్నారు. టిక్కెట్ ధర రూ.250గా నిర్ణయించారు. తొలి విడతలో 5 బస్సులతో సంచార సేవలను ప్రారంభిస్తామని కేఎస్ఆర్‌టీసీ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం

- సీఎం ఇంటిని ముట్టడిస్తాం

శివాజీనగర: అంగన్‌వాడీ కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. డిమాండ్ల సాధనకు 9రోజులుగా ఫ్రీడం పార్క్‌లో ధర్నా నిర్వహిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడంతో బుధవారం సీఎం బసవరాజ్ బొమ్మై ఇంటిని ముట్టడిస్తామని హెచ్చించారు. తమపై కాల్పులు, లాఠీ చార్జ్ చేసినా పోరాటం నుంచి వెనుకంజ వేయమన్నారు. ఎప్పుడైనా మరణించాల్సిందేనని, తమ హక్కులు, డిమాండ్ల కోసం ప్రాణాలను లెక్క చేయకుండా బుధవారం 15 వేల మంది కార్యకర్తలతో సీఎం ఇంటిని ముట్టడిస్తామన్నారు.

ఆచూకీ తెలిపితే రూ.50వేలు

మైసూరు: పెరల్‌పై వచ్చి తప్పించుకొని తిరుగుతున్న ఖైదీ ఆచూకీ తెలిపితే రూ.50వేల బహుమతి అందజేస్తామని మైసూరు ఉపనర పోలీసులు ప్రకటించారు. వివరాలు.. మండ్య జిల్లా శ్రీరంగపట్టణం తాలూకా పాలహళ్లి నివాసి మరిగౌడ కుమారుడు కోతిసోము ఓ హత్య కేసులో మైసూరులోని సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. 2009లో ఇతను 30 రోజుల పెరోల్‌పై బయటకు వచ్చాడు. అదే ఏడాది 2009 నవంబర్ 1న జైలుకు తిరిగి రావాల్సి ఉండగా అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. జైలు అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో నజరాబాద్ పోలీసులు గాలింపు చేపట్టారు.

నిధుల దుర్వినియోగంపై ట్యాంక్ ఎక్కి నిరసన



ఓవర్‌హెడ్‌ట్యాంక్‌పైకి ఎక్కి ఆందోళన నిర్వహిస్తున్న వెంకటేష్

కెలమంగలం: గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని బళ్లపల్లి పంచాయతీ ఉబ్బరాయనపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్(40) సోమవారం గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌పైకెక్కి ఆందోళనకు దిగాడు. తళి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని అతనితో చర్చించారు. వెంకటేశ్ మాట్లాడుతూ ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పెయింటింగ్ చేయకపోయినా, మరుగుదొడ్లు నిర్మించకపోయినా బిల్లులు డ్రా చేశారని, దొంగ సంతకాలు చేసి ఉపాధి హామీ నిధులు దిగమింగారని ఆరోపించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే కిందకు దూకుతానని హెచ్చరించాడు. ఉన్నతాధికారులతో చర్చిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో కిందకు దిగి వచ్చాడు.

జిల్లాకు కొత్త కలెక్టర్



దీపక్ జకోబ్ (ఫైల్)

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా కలెక్టర్ జయచంద్రభానురెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దీపక్ జకోబ్‌ను తమిళనాడు ప్రభుత్వం నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 34 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కొత్త కలెక్టర్ త్వరలో బాధ్యతలు తీసుకుంటారు.

హోసూరు కమిషనర్‌గా ఐఏఎస్ స్నేహ

హోసూరు: హోసూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి స్నేహ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఈ పదవిలో బాలసుబ్రమణ్యం ఉన్నారు. హోసూరు మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా స్థాయి పెరగడంతో ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించాలని డిమాండ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్నేహను నియమించారు. ఆమె త్వరలో హోసూరులో పోస్టింగ్ తీసుకోనున్నారు.

ఆక్రమణలు నేలమట్టం



ప్రహరీని నేలమట్టం చేస్తున్న దృశ్యం

బనశంకరి: మహదేవపుర పరిధిలో ఆక్రమణలపై బీబీఎంపీ కొరడా ఝుళిపించింది. గరుడాచార్‌పాళ్య వార్డు పట్టందూరు అగ్రహార పరిధిలోని పాయర్ ఇన్ఫినిటీ అపార్టుమెంట్ వద్ద 300 మీటర్ల మేర రాజకాలువపై నిర్మించిన ప్రహరీని మంగళవారం పాలికె అధికారులు జేసీబీతో కూల్చివేయించారు.


చోరీకి గురైన విగ్రహం స్వాధీనం

క్రిష్ణగిరి: సూళగిరిలోని వినాయకుని ఆలయంలో 20 కేజీల బరువైన పంచలోహ విగ్రహాన్ని దోచుకెళ్లిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సూళగిరి కేకేనగర్ ప్రాంతంలోని వినాయకస్వామి ఆలయంలో అర్చకురాలిగా రత్నమ్మ పనిచేస్తుంది. సోమవారం ఉదయం ఆలయంలో పూజలు ముగించుకొని ఇంటికెళ్లింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తిరిగి ఆలయానికెళ్లిన రత్నమ్మకు వినాయకుని విగ్రహం కనిపించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల చిత్రాల ఆధారంగా నిందితులను పట్టుకుని విగ్రహాన్ని స్వాధీనం చేసుకున్నారు. దుండగులు ఉత్తర భారతీయులని తెలిసింది.

పాఠశాలల్లో వైద్య శిబిరాలు

హోసూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు హోసూరులోని వరం ప్రైవేట్ ఆస్పత్రి ద్వారా ఉచితంగా వైద్య సేవలందిస్తామని వైద్యులు తెలిపారు. మంగళవారం విలేకరులతో డాక్టర్లు విజయ్‌కుమార్, సిబిచక్రవర్తి తదితరులు మాట్లాడుతూ సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే రెండు, మూడు చోట్ల ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే శిబిరాల్లో బీద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల్లో మెరుగైన చికిత్సలవసరమున్న వారిని గుర్తించి వారికి ఉచిత వైద్య సేవలందజేస్తుందని తెలిపారు.

బనశంకరీమాతకు చందన అలంకరణ



బనశంకరి: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవీ చందన అలంకరణలో దర్శనమిచ్చింది. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవీ మూలవిరాట్‌కు చందనంతో ప్రత్యేక అలంకరణచేపట్టి విశేషపూజలు నిర్వహించారు.

షోకాజ్ నోటీసు ఆధారంగా తుది నిర్ణయం తీసుకోవద్దు

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తీర్పు వాయిదా
- భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ఏది పడితే అది మాట్లాడకూడదన్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను అవమానకరంగా మాట్లాడినందుకు సంఘం గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో వివరించాలంటూ జారీ చేసిన షోకాజ్ నోటీసు ఆధారంగా ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విషయంలో ఎలాంటి తుది నిర్ణయం తీసుకోవద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ఉత్తర్వులు జారీ చేశారు. షోకాజ్ నోటీసులను చట్ట విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేవీ సూర్యనారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంలో మంగళవారం ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటివరకు తుది నిర్ణయం తీసుకోవద్దని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ.. షోకాజ్ నోటీసుపై అధికరణ 226 కింద దాఖలు చేసే వ్యాజ్యాలకు విచారణార్హత లేదని చెప్పారు. ఈ మేరకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను చదివి వినిపించారు. సంఘం అధ్యక్షుడి సమాధానం ఆధారంగా తుది చర్యలుంటాయన్నారు. ఉద్యోగ సంఘం వారి సమస్యలపై పోరాటం చేయడం, సంఘం ప్రతినిధులు గవర్నర్‌ను కలవడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను కించపరుస్తూ మాట్లాడటం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి సంబంధించిన అంతర్గత, సున్నిత, కీలక సమాచారాన్ని మీడియా ముఖంగా బహిర్గతం చేశారని, దీనిపైనే తమకు అభ్యంతరమని చెప్పారు. ఇది సర్వీసు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్ సంఘం ప్రతినిధులకు భావ ప్రకటన స్వేచ్ఛ వర్తించదా అని ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛ పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు ఏది పడితే అది మాట్లాడటానికి వీలు లేదన్నారు. వారికి నియమావళి ఉంటుందని, దానికి లోబడే పని చేయాలని చెప్పారు. అంతకు ముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వై.వి.రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. గవర్నర్‌ను కలిశారన్న కోపంతోనే ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. సంఘం గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందన్నారు. నోటీసు నామమాత్రపు చర్యేనని తెలిపారు.

కేంద్రం కనికరమెంత?

పోలవరం ప్రాజెక్టుకు ఈ బడ్జెట్‌లోనైనా కేంద్రం నిధులిచ్చేనా?

- 2017–18 నుంచి బడ్జెట్‌లో పోలవరానికి నిధులు కేటాయించని కేంద్రం
- రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు నాబార్డు రుణాల ద్వారా రీయింబర్స్
- బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయిస్తే సత్వరమే పూర్తయ్యే అవకాశం

సాక్షి, అమరావతి: విభజన చట్టం ప్రకారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చుక్కానిలా నిలిచే పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత మొత్తం కేంద్రానిదే. ప్రాజెక్టుకు అన్ని అనుమతులు తెచ్చి, వంద శాతం వ్యయాన్ని భరించి సత్వరమే ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాలి. ఇందుకోసం 2014లోనే కేంద్రం పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని ఏర్పాటు చేసింది. పీపీఏతో ఒప్పందం చేసుకోవాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేసింది. అయితే, అప్పటి సీఎం చంద్రబాబు.. కమీషన్ల కోసం ఆ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. ప్రత్యేక హోదాను కూడా వదులుకోవడానికి కూడా అంగీకరించారు. దీంతో కేంద్రం పోలవరం నిర్మాణ బాధ్యత నుంచి తప్పుకొంది. 2016 సెప్టెంబరు 7న అర్ధరాత్రి కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. బడ్జెట్‌లో కేటాయింపుల ద్వారా కాకుండా ఎల్‌టీఐఎఫ్(దీర్ఘకాలిక నీటి పారుదల నిధి) రూపంలో నాబార్డు రుణం ద్వారా నిధులను తిరిగి చెల్లిస్తామని (రీయింబర్స్ చేస్తామని) మెలిక పెట్టింది. దీనికీ చంద్రబాబు అంగీకరించారు. ఈమేరకు 2016 డిసెంబర్ 26న సంతకం చేశారు. దాంతో బడ్జెట్‌లో నిధుల కేటాయింపు హక్కును రాష్ట్రం కోల్పోయింది. 2017–18 నుంచి బడ్జెట్‌లో కేంద్రం నిధుల కేటాయింపులు నిలిపివేసింది. పోలవరం మినహా ఏఐబీపీ (సత్వర సాగునీటి ప్రయోజన పథకం) కింద చేపట్టిన 99 ప్రాజెక్టులు పూర్తవడంతో 2022–23లో ఎల్‌టీఐఎఫ్‌ను కేంద్రం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఈసారైనా బడ్జెట్‌లో కేంద్రం నిధులు కేటాయించి, సకాలంలో ప్రాజెక్టు పూర్తికి సంపూర్ణ సహకారం అందిస్తామంటూ విభజన చట్టంలో ఇచ్చిన హామీకి కట్టుబడుతుందా? లేదా? అన్నది ఫిబ్రవరి 1న వెల్లడికానుంది.



రీయింబర్స్ ప్రక్రియలో తీవ్ర జాప్యం

ప్రాజెక్టు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినప్పటి నుంచి నిర్మాణానికి అయిన ఖర్చును కేంద్రం నాబార్డు రుణాలతోనే రీయింబర్స్ చేస్తోంది. ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇది నిధుల కొరతకు దారితీసి, ప్రాజెక్టు పనులపై ప్రభావం చూపుతోంది. 2021–22లో బడ్జెట్‌లో కేటాయించకపోయినప్పటికీ, భారీ, మధ్య తరహా ప్రాజెక్టులకు కేటాయించిన నిధుల్లో మిగులు ఉండటంతో రూ.320 కోట్లను బడ్జెట్ ద్వారా పోలవరానికి కేంద్రం విడుదల చేసింది. 2022–23 బడ్జెట్‌లోనూ పోలవరానికి నిధులను కేటాయించలేదు. కేంద్రం బడ్జెట్ ద్వారా సరిపడా నిధులు కేటాయించి, సకాలంలో రీయింబర్స్ చేస్తే– పోలవరం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా చేసిన ఖర్చు : రూ. 20,702.58 కోట్లు

2014 ఏప్రిల్ 1కి ముందు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చు: రూ. 4,730.71 కోట్లు

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక రాష్ట్ర ప్రభుత్వం చేసిన వ్యయం: రూ.15,971.87 కోట్లు

ఇప్పటిదాకా కేంద్రం రీయింబర్స్ చేసిన నిధులు: రూ.13,226.05 కోట్లు

కేంద్రం పడిన బకాయి: రూ. 2,745.82 కోట్లు

పోలవరం ప్రాజెక్టుకు 2014 నుంచి ఇప్పటిదాకా కేంద్రం నిధుల విడుదల ఇలా (రూ.కోట్లలో..)

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపులు	బడ్జెట్ ద్వారా	నాబార్డు ద్వారా	మొత్తం
2014-15	250.00	250.00	-	250.00
2015-16	600.00	600.00	-	600.00
2016-17	100.00	100.00	2414.16	2514.16
2017-18	-	-	2000.00	2000.00
2018-19	-	-	1400.00	1400.00
2019-20	-	-	1850.00	1850.00
2020-21	-	-	2234.20	2234.20
2021-22	-	320.00	1578.80	1898.80
2022-23	-	-	478.89	478.89 (శనివారం వరకు)
మొత్తం	950.00	1270.00	11,956.05	13,226.05

లేబర్ కోడ్‌లకు ఏపీ ముసాయిదా నిబంధనలు

- ఆర్థిక సర్వేలో కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు తోడ్పడేలా పలు కార్మిక చట్టాలను హేతుబద్ధీకరిస్తూ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందస్తు ముసాయిదా నిబంధనలు రూపొందించిందని కేంద్ర ఆర్థిక సర్వే పేర్కొంది. మంగళవారం పార్లమెంటులో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో ఈ విషయం తెలిపారు. వేతన కోడ్ 2019, ద ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ 2020, ద కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ 2020, ద ఆక్యుపేషనల్ సేఫ్టీ హెల్త్ , వర్కింగ్ కండిషన్స్ కోడ్ 2020కు ఆంధ్రప్రదేశ్ ముందస్తు ముసాయిదా నిబంధనలు రూపొందించిందని ఆర్థిక సర్వే తెలిపింది. ఇంకా కొన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ముసాయిదా నిబంధనలు రూపొందించాల్సి ఉందని తెలిపింది.

వినియోగదారుల ధరల సూచీ – కంబైన్డ్ (సీపీఐ–సీ) ద్రవ్యోల్బణం 2022 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సరంలో ఏపీ సహా కొన్ని రాష్ట్రాల్లో పెరిగిందని తెలిపింది. ఏపీలో మహిళా కార్మికుల సంఖ్య పెరిగిందని సర్వే పేర్కొంది. రాష్ట్రంలోని ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికుల సంఖ్య 5 లక్షల నుంచి 10 లక్షల మధ్య ఉందని తెలిపింది. మెటర్నల్ మోర్టాలిటీ రేటు తగ్గించడానికి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గ్రోత్ లక్ష్యాన్ని సాధించిన ఎనిమిది రాష్ట్రాల్లో ఏపీ ఒకటని పేర్కొంది. ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి పరంపరగత్ క్రిషి వికాస్ యోజన (పీకేవీవై)లో భాగంగా తీసుకొచ్చిన భారతీయ సహజ వ్యవసాయ విధానం (బీపీకేపీ) పథకంలో 8 రాష్ట్రాలు 4.09 లక్షల హెక్టార్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాయని, వీటిలో ఆంధ్రప్రదేశ్ ఒకటని పేర్కొంది. సరకు, ప్రయాణికుల రవాణాకు దేశంలో జల రవాణా 14,850 కిలో మీటర్లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 1,000 కిలో మీటర్ల పైగా ఉన్నట్లు సర్వే తెలిపింది.

వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు కొత్త జాబ్ చార్ట్

సాక్షి, అమరావతి: వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్ చార్ట్ ఇచ్చింది. గ్రామ సచివాలయాల్లో పనిచేసే వీఆర్‌వోలు, వార్డు సచివాలయాల్లో పనిచేసే వార్డు రెవెన్యూ కార్యదర్శులకు కంబైన్డ్ జాబ్ చార్ట్, గ్రేడ్–1, 2, 3 గ్రామ సర్వేయర్లకు జాబ్ చార్ట్‌లపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ రెండు వేర్వేర్లు ఉత్తర్వులిచ్చారు.

వీఆర్వోల జాబ్ చార్ట్..

తుపాన్లు, వరదలు, ప్రమాదాలు లాంటి విపత్తు నిర్వహణ విధులు, ఓటర్ల జాబితా అప్‌డేషన్, ప్రభుత్వం నిర్దేశించే ఇతర ఎన్నికల విధులు, రెవెన్యూ రికార్డుల మ్యుటేషన్ పనులు, భూముల రీ సర్వే కార్యకలాపాలు, నివాస, నేటివిటీ లాంటి సర్టిఫికెట్ల జారీ విధులను నిర్వర్తించాలని పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన అన్ని వినతులను పరిశీలించి తీసుకున్న చర్యలపై ఆయా శాఖలకు నివేదికలు పంపడం లాంటి పనుల్ని నిర్దేశించారు. పంటల అజమాయిషీ, సర్వే రాళ్ల తనిఖీ, ప్రభుత్వ భూములు, ఆస్తుల రక్షణ, రోడ్లు, వీధులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా కాపాడటం, రెవెన్యూ సెస్, పన్నులు వసూలు చేయాలి. హత్యలు, ఆత్మహత్యలు, అసహజ మరణాలు, గ్రామాల్లో శాంతి భద్రతకు విఘాతం కలిగించే అంశాలను తహశీల్దార్‌కు నివేదించడంతోపాటు తహశీల్దార్, కలెక్టర్, సీసీఎల్‌ఏ, ప్రభుత్వం నిర్దేశించే ఇతర పనుల్ని ఎప్పటికప్పుడు నిర్వర్తించాలని జాబ్ చార్ట్‌లో పేర్కొన్నారు. ఒకే సమయంలో ఎక్కువ పనులు చేయాల్సి వచ్చినప్పుడు ప్రాధాన్యతకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు.

గ్రామ సర్వేయర్ల జాబ్ చార్ట్

వ్యక్తులు, ప్రభుత్వ సంస్థలతోపాటు అనుమతించిన లేఅవుట్లకు సంబంధించి ఎఫ్‌లైన్ పిటిషన్లు (సరిహద్దు వివాదాలు, హద్దులు–విస్తీర్ణంలో తేడాలు లాంటి వాటిపై అందే దరఖాస్తులు) స్వీకరించి పరిష్కరించాలి. సర్వే సబ్ డివిజన్, సంబంధిత మార్పులు చేసే బాధ్యత వారిదే. గ్రామ కంఠాలు, పూర్తిస్థాయి స్ట్రీట్/టౌన్ సర్వే, కొత్త సబ్ డివిజన్, పాత సబ్ డివిజన్లను కలపడంపై అందే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి గ్రామ రికార్డుల్లో చేర్చాలి. సచివాలయాల పరిధిలో అందే అన్ని వినతులతోపాటు వివిధ శాఖల అధికారులు రిఫర్ చేసే అంశాలపై నివేదికలు ఇవ్వాలి. మిస్ అయిన, దెబ్బతిన్న, తొలగించిన సర్వే పాయింట్లు, మార్కులు, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు సర్వే, సరిహద్దు చట్టం ప్రకారం ముసాయిదా నోటీసు ఇచ్చి రెన్యువల్ చేయాలి. తన పరిధిలోని 10 శాతం సర్వే పాయింట్లు, మార్కులు, గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను ప్రతి నెలా తనిఖీ చేయాలి. కాంపిటెంట్ అథారిటీ అధికారుల ఆదేశాల ప్రకారం రికార్డుల్లో తప్పులను సరి చేయాలి. పై అధికారులకు సమాచారమిచ్చి అన్ని తనిఖీలకు గ్రామ సర్వేయర్లు హాజరు కావాలి. సర్వే పరికరాలు, ఇతర వస్తువులను సర్వీస్ చేయించి నిర్వహణ చేపట్టాలి.నెలవారీ టూర్ డైరీలు, ప్రోగ్రెస్ స్టేట్‌మెంట్లు ఇతర నిర్దేశిత సమాచారాన్ని సర్వే సెటిల్మెంట్ కమిషనర్‌కు పంపాలి. సర్వే కార్యకలాపాలను ఈటీఎస్, డీజీపీఎస్, కార్స్ లాంటి అత్యాధునిక సాంకేతిక పరికరాలతోనే నిర్వహించాలి. వీఆర్‌వోలకు సహకరించాలి. ఈ జాబ్ చార్ట్ ఆధారంగా పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ కూడా ఇచ్చారు.

సీఆర్డీఏలో ఎంఐజీ ప్లాట్లకు ఈ–లాటరీ

- 22 మంది లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు
- 26 నియోజకవర్గాల్లోనూ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు: వివేక్ యాదవ్

సాక్షి, అమరావతి: మధ్య తరగతి ఆదాయ వర్గాల ప్రజల కోసం తాడేపల్లి–మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరులో వేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లోని ప్లాట్లను లాటరీ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) పరిధిలో ఉన్న ఫేజ్–2 లే అవుట్‌లోని 22 ప్లాట్లకు మంగళవారం సీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ ఈ–లాటరీ తీసి కేటాయించిన ప్లాట్ల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇక్కడి ఎంఐజీ లే అవుట్‌లో గతేడాది జూన్, జూలై నెలల్లో రెండు విడతలుగా 119 మందికి ప్లాట్లను అప్పగించగా, తాజాగా మరో 22 మందికి విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఆన్‌లైన్ లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఇందులో 240 చ.గ కేటగిరీలో 11 ప్లాట్లు, 200 చ.గ కేటగిరీలో 11 ప్లాట్లు ఉన్నాయని కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. ప్లాట్ల కేటాయింపు పత్రాలు పొందినవారు నెలలోపు అగ్రిమెంటు చేయించుకోవాలని, మరో నెలలోగా 30 శాతం వాయిదా సొమ్ము చెల్లించాలని ఆయన తెలిపారు. ఆరునెలల్లో 30 శాతం, ఏడాది లోగా మిగిలిన 30 శాతం వాయిదాను చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అయితే, ప్లాట్ ధర మొత్తం మొదటి నెలలోనే చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు ప్లాట్ రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. అన్ని ప్రభుత్వ అనుమతులతో పాటు సకల సౌకర్యాలు ఈ ప్లాట్లకు కల్పిస్తున్నామని ఆయన వివరించారు. త్వరలో ఏపీ సీఆర్డీఏ పరిధిలోని 26 నియోజకవర్గాలలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేస్తామని, ఇప్పటి వరకు ఆరు నియోజకవర్గాల పరిధిలో పనులు పురోగతిలో ఉన్నట్టు ఆయన వెల్లడించారు. అదనపు కమిషనర్ షేక్ అలీంబాషా, ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్‌రాజు సిబ్బంది పాల్గొన్నారు.

నడక మార్చుకో, గొంతు ఎందుకిలా



మాది కర్నూలు. నాకు ఒక అన్న, ముగ్గురు చెల్లెళ్లు. చిన్నప్పటి నుంచి నాకు ఆడపిల్లగా ఉండటమే ఇష్టం. ఆరో తరగతి నుంచి నాలో వస్తున్న మార్పులను చూసి అమ్మా, నాన్న చాలా తిట్టేవారు. ఎందుకలా నడుస్తున్నావు, గొంతు ఎందుకలా అవుతోంది.. మార్చుకుంటావా లేదా అని రోజూ హింస. అయినా ఇదంతా మేము కోరుకుని తెచ్చుకుంది కాదు కదా. జన్యు లోపం వల్ల వచ్చిన దానికి మేం ఏం చేస్తాం.

– అనుశ్రీ

సమాజంలో తలెత్తుకునేది ఎలా..



మాది వెల్దుర్తి. నాకు ఒక అక్క ఉంది. మా నాన్న టీచర్. అమ్మ గృహిణి. పదో తరగతి వరకు చదువుకున్నా. చిన్నప్పటి నుంచి నాలోని మార్పులను గమనించి ఎక్కడెక్కడో చికిత్స చేయించారు. అయితే డాక్టర్లు కూడా ఏమీ చేయలేమన్నారు. ఒక్కగానొక్క కుమారుడు ఇలా అయితే, సమాజంలో ఎలా తలెత్తుకుని తిరిగేదని చాలా బాధపడేవారు. అయితే అమ్మ మాత్రం నన్ను అర్థం చేసుకుంది.

– సమీర

నిజం అయితే బయటకు వెళ్లిపో..



నాకు ఒక అక్క ఉంది. చిన్నప్పటి నుంచి నాలో వచ్చే మార్పులను గమనించి బయటి వాళ్లు ఇంటికి వచ్చి మీ వాడు ఏంటి ఇలా అని చెప్పడంతో తరచూ గొడవలు అయ్యేవి. నాన్న పట్టించుకోకపోవడం, అమ్మ అనారోగ్యం కారణంగా నాన్నమ్మ నా బాగోగులు చూసుకునేది. ఒకరోజు బయటి వాళ్లు చెప్పేవి నిజం అయితే ఇంట్లో ఉండకు అంది. అప్పుడు ఒక వంద రూపాయలు ఇవ్వమని అడిగి ఇంక నా మీద ఆశలు వదిలేసుకోమని బయటకు వచ్చేశా.

– భావన, కర్నూలు

మాత పూజతో అమ్మాయిలా..

పురుషుడిగా బయటకు కనిపించినా.. మనసు మహిళగానే ఉంటుంది. అందువల్ల మాకు అవసరం లేని అవయవాలు తొలగించుకునేందుకు ఎన్నో అవస్థలు పడతాం. ఆ తర్వాతే మేము స్త్రీగా జీవిస్తాం. గతంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం వల్ల దాయిమా(వయస్సు పైబడిన 80 ఏళ్ల హిజ్రాలు)లు మాకు అనవసర అవయవాలు తొలగించేవాళ్లు. అది మాకు చావుబతుకుల సమస్య. ఇప్పుడు అలాంటి వాళ్లు లేరు. ఇప్పుడు వైద్యుల వద్దే ఆపరేషన్ చేయించుకుంటున్నాం. ఈ ప్రక్రియను నిర్వాణ్ అంటాం. ఆ తర్వాత 40 రోజుల వరకు ఒంటరిగానే ఒక గదిలో ఉండిపోతాం. 11 రోజులకు, 21 రోజులకు, 31 రోజులకు మంగళస్నానాలు చేయిస్తాం. ఆ సమయంలో మేము ఒకరినొకరు చూసుకునేందుకు కూడా ఇష్టపడం. కనీసం అద్దంలో మమ్మల్ని మేము కూడా చూసుకోం. ఇక 40 రోజుల తర్వాత మాత పూజ ఉంటుంది. ఆపరేషన్ చేయించుకున్న వాళ్లకు మంగళస్నానం చేయించి నెత్తిన పాల కడవతో అమ్మ వారికి పూజ చేయిస్తాం. అప్పుడే అమ్మ వారికి మా పురుషత్వాన్ని అప్పగించి, మహిళగా మిగిలిపోతాం. అప్పుడు మా గురువు మాకు తాళిబొట్టు కట్టి మెట్టెలు తొడుగుతారు. ఇది మా జీవితాల్లో అతి పెద్ద పండుగ. ఇక 41వ రోజు జల్సా నిర్వహిస్తాం. అప్పుడు మేమంతా ఒక్కచోటకు చేరి పండుగ చేసుకుంటాం. ఆడిపాడుతాం.. ఆ రోజు రాత్రంతా మమ్మల్ని మేము మైమరిచి జీవిస్తాం.

కర్నూలు జిల్లా నియోజకవర్గాల వారీగా 'ఇతరుల' ఓటరు జాబితా

కర్నూలు	37
పాణ్యం	75
పత్తికొండ	20
కోడుమూరు	10
ఎమ్మిగనూరు	43
మంత్రాలయం	18
ఆదోని	43
ఆలూరు	48

నంద్యాల జిల్లా నియోజకవర్గాల వారీగా 'ఇతరుల' ఓటరు జాబితా

ఆళ్లగడ్డ	17
శ్రీశైలం	45
నందికొట్కూరు	12
నంద్యాల	95
బనగానపల్లె	34
డోన్	81

(అనధికారికంగా వీరి సంఖ్య 30వేల పైనే)

కన్నీటి చుక్కలు!



రిషారెడ్డి

మనసున్న 'హిజ్రా'

- ఇంట్లో ఉండలేక, బయట జీవించలేక..
- సమాజంలో ఇప్పటికీ అంటరానివారిగానే
- మానవత్వంలో వాళ్లకు వాళ్లే సాటి
- సంపాదనలో అధిక శాతం సేవా కార్యక్రమాలు
- గురుచేల బంధంతో ఒక సమూహం
- ఒకరికొకరు తోడుగా జీవనం




నంద్యాల: బిక్షాటనలో భాగంగా సరదా చిత్రం

మెరిసే అందం వెనుక చెప్పుకోలేని చీకటి.. కురిసే నవ్వుల వెంట భరించలేని బాధ. గళగళ పారే మాటల మాటున లోతైన వేదన.. వెంటాడే చూపులకు తోడుగా తీరని వెతలు.. చేతులు చేసే శబ్దంలో కనిపించని మౌనం.. బిక్షమెత్తుకుంటూనే కరిగిపోయే హృదయం.. సాటి మనిషికి కష్టమంటే పరుగున వచ్చే మానవత్వం.. తనకు తానే కొవ్వొత్తి జీవనం.. హిజ్రా!

– సాక్షి, కర్నూలు డెస్క్

కొజ్జా.. పాయింట్ ఫైవ్.. హిజ్రా.. ఒక్క మనిషికి ఎన్నో పేర్లు. ఆడ.. మగ తరహాలోనే జన్మించినా.. అడుగడుగునా అవమానాలు. పురాణాల్లో ప్రస్తావన ఉన్నా.. చట్టాలు గుర్తింపునిచ్చినా.. ఆడవాళ్లు తమలో కలుపుకోరు, మగవాళ్లు దగ్గరికి రానివ్వరు. ఉన్నత చదువులు చదివినా.. ఉన్నతంగా బతుకుతున్నా.. ఓ ఇంటి వాళ్లు కాలేరు, ఓ తోడు వెంట రాదు. గతానికి భిన్నంగా జీవనం సాగిస్తున్నా.. సమాజ మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటున్నా.. కలిగినదాంట్లో కలోగంజో తాగుతూ ఇతరుల బాధను పంచుకుంటున్నా.. ఇప్పటికీ ఆ 'తేడా' అలిగే మిగిలిపోయింది. ఇంటికి దూరంగా.. సమాజానికి ఆవల.. చస్తూ బతుకుతున్న హిజ్రాల జీవనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం వారి మాటల్లోనే..

పురుషుడి ఆకారంలో జీవిస్తున్నా, మనసు ఆడపిల్లగానే ఉండటం వల్ల మానసిక సంఘర్షణ అధికం. ఇంట్లో చెప్పుకోలేక, బయటకు తెలిస్తే ఏమవుతుందో తెలియక చస్తూ బతుకుతుంటాం. ఎవరూ లేని సమయంలో స్త్రీ వేషధారణతో మురిసిపోతుంటాం. వయస్సు పెరుగుతున్న కొద్దీ మాలో వచ్చే మార్పులతో ఆ విషయం ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుంది. అప్పటి నుంచి మా జీవితం మరింత నరకం అవుతుంది. ఒకానొక దశలో ఇక మా సమూహాన్ని వెతుక్కుంటూ బయటకు వచ్చేస్తాం.



నందికొట్కూరు: కరోనా వేళ ఆపన్న హస్తం



మాతా

అద్దెకు ఇల్లు కూడా దొరకదు

కుటుంబ సభ్యుల ఆదరణ లేక.. బంధువులు, స్నేహితులు అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ఇంట్లో నుంచి బయటపడుతుంటాం. ఆ తర్వాత మమ్మల్ని మేము కాపాడుకునేందుకు నిత్యం అవస్థలే. ఏదో ఒక పని చేసుకుందామంటే ఎవరూ ఇవ్వరు. కనీసం తలదాచుకుందామంటూ ఇల్లూ కూడా అద్దెకు దొరకదు. ఎవరైనా దయతలచి ఇచ్చినా, చుట్టుపక్క వాళ్ల గొడవతో ఖాళీ చేయాల్సి వస్తుంది. మేమూ ఆడపిల్లలమే అనే విషయం ఈ సమాజం ఎప్పటికి గుర్తిస్తుందో తెలియదు.


సేవ చేస్తాం.. చెప్పుకోం..

మేము సంపాదించే డబ్బులో అధిక శాతం సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తాం. మా ఇంటి దగ్గరికి వచ్చి ఎవరు ఏ సాయం అడిగినా ఉన్నంతలో చేసేందుకు వెనుకాడం. ఎంతో మందికి పెళ్లి విషయంలో, అనారోగ్యం విషయంలో డబ్బుతో పాటు తాళిబొట్లు అందిస్తుంటాం. ఒంటరి మహిళలు మాకు దిక్కు లేదని మా దగ్గరికి వచ్చి నిలబడుతుంటారు. అలాంటి వాళ్లకు చేతనైంది చేసి పంపుతుంటాం. అంతెందుకు కరోనా సమయంలో మా జీవనమే దుర్భరంగా మారినా ఉన్నదాంట్లో ఎంతో మంది నిరాశ్రయుల కడుపునింపే ప్రయత్నం చేశాం.

సమూహాలుగానే జీవిస్తాం..

ఇంట్లో ఎలాంటి శుభకార్యాలు జరిగినా మమ్మల్ని పిలవరు, మాలో మేము, మాతో మేము బతుకుతాం. ఒంటరిగా జీవిస్తే ప్రతి ఒక్కరి కన్ను మాపైనే ఉంటుంది. అందువల్ల మేము గుంపుగా కలసిమెలసి జీవించేందుకే ఇష్టపడతాం.

రాముడే వరమిచ్చాడంటారు..



లోకా సమస్తా సుఃఖినోభవంతు అనే భావనతోనే మీము జీవిస్తుంటాం. లోక కల్యాణాన్నే కోరుకుంటాం. మా జీవితం ఆశీర్వదించడానికే అని మా గురువులు మాకు బోధించారు. అంతెందుకు మా పెద్దలు ఒక కథ చెబుతుంటారు. రాముడు అరణ్య వాసానికి వెళ్లే సమయంలో ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఆయనను చూడటానికి తరలివస్తారు. అప్పుడు రాముడు మగవాళ్లు, ఆడవాళ్లు జాగ్రత్తగా ఇళ్లకు వెళ్లండని చెబుతారు. అయితే మన గురించి ఏమీ చెప్పలేదని హిజ్రాలు రాముడు తిరిగివచ్చే వరకు అక్కడే ఉండిపోతారు. అరణ్యవాసం పూర్తయ్యాక రాముడు అయోధ్యకు చేరుకోగానే.. స్వామి మీరు వెళ్లేటప్పుడు ఆడవాళ్లు, మగవాళ్లను ఉద్దేశించి మాత్రమే మాట్లాడారు. మా పరిస్థితి ఏమిటి, మేము మీ మాట కోసం ఇక్కడే ఉండిపోయామని వేడుకుంటారు. అప్పుడు రాముడు.. 'మీ వాక్కు ఫలించుగాక' అని దీవించారు. అప్పటి నుంచి మా నోటి నుంచి వచ్చే మాట ఫలిస్తుందనే నమ్మకం ప్రజల్లో కూడా ఏర్పడింది.

ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది

ఒకప్పుడు మమ్మల్ని చూస్తేనే అసహ్యించుకునేవాళ్లు. బస్సుల్లో పక్కన కూర్చొంటే కూడా పక్కకు లేచి వెళ్లేవాళ్లు. చాలా బాధాకర జీవనం గడుపుతుంటాం. అయితే ఇటీవల కాలంలో సమాజంలో చాలా మార్పు కనిపిస్తోంది. మమ్మల్ని కూడా మనుషుల్లా చూస్తున్న తీరు కాస్త సంతోషాన్ని కలిగిస్తుంది. అయితే ఇంకా చాలా మార్పు రావాలి. మమ్మల్ని కూడా ఆడపిల్లగానే చూసినప్పుడే మా జీవన విధానంలో మార్పు వస్తుంది.

గురుచేల బంధం..

ప్రతి ఒక్క హిజ్రా ఒక గురువు కింద శిష్యరికం చేయాల్సి ఉంటుంది. అప్పుడే సమూహంలో చోటు దక్కుతుంది. ఒక్కో గురువు పరిధిలో వందల నుంచి వేల సంఖ్యలో శిష్యులు ఉంటారు. హిజ్రాగా మారిన వ్యక్తి గురువును ఆశ్రయిస్తే.. తన పరిధిలోని శిష్యులను అత్త, తల్లిని పరిచయం చేస్తారు. సమూహంలో అత్తకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. 11వ రోజు మంగళస్నానం చేయించడంతో తల్లి పాత్ర దాదాపుగా ముగుస్తుంది. ఆ తర్వాత వాళ్లకు ఇష్టం వచ్చినప్పుడు బట్టలు పెట్టడం, ఇంటికి ఆహ్వానించడం జరుగుతుంది. 40 రోజుల మాత పూజ తర్వాత గురువు తాళి కట్టి, మెట్టెలు తొడగటం.. మరుసటి రోజు జల్సాకు పెళ్లి కూతురులా ముస్తాబు చేసి పెద్ద ఎత్తున జల్సా చేయడం జరుగుతుంది. దీన్నే గురుచేల బంధంగా పరిగణిస్తున్నారు.

అడ్డుక్కోవడం ఒక్కటే ఉపాధి

బాగా చదువుకోవాలని ఉన్నా, ఎక్కడికక్కడ మాకు అవాంతరాలే ఎదురవుతుంటాయి. మా హావభావాలను అందరూ వెలెత్తి చూపేవాళ్లే కానీ, వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లు చాలా అరుదు. ఇక మాకు పని కల్పించమంటే ఎవరూ ముందుకురారు. ఈ పరిస్థితుల్లో ఆకలితో చావలేక విధిలేని పరిస్థితుల్లో రోడ్డున పడుతున్నాం. దుకాణాల వద్దకు వెళ్లి చేయి చాస్తున్నాం. ఇదొక్కటే మాకు ఉపాధి. వచ్చిన డబ్బునే అందరూ పంచుకుంటాం. ఇందులోనే దేవుని పేరిట కొంత సొమ్ము తీసిపెడుతుంటాం.

బయటకు చెప్పుకోలేని వాళ్లు ఎందరో..

మేము పురుషులం కాదు, మాలో స్త్రీ లక్షణాలు ఉన్నాయని తెలిసినప్పటి నుంచి మాలో మేము ఎంతో నలిగిపోతుంటాం. బయటపడకుండా ఎంత జాగ్రత్తపడినా ఎలాగోలా తెలిసిపోతుంది. కొందరు విధిలేని పరిస్థితుల్లో ఇళ్లు వదిలి బయటపడుతుండగా.. కొందరు బయటకు చెప్పుకోలేక, సమాజం దృష్టిలో తనను తాను చిన్నబుచ్చుకోలేక ఇప్పటికీ ఎందరో ఒంటరిగానే మిగిలిపోతున్నారు. చాలామంది ఉద్యోగుల్లోనూ హిజ్రాలు ఉన్నారు. అయితే అతికొద్ది మంది మాత్రమే బయటకు వచ్చి సమూహంలో కలిసి జీవిస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 1-2-2023

కేరళలో యూనివర్సిటీ విద్యార్థినులకు అధికారికంగా బహిష్టు సెలవులు లభించాయి. ఆ వరుసలో దేశంలోనే మొదటిసారిగా కొట్టాయంలోని ఒక సిబిఎస్ఇ స్కూలు తన విద్యార్థినులకు బహిష్టు సెలవు ప్రకటించింది. అంతేకాదు తన స్కూలులో ఈడేరే వయసు అమ్మాయిల కోసం 'ప్యూబర్టీ ల్యాబ్'ను ఏర్పాటు చేయనుంది. పుష్పవతులైన అమ్మాయిలకు ఈ ల్యాబ్‌లో సూచనలు సలహాలు ఇవ్వడమే కాదు ప్యాడ్స్ వాడకం కూడా తెలుపుతారు. విద్యార్థినుల అటెండెన్స్‌లో తప్పనిసరి శాతాన్ని సవరిస్తూ యూనివర్సిటీల్లో, హైస్కూళ్లలో ఇలాంటి సెలవు ఇవ్వడాన్ని ప్రతి రాష్ట్రం ఆలోచించాల్సి ఉంది.

చర్చనీయాంశం

ఈ సెలవు అవసరమే



మనిషి నాగరికుడు కావడం అంటే తను నివసించే సమాజాన్ని స్నేహపూరితంగా, వేదనా రహితంగా, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో నిర్మించుకోవడమే. ప్రతి సమూహపు ప్రజాస్వామికమైన డిమాండ్లను పరిష్కరించుకుంటూ వెళ్లడమే. సమస్యలను గుర్తించి వాటిని పరిగణిస్తూ పోవడమే. ఈ సమాజం మహిళా స్నేహితంగా ఉండాలని మహిళలు ఏనాటి నుంచో కోరుకుంటున్నారు. ముఖ్యంగా వారి దైహిక సమస్యలను, పరిమితులను గుర్తించి ఆ మేరకు అన్ని రంగాలు, విధానాలలో ఎరుక ప్రదర్శించమని అంటున్నారు. ఉద్యోగాల్లో స్త్రీలు మెటర్నిటీ లీవు పొందడానికి సుదీర్ఘ కాలం పట్టింది. ఆ తర్వాత ఎన్నో ఏళ్ల పోరాటానికి ఫలితంగా ఇటీవల అనేక సంస్థలు బహిష్టు సెలవులు స్త్రీలకు మంజూరు చేస్తున్నాయి. దానికి కొనసాగింపుగా తాజాగా కేరళ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థినులకు అధికారికంగా బహిష్టు సెలవులు మంజూరు చేసింది. ఇది చాలా గొప్ప స్త్రీ పక్ష నిర్ణయం.

ఆమె లీడర్ అయ్యాక

కేరళలోని కొచ్చిన్ యూనివర్సిటీ మొన్నటి జనవరి 11న తన యూనివర్సిటీ విద్యార్థినులకు బహిష్టు సెలవలు ఇస్తున్నట్టుగా ప్రకటించింది. దానికి కారణం ఆ యూనివర్సిటీలో డిసెంబర్‌లో స్టూడెంట్ ఎలక్షన్లు జరిగి ఎస్.ఎఫ్.ఐ తరఫున నమితా జార్జ్ అనే విద్యార్థిని స్టూడెంట్ యూనియన్‌కు చైర్ పర్సన్‌గా ఎంపిక కావడం. పాలక్కడ్‌కు చెందిన 23 ఏళ్ల నమిత ఆ యూనివర్సిటీలో లా ఫైనల్ ఇయర్ చదువుతోంది. తనలాంటి విద్యార్థినుల ఇబ్బంది గమనిస్తూ రావడం వల్ల తాను లీడర్ అయిన వెంటనే విద్యార్థినులకు బహిష్టు సెలవులు ఎంత అవసరమో వివరిస్తూ ఆమోదం కోసం యూనివర్సిటీకి లేఖ రాసింది. యూనివర్సిటీ వెంటనే ఈ లేఖను పరిగణించి జనవరి 11న బహిష్టు సెలవులు ప్రకటించింది. అంతేకాదు తన యూనివర్సిటీలో 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు 2 నెలల ప్రసూతి సెలవు వాడుకునే వెసులుబాటును ప్రకటించింది. విద్యార్థినుల తరఫున చేయదగ్గ కనీస నిర్ణయంగా యూనివర్సిటీ ఈ చర్యను వ్యాఖ్యానించింది.

> సెలవు అవసరమా అని కొట్టాయంలోని స్కూలు యాజమాన్యాన్ని అడిగితే 'ఆరోగ్యం బాగలేకపోతే పిల్లలు ఎలా బడికి రారో బహిష్టు సమయంలో కూడా అలానే రారని అర్థం చేసుకుంటే సరిపోతుంది' అన్నారు.

కదిలిన ప్రభుత్వం

కొచ్చిన్ యూనివర్సిటీ విద్యార్థినులకు బహిష్టు సెలవులు ప్రకటించాక దానికి వచ్చిన స్పందన చూసి కేరళ ప్రభుత్వం స్పందించింది. కేరళలోని మొత్తం 14 యూనివర్సిటీల్లో విద్యార్థినులకు బహిష్టు సెలవు, ప్రసూతి సెలవు మంజూరు చేసింది. యూనివర్సిటీల్లో సెమిస్టర్లు రాయడానికి 75 శాతం హాజరు అవసరం. కాని విద్యార్థినులకు ఇక మీదట 73 శాతం హాజరు ఉంటే సరిపోతుంది. 2 శాతం బహిష్టు సెలవుల కింద పోతుంది. ఈ నిర్ణయం వెలువడటం వెనుక అక్కడి ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఒక మహిళ డాక్టర్ ఆర్.బిందు ఉండటం కూడా ఒక కారణం కావచ్చు.

స్కూళ్ల మాట ఏమిటి?

ఈ నిర్ణయం వెలువడ్డాక జూనియర్ కాలేజీల్లో, స్కూళ్లలో విద్యార్థినుల బహిష్టు సెలవుల గురించి చర్చ వచ్చింది. వారిని పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వం తగిన విధానం కోసం అధ్యయనం చేస్తోంది. ఈలోపు కొట్టాయంలోని 'లేబర్ ఇండియా పబ్లిక్ స్కూల్' అనే సిబిఎస్ఇ స్కూలు తన స్కూల్లోని విద్యార్థినులకు బహిష్టు సెలవులు తనకు తానుగా మంజూరు చేసింది. అంతేకాదు 'ప్యూబర్టీ ల్యాబ్' పేరుతో ఒక ల్యాబ్‌ను తెరిచి ఈడేరే పిల్లల కోసం బహిష్టు క్లినిక్, శుభ్రత శిక్షణ, ప్యాడ్‌ల తయారీ, లైంగిక ఆరోగ్యం గురించి అవగాహన అందుబాటులోకి తేనుంది. 'తెలిసీ తెలియని వయసులో బహిష్టు సమయంలో ఆడపిల్లలకు ఎన్నో భయాలు, ఆందోళనలు, మానసిక, శారీరక సమస్యలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసే వ్యవస్థ అవసరం' అని ఆ స్కూలు యాజమాన్యం చెప్పింది.

అతి ముఖ్యమైన సమస్య

కేరళలోనే కాదు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఆడపిల్లలు హైస్కూల్లో డ్రాపవుట్స్ కావడానికి బహిష్టు సమస్య, టాయిలెట్ల సమస్య ముఖ్య కారణాలని ఎన్నో అధ్యయనాలు చెప్పాయి. శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా ఇచ్చే ప్రయత్నాలు ఇంకా పూర్తి స్థాయి జరగడం లేదు కాని కదలిక వచ్చింది. టాయిలెట్ల సమస్య కూడా కొన్ని రాష్ట్రాల్లో సమర్థంగా కొన్ని రాష్ట్రాల్లో అంతంత మాత్రంగా తీరుతోంది. విద్యార్థినులు బహిష్టు మూడు రోజులు తీవ్ర ఇబ్బందితో స్కూల్‌కు రాలేకపోతే హాజరుకు భయపడి అసలుకే ఎగనామం పెట్టవచ్చు. అదే బహిష్టు సెలవు ఉంటే ధైర్యంగా పెట్టుకునే వీలు ఉంటుంది. ఈ సెలవు అవసరమా అని కొట్టాయంలోని స్కూలు యాజమాన్యాన్ని అడిగితే 'ఆరోగ్యం బాగలేకపోతే పిల్లలు ఎలా బడికి రారో బహిష్టు సమయంలో కూడా అలానే రారని అర్థం చేసుకుంటే సరిపోతుంది' అన్నారు. నిజమే. జ్వరం వస్తే స్కూలుకు పోనట్టు పిరియడ్స్ సమయంలో ఇబ్బంది ఉంటే స్కూలుకు పోని వీలు విద్యార్థినులకు ఉండాలి.

స్త్రీల గురించి ఆలోచించే కొద్ది ఎన్ని మార్పులు వ్యవస్థలో రావాలో మెల్లమెల్లగా అర్థమవుతోంది. విద్యార్థినులకు ఈ సౌకర్యం ఎంత అవసరమో ప్రతి ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఆడపిల్లల చదువు మరింత సౌకర్యంగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

రికార్డ్

పాటలు అందరూ పాడతారు కానీ గానకోకిలలు కొందరే అవుతారు.
అలాంటి గానకోకిలలలో కూడా ఒకరో ఇద్దరో మాత్రమే సంగీత సామ్రాజ్ఞులు అవుతారు.
ఆ సంగీత సామ్రాజ్ఞి అల్కా యాజ్ఞిక్.
గత మూడేళ్లుగా ఆమె పాటలు యూట్యూబ్‌లో అత్యధికంగా స్ట్రీమ్ అవుతూనే ఉన్నాయి.
ఈ సంవత్సరం అది రికార్డులకే రికార్డుగా మారింది.
2022 వ సంత్సరంలో ఏకంగా 15.3 బిలియన్ల స్ట్రీమ్స్ సాధించింది అల్కా.
అంటే సగటున రోజుకు 42 మిలియన్లు... మన లెక్కల్లో చెప్పాలంటే
రోజుకు నాలుగు కోట్ల 20 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఆమె ఛానెల్‌ను వీక్షించారు.
అదేమైనా సాధారణమైన విషయమా?
కానే కాదు.. అందుకే ఆమె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో యూ ట్యూబ్ స్ట్రీమింగ్‌లో ప్రథమ స్థానం సాధించి 2022వ సంవత్సరానికిగానూ మోస్ట్ స్ట్రీమ్డ్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుంది.

యూ ట్యూబ్‌కి అల్కా కిరీటం

నాలుగో ఏట భజన గీతాలు పాడటంతో ఆరంభమైన ఆమె గానకౌశలం అనగ అనగ రాగమతిశయిల్లుచుండు అన్నట్లు సెలయేళ్లు, నదులు తమ దిశలను మార్చుకుంటూ ప్రవహించినట్లు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఒడుపులను అందిపుచ్చుకుంటూ సరికొత్త రికార్డులను సృష్టిస్తూనే ఉంది.



అల్కా యాజ్ఞిక్

యూట్యూబ్ లో గాయనీగాయకులకు ఉండే ఫాలోయింగ్ అసాధారణం. నేటితరం చాలా వేగంగా యూట్యూబ్ డిజిటల్ మాధ్యమాల వేదికపై దూసుకుపోతున్నారు. అయితే సీనియర్ గాయణీమనుల్లో అల్కా యాగ్నిక్ గత వరుస మూడు సంవత్సరాలుగా యూట్యూబ్ లో స్థిరంగా రాణిస్తున్న గాయనిగా రికార్డులకెక్కారు.

గిన్నిస్ రికార్డ్స్ ప్రకారం అల్కా యాగ్నిక్ గత సంవత్సరం 15.3 బిలియన్ యూట్యూబ్ స్ట్రీమ్ లను సంపాదించారు. సగటున రోజుకు 42 మిలియన్లు.. ఇది అసాధారణం. గత మూడు సంవత్సరాలుగా అల్కా పాటలను యూట్యూబ్ తన సందర్శకులకు మళ్లీ మళ్లీ వినిపిస్తూనే ఉంది.

ఏక్ దో తీన్ ...

1966 మార్చి 20 న కోల్‌కతాలో జన్మించిన అల్కా 1980 లలోనే సినీ నేపథ్య గాయనిగా తన ప్రస్థానం ప్రారంభించినా ఆ దశకం చివరలో వచ్చిన నాటి మేటి క్లాసిక్ చిత్రం తేజాబ్‌లో మాధురీ దీక్షిత్‌కు పాడిన ఏక్ దో తీన్ .. పాటతో మొదటి హిట్టు కొట్టింది. అప్పట్లో ఈ పాట దేశవ్యాప్తంగా ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగినా తప్పనిసరిగా వినిపించిన ఒక హుషారైన గీతం అంటే అతిశయోక్తి కాదు. ఈ పాటకు అల్కా యాగ్నిక్ ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకున్నారు.

ఆ తర్వాత నుంచి ఆమె ఎందరో సహ గాయకులతో, సంగీత దర్శకులతో పాడుతూ ఉత్తమ నేపథ్య గాయనిగా వేలాది పాటలు పాడి అత్యధిక ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకుని రికార్డుల పంట పండించిన ఘనత తను సొంతం చేసుకుంది. తాజాగా అన్ని రికార్డులనూ తిరగరాసింది. విశేషమేమిటంటే ఆమె పాటలు భారతదేశంలోనే కాదు, పాకిస్థాన్‌లో అయితే ఏకంగా 683 మిలియన్ స్ట్రీమ్స్ సాధించడం, ఇటీవలి కాలంలో యూత్‌ను ముఖ్యంగా టీనేజర్స్‌ను ఒక ఊపు ఊపేస్తున్న కొరియాకు చెందిన బీటీఎస్ బృందాన్ని కూడా అల్కా ఈ రేసులో వెనక్కు నెట్టేయడం మరో విశేషం.

యూట్యూబ్ ఆమెకు కిరీటాన్ని అలంకరించడం కాదు.. యూట్యూబ్‌కే ఆమె మకుటాయమానంగా శోభిల్లుతోందంటే అది ఆమె గానమాధుర్యం గొప్పతనమే కాదు, సంగీతానికున్న క్రేజు, మోజు కూడా!

బ్యూటిప్స్

ముడతలకు జాగరీ వాష్

బెల్లంతో తయారు చేసిన ఫేస్ వాష్ యాంటీ ఏజింగ్‌గా పనిచేసి ముడతలను కనిపించనియ్యదు.



- చిన్న బెల్లం ముక్క తీసుకుని ఒక గిన్నెలో వేసి, సరిపడా నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన తరువాత టీస్పూను శనగపిండి, టీస్పూను పెరుగు వేసి చక్కగా కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఏడు నిమిషాలపాటు గుండ్రంగా మర్దన చేయాలి. తరువాత ఇరవై నిమిషాలపాటు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేయాలి. ముఖాన్ని తడిలేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్ రాసుకోవాలి.
- ఈ ఫేస్ వాష్‌ను వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా వాడడం వల్ల ముఖం మీద సన్నని గీతల్లా కనిపించే ముడతలు తగ్గ ముఖం పడతాయి.

స్ఫూర్తి

రాట్నం వడకడం అనేది సాంకేతిక విషయం కాదు. స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపడి ఉన్న విలువైన చారిత్రక జ్ఞాపకం. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతీక్ష సోనీకి ఆ చారిత్రక జ్ఞాపకాల సమహారం అంటే ఇష్టం. వాటి నుంచి స్ఫూర్తి పొంది నలుగురికి సహాయపడడం అంటే ఇష్టం...



ప్రతీక్ష సోనీ

బాపూజీ బాటలో..

మధ్యప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌కు చెందిన ప్రతీక్ష సోనీ బాల్యం నుంచి బాపూజీ గురించి వింటూ పెరిగింది. రాట్నం వడకడం ద్వారా స్వదేశీ ఖాదీ ఉద్యమానికి ఊపిరులూదిన మహాత్ముడి గురించి ఎన్నో కథలు విన్నది. అలా తనకు తెలియకుండానే రాట్నం వడకడంపై ఆసక్తి మొదలైంది. చివరికి అదే తన ఉపాధిగా మారింది.

'మహాత్ముడు మాకు ఉపాధి కల్పించాడు. ఇంటి దగ్గరే రాట్నం వడుకుతూ ఎలాంటి ఆర్థిక సమస్యలు లేకుండా ఉంటున్నాం. ఇదంతా ఆ మహాత్ముడి దయ' అంటుంది పద్దెనిమిది సంవత్సరాల ప్రతీక్ష.

ఆర్థికంగా బలహీనంగా ఉన్న 93 మందికి పైగా మహిళలకు రాట్నం వడకడం నేర్పించి సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది ప్రతీక్ష.

'ఒకరోజు కూలి దొరికి, మరొక రోజు దొరకక ఆర్థికంగా ఇబ్బందులు పడేదాన్ని. అప్పులు చేయాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితులలో ప్రతీక్ష నాకు కొత్త దారి చూపించింది' అంటుంది ఇద్దరు పిల్లలకు తల్లి అయిన సుమిత్ర.

ఇరవై సంవత్సరాల విమల పట్నంలో ఉద్యోగం చేయడానికి వెళ్లింది. అయితే మూడు నెలలు గడవకుండానే తాను అక్కడ ఉండడం కష్టమనే విషయం అర్థమైంది. తన జీతంలో సగం డబ్బులు ఇంటి అద్దెకే పోయేవి. అలా అని ఊరుకెళ్లలేని పరిస్థితి. అక్కడ ఏ పని దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రతీక్ష గురించి తెలుసుకుంది.

రాట్నం వడకడం నేర్చుకొని ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా ఊళ్లోనే ఉంటుంది విమల.

ఇటీవల నేపియ పట్టణంలో జరిగిన స్వదేశీ ఖాదీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీక్ష–

'ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కొత్త ఉత్తేజం వస్తుంది. పదిమందికి సేవ చేయాలనే దృక్పథం ఉన్న వారు పరిచయం అవుతారు. అలాంటి వారి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. ఎన్నో మంచి పనులు చేయవచ్చు' అంటుంది ప్రతీక్ష సోనీ.

కిచెన్ టిప్స్



- మినరల్ వాటర్ క్యాన్‌ను శుభ్రం చేయడం కొంచెం కష్టం. అయితే దానికో సులువైన చిట్కా ఉంది. క్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల రాళ్ల ఉప్పు, టీస్పూను బేకింగ్ సోడా, రెండు స్పూన్ల నిమ్మ రసం, కాసిని కొద్ది గోరు వెచ్చని నీళ్లు పోసి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరువాత క్యాన్‌ను పైకి కిందకు బాగా గిలకొట్టాలి. పదినిమిషాలపాటు ఇలా గిలకొట్టి రెండుమూడుసార్లు నీటితో కడగాలి. తరువాత డిష్ వాష్ లిక్విడ్‌తో వాటర్ క్యాన్ బయటవైపు తోముకుంటే క్యాన్ మురికి వదిలి కొత్తదానిలా మెరుస్తుంది.
- బట్టల మీద పడిన ఇంక్ మరకలు పోవాలంటే...ఇంక్ మరకలపై కొద్దిగా నీళ్లు చల్లాలి. ఇప్పుడు టూత్ పేస్టును అప్లై చేసి బ్రష్‌తో రుద్ది నీటితో వాష్ చేస్తే ఇంక్ మరకలు ఇట్టే పోతాయి.

యూత్ పల్స్

'బడ్జెట్ అంటే అంకెల వరుస కాదు. అంతకంటే ఎక్కువ. మన జీవితంతో ముడిపడి ఉన్న విషయం'
'బడ్జెట్ నవ్విస్తూనే ఏడిపిస్తుంది. ఏడిపిస్తూనే నవ్విస్తుంది' ... ఇలాంటి మాటలెన్నో బడ్జెట్‌కు ముందు, బడ్జెట్‌కు తరువాత వినిపిస్తూనే ఉంటాయి. యువతరం ఈ మాటలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలియదుగానీ 'బడ్జెట్ ప్రసంగం' వినడానికి మాత్రం తగిన ఆసక్తి ప్రదర్శిస్తోంది. సివిల్స్ కలలు కనే వారి నుంచి స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాలనుకునే వారి వరకు, క్రిప్టో కరెన్సీపై ఆసక్తి చూపుతున్న వారి నుంచి లాంగ్-టర్మ్ సేవింగ్ కల్చర్‌లో భాగం అవుతున్న వారి వరకు యువతరంలో చాలామంది బడ్జెట్ తీరుతెన్నులు, విషయాలు, విశేషాలను తెలుసుకోవడానికి, తమదైన శైలిలో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు...



బడ్జెట్ బడిలో యువతేజం

కాలేజీలో చదువుతున్నవారు, మొన్న మొన్ననే కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు, ఉద్యోగం ఊసు ఎత్తకుండా స్టార్టప్ కలలు కనే యంగ్‌స్టర్స్‌కు బడ్జెట్ ప్రసంగం అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'క్యాపిటల్ బడ్జెట్ అంటే ఏమిటి? రెవెన్యూ బడ్జెట్ అంటే ఏమిటి? అసలు బడ్జెట్ అంటే ఏమిటి?'... రెండు సంవత్సరాల క్రితం బెంగళూరుకు చెందిన నిహారికకు తెలిసి ఉండకపోవచ్చు, తెలుసుకోవాలనే ఆసక్తి ఉండకపోవచ్చు... కాని ఇప్పుడు పరిస్థితి వేరు.

తానేమీ ఆర్థికశాస్త్ర విద్యార్థి కాకపోయినా బడ్జెట్ గురించి రకరకాల కోణాలలో తెలుసుకోవడం అనేది ఆమె ప్రధాన ఆసక్తిగా మారింది. దీనికి కారణం భవిష్యత్‌లో సివిల్స్ పరీక్ష రాయాలనుకోవడం.

'అన్ని విషయాలలో అవగాహన ఉంటేనే సివిల్స్‌లో సక్సెస్ అవుతాం. ఇష్టమైన సబ్జెక్ట్‌కు పరిమితమైతే కల కలగానే మిగిలిపోతుంది' అంటుంది నిహారిక.

యంగ్‌పీపుల్ బడ్జెట్ ప్రసంగం వినడానికి ఆసక్తి చూపడానికి గల కారణాలలో సివిల్స్‌లాంటి పరీక్షలు మాత్రమే కాదు 'ఏ రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయి' అని తెలుసుకోవడం కూడా ఒకటి.

గత సంవత్సరం బడ్జెట్‌లో పద్నాలుగు పరిశ్రమలలో లక్షలాది ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావించారు.

'ఈ సంవత్సరం పరిస్థితి ఏమిటి?' అనే ఆసక్తి సహజంగానే ఉంటుంది. ఆ ఆసక్తే వారిని బడ్జెట్‌పై ఆసక్తి కలిగేలా చేస్తుంది.

కంపెనీల లే ఆఫ్‌లతో ఉద్యోగం కోల్పోయిన వారు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తున్నారు. 'మళ్లీ ఉద్యోగం వెదుక్కోవడం ఎందుకు? మనమే ఒక స్టార్టప్ స్టార్ట్ చేసి సక్సెస్ కావచ్చు కదా' అనుకునేవారు యువతరంలో చాలామందే ఉన్నారు.

'ఉద్యోగం చేయడం కంటే ఉద్యోగాలు సృష్టించండి' అని ప్రభుత్వం చెబుతున్న మాటను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

స్టార్టప్ మొదలుపెట్టాలనుకునేవారికి బడ్జెట్ గురించి తెలుసుకోవడం అనేది ముఖ్యం అయిపోయింది. అంకుర పరిశ్రమలకు పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వినడం అనివార్యం అయింది.

> స్టార్టప్ మొదలుపెట్టాలనుకునేవారికి బడ్జెట్ గురించి తెలుసుకోవడం అనేది ముఖ్యం అయిపోయింది. అంకుర పరిశ్రమలకు పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వినడం అనివార్యం అయింది.

హైబ్రిడ్ వర్కింగ్ మోడల్ (ఆఫీస్, ఇంటి నుంచి రెండు విధాలుగా పనిచేసే అవకాశం ఉన్నవారు) 'మా గురించి ఏమైనా ప్రస్తావన ఉందా!' అన్నట్లుగా బడ్జెట్‌పై ఒక కన్ను వేస్తున్నారు.

దీర్ఘకాలిక దృష్టితో పొదుపు చేయడం అనేది దేశ ఆర్థిక వృద్ధికి మాత్రమే కాదు, పొదుపు చేసే వారి మంచి భవిష్యత్‌కు కూడా కారణం అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని లాంగ్-టర్మ్ సేవింగ్ కల్చర్‌ను యువతలో పెంపొందించడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. వాటి గురించి తెలుసుకోవాలంటే బడ్జెట్ ప్రసంగం వినాల్సిందే.

సాంకేతిక నైపుణ్యవంతులైన యువతరం రకరకాల ఆర్థిక వనరులను, సాధనాలను వెలికి తీయడంలో ముందుంటుంది. ఈ క్రమంలో సహజంగానే వారి దృష్టి క్రిప్టో కరెన్సీపై ఉంది.

క్రిప్టో కరెన్సీకి సంబంధించి పన్నులు, నియంత్రణ అంశాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వింటున్నారు.

తమ ప్రయోజనాలకు సంబంధించి బడ్జెట్‌పై ఆసక్తి ఒక కోణం అయితే, సామాజిక కోణం అనేది రెండోది. ఇందుకు ఉదాహరణ దిల్లీకి చెందిన హిమవర్ష. డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థి అయిన హిమవర్షకు విద్యారంగం అనేది ఆసక్తికరమైన సబ్జెక్ట్.

'జాతీయ విద్యావిధానం విద్యారంగానికి తగినంత బడ్జెట్ కేటాయించమని చెబుతుంది. అయితే అవసరమైనదానిలో సగం బడ్జెట్‌ను మాత్రమే కేటాయిస్తున్నారు. మన దేశంలో విద్యారంగం అనేది వేగంగా వృద్ధి చెందుతున్న రంగం. ఈ బడ్జెట్‌లోనైనా సరిపడా నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాను' అంటుంది హిమవర్ష.

ఆమె ప్రస్తావిస్తున్న మరో అంశం... డిజిటల్ యూనివర్శిటీ.

'డిజిటల్ యూనివర్శిటీ అనేది మన విద్యానాణ్యతను ప్రపంచస్థాయి ప్రమాణాలతో పెంచడానికి ఉపయోగపడుతుంది. గత సంవత్సరం బడ్జెట్‌లో డిజిటల్ యూనివర్శిటీ గురించి ప్రకటించారు. దీనికి సంబంధించి ఆశాజనకమైన విషయాలు ఈ బడ్జెట్‌లో ప్రస్తావిస్తారని ఆశిస్తున్నాను. ఏఆర్, వీఆర్, రోబోటిక్స్‌కు ప్రత్యేక కేటాయింపు ఉండాలి. డిజిటల్ ఎడ్యుకేషన్ సెక్టార్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి' అంటుంది హిమవర్ష.

'బడ్జెట్' అనే బడిపై యువతరం ఆసక్తి ప్రదర్శించడమే కాదు ఓనమాలు నేర్చుకొని, విషయ విశ్లేషణ చేస్తూ జ్ఞానపరిధిని పెంచుకొంటుంది. మంచిదే కదా!



టాప్ ర్యాంక్‌కు చేరువలో దీప్తి శర్మ

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మూడో ర్యాంక్ నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ముక్కోణపు టి20 టోర్నీలో దీప్తి 9 వికెట్లు పడగొట్టింది. అగ్రస్థానంలో ఉన్న సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్)కు దీప్తికి కేవలం 26 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసమే ఉంది. రేపు దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్లో భారత స్పిన్నర్ తన జోరు కొనసాగిస్తే టాప్ ర్యాంక్ సాకారమయ్యే చాన్స్ ఉంది. టాప్–10లో మరో ఇద్దరు భారత బౌలర్లు రేణుక (7వ), స్నేహ్ రాణా (10వ) ఉన్నారు.

తొమ్మిదో ర్యాంక్‌లో సింధు



ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పీవీ సింధు తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇండియా ఓపెన్ తర్వాత ఏ టోర్నీలో ఆడని ఆమె మహిళల సింగిల్స్‌లో ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయింది. సైనా నెహ్వాల్ రెండు స్థానాలు ఎగబాకి 26వ ర్యాంక్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 16వ ర్యాంక్‌కు పడిపోగా, ప్రణయ్ 9వ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నాడు. లక్ష్యసేన్ ఒక ర్యాంక్ మెరుగుపర్చుకొని 11వ స్థానానికి చేరాడు.

'లక్నో' క్యురేటర్‌పై వేటు

న్యూఢిల్లీ: భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో టి20కి నాసిరకం పిచ్‌ను తయారు చేసినందుకు క్యురేటర్‌పై వేటు పడింది. ఈ పిచ్ తనను షాక్‌కు గురి చేసిందని, టి20లకు ఇలాంటి పిచ్ పనికి రాదని భారత కెప్టెన్ హార్దిక్ పాండ్యా బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం (యూపీసీఏ) ఈ చర్య తీసుకుంది. 'ఏకనా స్టేడియం పిచ్ క్యురేటర్‌ను తొలగించి అతని స్థానంలో సంజీవ్ అగర్వాల్‌ను ఎంపిక చేశాం. అనుభవజ్ఞుడైన సంజీవ్ రాబోయే మ్యాచ్‌ల కోసం సరైన పిచ్‌ను తయారు చేయగలడు. ఈ మైదానంలోని పిచ్‌లన్నింటినీ దేశవాళీ మ్యాచ్‌ల కోసం వరుసగా ఉపయోగించడంతో అవి ఇలా నాసిరకంగా తయారయ్యాయి. కనీసం రెండు పిచ్‌లను వాడకుండా అంతర్జాతీయ మ్యాచ్ కోసం క్యురేటర్ సిద్ధంగా ఉంచాల్సింది' అని యూపీసీఏ అధికారి ఒకరు వెల్లడించారు. మ్యాచ్‌లో ముందుగా కివీస్ 99 పరుగులకే పరిమితం కాగా, కేవలం ఒక బంతి మిగిలి ఉండగా భారత్ లక్ష్యాన్ని ఛేదించింది.

భారత పర్యటనలో 'వార్మప్' ఆడకపోవడం సరైందే: స్మిత్



సిడ్నీ: భారత పర్యటనలో వార్మప్‌తో కాకుండా నేరుగా టెస్టు సిరీస్‌తోనే ఆట మొదలు పెట్టడం సరైన నిర్ణయమేనని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. భారత్‌లో తమకు సవాల్ స్పిన్‌తో ఉంటే వార్మప్ మ్యాచ్ పేస్ వికెట్‌పై ఏర్పాటు చేయడం జట్టుకు ఏమాత్రం మేలు చేయదని ఈ సీనియర్ బ్యాటర్ అభిప్రాయపడ్డాడు. నాలుగు టెస్టుల పూర్తిస్థాయి సిరీస్ ఆడేందుకు రానున్న కంగారూ జట్టు కనీసం ఒక్క ప్రాక్టీస్ మ్యాచ్ కూడా ఆడకపోవడం ఆశ్చర్యపరిచింది. దీనిపై అతను ఆస్ట్రేలియన్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'గత పర్యటనలో మేం గ్రీన్‌టాప్ (పేస్ పిచ్)పై సన్నాహక మ్యాచ్ ఆడాం. కానీ మాకు సిరీస్‌లో ఎదురైంది స్పిన్ ట్రాక్‌లు. అలాంటపుడు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడటం దండగ! దీనికంటే స్పిన్ పిచ్‌లపై సన్నద్ధమయ్యేందుకు నెట్స్‌లో స్పిన్ బౌలింగ్‌తో ప్రాక్టీస్ చేయడమే ఉత్తమం. మా బోర్డు (క్రికెట్ ఆస్ట్రేలియా) ఈసారి వార్మప్ వద్దని మంచి పనే చేసింది' అని అన్నాడు. భారత పర్యటనలో తమకు కఠిన సవాళ్లు తప్పవన్నాడు. ఈ నెల 9 నుంచి నాగ్‌పూర్‌లో జరిగే తొలి టెస్టుతో ద్వైపాక్షిక సిరీస్ మొదలవుతుంది.



హార్దిక్ పాండ్యా బృందం

ఫెర్గూసన్, సాన్‌ట్నర్

ఆఖరి ఆటకు సిద్ధం!

- నేడు భారత్, న్యూజిలాండ్ మూడో టి20
- గెలిచిన జట్టు ఖాతాలో సిరీస్
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఇప్పటికే మూడు టి20 సిరీస్‌లు గెలుచుకున్న భారత జట్టు ఇప్పుడు మరో సిరీస్‌లో తుది సమరానికి సన్నద్ధమైంది. ఏకపక్షంగా సాగిన వన్డేలతో పోలిస్తే రెండు టి20ల్లోనూ న్యూజిలాండ్ నుంచి టీమిండియా గట్టి పోటీ ఎదుర్కొంది. దాంతో సిరీస్ ఫలితం చివరి మ్యాచ్‌కు చేరింది. ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ కారణంగా మున్ముందు కొన్ని నెలల పాటు భారత జట్టు టి20 మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో మన జట్టు విజయంతో ముగిస్తుందా లేక కివీస్ తన సత్తా చాటి సిరీస్ సాధిస్తుందా చూడాలి.

అహ్మదాబాద్: సొంతగడ్డపై శ్రీలంకను చిత్తు చేసి రెండు ఫార్మాట్‌లలోనూ సిరీస్ గెలుచుకున్న భారత జట్టు న్యూజిలాండ్‌తోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేయాలని పట్టుదలగా ఉంది. వన్డేల్లో విజేతగా నిలిచిన టీమిండియా, టి20ల్లో సిరీస్ అందుకునే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు న్యూజిలాండ్ కూడా ఈ అవకాశాన్ని వదిలి పెట్టరాదని పట్టుదలగా ఉంది. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి సిరీస్ 1–1తో సమంగా ఉన్న స్థితిలో నేడు జరిగే చివరి టి20 మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ తలపడనున్నాయి. తాజా ఫామ్, జట్లను చూస్తే మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయం.

ఉమ్రాన్‌కు చాన్స్...

రోహిత్, రాహుల్, కోహ్లిల గైర్హాజరులో భారత్ టాప్–3 ఈ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేదనేది స్పష్టం. గిల్, ఇషాన్, రాహుల్ త్రిపాఠి అంచనాలకు అనుగుణంగా ఆడలేకపోయారు. ఈ మ్యాచ్‌లోనైనా వీరు మెరుగ్గా రాణిస్తే మ్యాచ్‌లో భారత్ భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. చాలా కాలం తర్వాత టీమ్‌లోకి ఎంపికైన పృథ్వీ షాకు ఆడే అవకాశం రాకుండానే సిరీస్ ముగిసిపోయేలా కనిపిస్తోంది. బౌలింగ్‌లో భారత తుది జట్టులో ఒక మార్పు జరగవచ్చు. లక్నోలాంటి టర్నింగ్ పిచ్ కాకపోవడంతో మళ్లీ చహల్ స్థానంలో ఉమ్రాన్ జట్టులోకి రావచ్చు.

అరుదైన అవకాశం...

న్యూజిలాండ్ జట్టు 2012లో చెన్నైలో జరిగిన ఏకైక టి20లో భారత్‌ను ఓడించింది. అది మినహా 1955 నుంచి ఏ ఫార్మాట్‌లో కూడా మన గడ్డపై ఆ జట్టు సిరీస్ గెలవలేకపోయింది. అయితే తాజా ఫామ్‌ను బట్టి చూస్తే తమ జట్టు ఆ అరుదైన ఘనత అందుకోగలదని కివీస్ ఆశిస్తోంది. టీమ్ తుది జట్టులో కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. కాన్వే జోరు మీదుండగా, ఇతర ఆటగాళ్ల నుంచి కూడా తగిన సహకారం అందుతోంది. అలెన్, ఫిలిప్స్ బ్యాటింగ్‌లో కీలకం కానుండగా, ఆల్‌రౌండర్లు బ్రేస్‌వెల్, మిచెల్ కూడా ఆకట్టుకున్నారు. స్పిన్నర్లు సాన్‌ట్నర్, ఇష్ సోధి భారత లైనప్‌ను కట్టిపడేయగల సమర్థులు. వ్యక్తిగతంగా గొప్ప ఘనతలు లేకపోయినా... సమష్టిగా తమ జట్టు బలమైందని ఎన్నోసార్లు నిరూపించిన న్యూజిలాండ్ మళ్లీ అదే పట్టుదలను చూపిస్తే సంతోషంగా తిరిగి వెళ్లవచ్చు.

పిచ్, వాతావరణం: నరేంద్ర మోదీ స్టేడియంలోని పిచ్ మొదటి నుంచీ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఇక్కడ జరిగిన అన్ని మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రోజు వర్ష సూచనలేదు. పశ్చిమ భారత్‌లో పెద్దగా మంచు ప్రభావం లేదు.

55 గత పదేళ్లలో భారత జట్టు సొంత గడ్డపై మూడు ఫార్మాట్‌లలో కలిపి 55 సిరీస్‌లు ఆడింది. ఇందులో 47 సిరీస్‌లు గెలవడం విశేషం. ఒక్క ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మాత్రమే భారత్‌ను ఓడించగలిగాయి.

రికీ భుయ్ సెంచరీ: ఆంధ్ర 262/2

- శతకం దిశగా కరణ్ షిండే
- మధ్యప్రదేశ్‌తో రంజీ క్వార్టర్ ఫైనల్



రికీ భుయ్



కరణ్ షిండే

ఇండోర్: తొలిసారి సెమీఫైనల్ బెర్త్ దక్కించుకోవాలనే లక్ష్యంతో మధ్యప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు నిలకడగా ఆడింది. స్థానిక హోల్కర్ స్టేడియంలో మంగళవారం మొదలైన ఈ ఐదు రోజుల మ్యాచ్‌లో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 262 పరుగులు సాధించి భారీ స్కోరు దిశగా సాగుతోంది. రికీ భుయ్ (200 బంతుల్లో 115 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించగా... కరణ్ షిండే (222 బంతుల్లో 83 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) శతకం దిశగా అడుగులు వేస్తున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 190 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టు కెప్టెన్ ఆదిత్య శ్రీవాస్తవ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... ఆంధ్ర జట్టు ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (21 బంతుల్లో 22; 3 ఫోర్లు), సీఆర్ జ్ఞానేశ్వర్ (48 బంతుల్లో 24; 5 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఎనిమిదో ఓవర్లో అభిషేక్ రెడ్డిని... 16వ ఓవర్లో జ్ఞానేశ్వర్‌ను గౌరవ్ యాదవ్ పెవిలియన్‌కు పంపించాడు. అవేశ్ ఖాన్ వేసిన బౌన్సర్ ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (37 బంతుల్లో 16 రిటైర్డ్ హర్ట్; 3 ఫోర్లు) ఎడమ చేయికి బలంగా తాకింది. దాంతో నొప్పి భరించలేక విహారి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రికీ భుయ్, కరణ్ షిండే పట్టుదలతో ఆడి మధ్యప్రదేశ్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. మరో వికెట్ పడకుండా రోజును ముగించారు.

భారత్‌లో వాలీబాల్ క్లబ్ ప్రపంచ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: భారత్‌లో వరుసగా రెండేళ్లపాటు వాలీబాల్ క్లబ్ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది రెండు సీజన్లు చాంపియన్‌షిప్ జరుగుతుందని అంతర్జాతీయ వాలీబాల్ సమాఖ్య (ఎఫ్‌ఐవీబీ) తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో జరిగే వాలీబాల్ లీగ్ టోర్నీల్లోని విజేతలతో ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహిస్తారు. ఒకప్పుడు మనదేశంలో చాంపియన్స్ లీగ్ టి20 క్రికెట్ (ఇప్పుడు లేదు)లాంటిదే ఈ వాలీబాల్ టోర్నీ. భారత్‌లో జరుగుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) విజేత వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. ఈ ఏడాది చివర్లో డిసెంబర్ 6 నుంచి 10 వరకు జరుగుతుందని... వేదిక తదితర వివరాలను పీవీఎల్ నిర్వాహకులు ప్రకటిస్తారని ఎఫ్‌ఐవీబీ అధ్యక్షుడు అరి గ్రా తెలిపారు. భారత్‌లో పురుషుల క్లబ్ వాలీబాల్ టోర్నీ జరగనుండటం ఇదే తొలిసారని ఆయన చెప్పారు. ముందుగా ఈ సీజన్ పీవీఎల్ ఈ నెల 4న బెంగళూరులో ప్రారంభమవుతుంది.

తొలి రౌండ్‌లోనే ఓడిన గాయత్రి–ట్రెసా జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో మూడో సీడ్, ప్రపంచ 19వ ర్యాంక్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 9–21, 10–21తో రెనా మియారా–అయాకో సకురామోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) 15–21, 18–21తో తాన్ నింగ్–జియా యు టింగ్ (చైనా)ల చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో బరిలోకి దిగిన కెయుర మోపాటి, నీలూరి ప్రేరణ, ఉన్నతి హుడా... పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో ఆడిన కార్తికేయ, సతీశ్ కుమార్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లోనే ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు.



సినిమా



వెంకటేశ్, సుర్వీన్ చావ్లా, రానా

హాలీవుడ్ వెబ్... బాలీవుడ్ హబ్

విదేశీ కథల్లో దేశీ తారలు

హాలీవుడ్ చిత్రాలు బాలీవుడ్‌లో రీమేక్ కావడం కొత్తేం కాదు. అయితే కరోనా తర్వాత మొదలైన వెబ్ సిరీస్‌ల హవా వల్ల ఇప్పుడు బాలీవుడ్ హబ్‌గా పలు హాలీవుడ్ సిరీస్‌లు కూడా రీమేక్ అవుతున్నాయి. విదేశీ కథలతో దేశీ తారలు చేస్తున్న ఈ వెబ్ సిరీస్‌ల గురించి తెలుసుకుందాం.

దగ్గుబాటి హీరోలు వెంకటేశ్, రానా నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమాన్ తెరకెక్కించిన ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అమెరికన్ క్రైమ్ డ్రామా సిరీస్ 'రే డొనవన్'కు రీమేక్‌గా 'రానా నాయుడు' రూపొందింది. ఈ సిరీస్ స్ట్రీమింగ్ తేదీపై త్వరలో ఓ స్పష్టత వస్తుంది. నేర ప్రపంచంలో సెటిల్మెంట్స్ చేసి డబ్బు సంపాదిస్తుంటాడు ఓ వ్యక్తి. అయితే అతని తండ్రి విడుదలైన తర్వాత కొన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ తండ్రీ కొడుకుల కథ ఏంటి? అన్నదే 'రానా నాయుడు' ప్రధాన కథాంశం. 2013లో మొదలైన 'రే డొనవన్' సిరీస్ ఏడుసీజన్లుగా 19 జనవరి 2020 వరకూ సాగింది. మరోవైపు నైట్ మేనేజర్‌గా వెబ్ వీక్షకుల ముందుకు వస్తున్నారు యువ హీరో ఆదిత్యారాయ్ కపూర్. అనిల్ కపూర్, శోభితా ధూళిపాళ కీలక పాత్రలు పోషించిన ఈ సిరీస్‌కు సందీప్ మోది దర్శకుడు. బ్రిటిష్ క్రైమ్ డ్రామా 'ది నైట్ మేనేజర్'కు రీమేక్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్ ఈ నెలలో స్ట్రీమింగ్ కానుంది. ఓ స్టార్ హోటల్‌లో పని చేసే ఓ నైట్ మేనేజర్ అదే హోటల్‌కు గెస్ట్‌గా వచ్చిన ఓ యువతిని ఇష్టపడతాడు. అయితే అనుకోకుండా అతను ఆయుధాలను అక్రమ రవాణా చేసే ఓ ముఠా నాయకుడి చేతిలో చిక్కుకుంటాడు. అప్పుడు ఆ నైట్ మేనేజర్ ఏం చేశాడు? అన్నదే కథ. ఇక అమెరికన్ క్రైమ్ డ్రామా 'రివెంజ్' సిరీస్ హిందీలో రీమేక్ కానుంది. ఇందులో లీడ్ రోల్‌ను రవీనా టాండన్ చేయనున్నారు. త్వరలో షూటింగ్ ఆరంభం కానుంది. 'రివెంజ్' కథ విషయానికి వస్తే... తన తండ్రి మరణానికి కారకులైన ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒక సాధారణ యువతి ఏ విధంగా పగ తీర్చుకుంది? అన్నదే కథాంశం. ఇంకోవైపు మరో అమెరికన్ సైన్స్ ఫిక్షన్ డ్రామా 'సిటా డెల్' హిందీలో రీమేక్ అవుతోంది. హిట్ సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్' దర్శకులు రాజ్ అండ్ డీకే 'సిటా డెల్' ఇండియన్ వెర్షన్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్ చేస్తున్నారు. దేశరక్షణ కోసం ఓ గూఢచారి ఎలాంటి సాహసాలు చేయాల్సి వస్తుంది? అనే నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. కాగా మరికొన్ని ఫారిన్ సిరీస్ లకు దేశీ వెర్షన్ రానుంది. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం.



అనిల్ కపూర్, శోభిత, ఆదిత్యా రాయ్ కపూర్



వరుణ్, సమంత



రవీనా



రాశీ, అజయ్



సుష్మిత

సోనాలీ బింద్రే


ప్రస్తుతం కొన్ని ఫారిన్ వెబ్ సిరీస్‌లు హిందీలో రీమేక్ అవుతుండగా ఆల్రెడీ కొన్ని సిరీస్‌లు ఇండియాలో రీమేక్ అయ్యాయి. జర్నలిజం నేపథ్యంలో రూపొందిన బ్రిటిష్ సిరీస్ 'ప్రెస్' హిందీ రీమేక్ 'ది బ్రోకెన్ న్యూస్'లో సోనాలీ బింద్రే ఓ లీడ్ రోల్ చేశారు. ఇజ్రాయెల్ సిరీస్ 'హోస్టేజెస్' అదే పేరుతో హిందీలో రీమేక్ కాగా ఇందులో రోనిత్ రాయ్, టిస్కా చోప్రా లీడ్ రోల్స్ చేశారు. అలాగే బ్రిటిష్ సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ 'లూథర్' హిందీ రీమేక్ 'రుద్ర: ది ఎడ్జ్ ఆఫ్ డార్క్‌నెస్'లో అజయ్ దేవగన్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలు చేశారు. ఇదే కోవలో డచ్ (నెదర్లాండ్) డ్రామా సిరీస్ 'పెనోజా' ఆధారంగా 'ఆర్య' హిందీలో రాగా, ఇందులో సుష్మితా సేన్ ప్రధాన పాత్రధారి. అలాగే అమెరికన్ సిరీస్‌లు 'క్రిమినల్ జస్టిస్' (మూడు సీజన్లు), 'ది ఆఫీస్'(రెండు సీజన్లు) నెట్టింటి వీక్షకుల ముందుకు వచ్చాయి.

నాని 30 షురూ



నాని, చిరంజీవి

హీరో నాని నటిస్తున్న 30వ చిత్రం షురూ అయింది. శౌర్యువ్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై చెరుకూరి మోహన్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, మూర్తి కలగర నిర్మిస్తున్న ఈ సినిమా మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన హీరో చిరంజీవి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. నిర్మాత సి. అశ్వినీదత్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకులు బుచ్చిబాబు, కిశోర్ తిరుమల, హను రాఘవపూడి, వశిష్ఠ, వివేక్ ఆత్రేయ తొలి సన్నివేశానికి దర్శకత్వం వహించారు. ఎంపీ, రచయిత విజయేంద్ర ప్రసాద్ మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందించారు. ''అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. నేటి నుంచి హైదరాబాద్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: భాను ధీరజ్ రాయుడు.



భరత్, జాహ్నవి, దివ్యాంశ, సందీప్ కిషన్, నాని, వరుణ్ సందేశ్, రంజిత్, రామ్మోహన్ రావు

నాపై వచ్చిన విమర్శలకు సమాధానమే మైఖేల్

– సందీప్ కిషన్

''నేను, నాని మా కెరీర్ ప్రారంభం నుంచి ఫ్రెండ్స్. కానీ, నా సినిమా వేడుకల్లో నాని పాల్గొన్న తొలి ఈవెంట్ ఇదే. ఒక సినిమా కోసం ఎంత చేయగలనో 'మైఖేల్' కోసం అంత చేశా. నాపై వచ్చిన విమర్శలకు ఈ సినిమానే సమాధానం'' అన్నారు సందీప్ కిషన్. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్, దివ్యాంశ కౌశిక్ జంటగా తెరకెక్కిన చిత్రం 'మైఖేల్'. నారాయణ్ దాస్ కె.నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నాని మాట్లాడుతూ– ''సినిమా ఇండస్ట్రీలో కష్టం, అదృష్టం, ప్రతిభ ఉంటే చాలా పైస్థాయికి చేరుకుంటారు.. సందీప్‌లో నాకు కష్టం, ప్రతిభ కనిపించింది.. కానీ అదృష్టం కనిపించలేదు.. అది 'మైఖేల్'తో తనకి మొదలవుతుంది. 'మైఖేల్' టీజర్, ట్రైలర్ చూసినప్పుడు ఈ మూవీతో ఓ కొత్త ఒరవడి ప్రారంభం కానుందని తెలుస్తోంది. 'శివ' సినిమా వచ్చినప్పుడు కొత్తగా ఉందనిపించింది.. అలాంటి ఓ సినిమా 'మైఖేల్' కావాలని కోరుకుంటున్నాను. సునీల్, రామ్మోహన్, భరత్‌గార్లకు ఈ సినిమా ఒక మైలురాయిగా నిలవాలి'' అన్నారు. ''మైఖేల్'ని ఇండియాలో 1500 థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు. ''యూనివర్సల్ సబ్జెక్ట్ ఇది.. నిర్మాతలుగా మేము సంతోషంగా ఉన్నాం'' అన్నారు భరత్ చౌదరి. ''నాది చెన్నై.. నేను హైదరాబాద్ వచ్చి సినిమా తీస్తున్నాను అనే అనుభూతి నాకు కలగకుండా నాదీ హైదరాబాదే అనేలా చూసుకున్న ఈ చిత్ర నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు రంజిత్ జయకొడి.

ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు – మధుబాల



శైలేష్, మధుబాల, శ్రీకాంత్

''ప్రేమదేశం' వంటి మంచి సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. శ్రీకాంత్ సిద్ధం చెప్పిన కథ, నా పాత్ర నచ్చి ఈ సినిమా చేశా'' అన్నారు నటి మధుబాల. త్రిగున్, మేఘా ఆకాష్, మధుబాల ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ సిద్ధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమదేశం'. శిరీష సిద్ధం నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, 'హిట్ 1, 2' డైరెక్టర్ శైలేష్ కొలను అతిథులుగా హాజరయ్యారు. మధుబాల మాట్లాడుతూ– ''మా నాన్న నన్ను డాక్టర్‌గా చూడాలనుకున్నారు. అయితే నాకు 'ఫూల్ ఔర్ కాంటే' సినిమాకి చాన్స్ రావడం, అది హిట్టవడంతో వెనక్కి తిరిగి చూసుకోలేదు'' అన్నారు. ''ఈ చిత్రాన్ని షార్ట్ ఫిలింగా తీద్దామనుకున్నాను. అయితే నా ఫ్రెండ్స్ సపోర్ట్ చేయడంతో పెద్ద సినిమా అయింది'' అన్నారు శ్రీకాంత్ సిద్ధం.

సూపర్ న్యాచురల్ సుందరి



జయప్రద

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ చిత్రం 'సువర్ణసుందరి'. సురేంద్ర మాదారపు దర్శకత్వంలో ఎం.ఎల్. లక్ష్మీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ట్రైలర్ అండ్ డిజిటల్ టికెట్‌ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చిత్రదర్శకుడు సురేంద్ర మాట్లాడుతూ – ''మంచి టెక్నికల్ వేల్యూస్‌తో రూపొందించిన మా చిత్రం ప్రేక్షకులకు చక్కని అనుభూతినిస్తుందని ఆశిస్తున్నాం'' అని అన్నారు. ఈ సినిమాకు సమర్పణ: డాక్టర్ ఎమ్‌వికె రెడ్డి, సహనిర్మాత: శ్రీకాంత్ పండుగల, సంగీతం: సాయి కార్తీక్.

చక్కని ప్రేమ



విశ్వ కార్తికేయ, హ్రితికా

విశ్వ కార్తికేయ హీరోగా, నటి ఆమని మేనకోడలు హ్రితికా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అల్లంత దూరాన'. చలపతి పువ్వల దర్శకత్వం వహించారు. కోమలి సమర్పణలో ఎన్. చంద్రమోహన రెడ్డి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఎన్. చంద్రమోహన రెడ్డి మాట్లాడుతూ– ''కథ, కథనాలకు ప్రాధాన్యమిస్తూ తీసిన సినిమా ఇది. తెలుగులో రిలీజ్ చేసిన తర్వాత మంచి డేట్ చూసుకుని తమిళంలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''చక్కని ప్రేమకథా చిత్రమిది. నిర్మాత సహకారంతో ఓ మంచి చిత్రం తీయగలిగాం'' అన్నారు చలపతి పువ్వల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 49	నిఫ్టీ ▲ 13
59,550	17,662

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,517	▲ 125
డోజోన్స్	33,872	▲ 148
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,772	▼ 13
డాక్స్	15,128	▲ 2
షాంఘై	3,256	▲ 14
నికాయ్	27,327	▲ 106

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,865 ▼ 214
బంగారం (99.5 స్వచ్ఛత)	56,637 ▼ 213
వెండి (కిలో)	67,671 ▼ 478

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	87.06	90.16
€	యూరో	ఒకటి	99.23	102.58
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.72	63.75
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.39	58.76
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.15	63.19
SAR	సౌదీ రియాల్	పదిహేనుకు	20.85	22.52
UAE D	యూఏఈ దిర్హామ్	పదిహేనుకు	21.24	23.20
¥	చైనా యువాన్	పదిహేనుకు	11.00	13.08

ఈ దశాబ్దం భారత్‌దే..!

వటిష్ఠంగానే ఆర్థిక వృద్ధి • 6.8 శాతం వరకు నమోదు కావచ్చు

సవాళ్లతో ప్రపంచం సతమతం • రూపాయి, ద్రవ్యోల్బణంపై వీటి ప్రభావం

2025–26 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి జీడీపీ

2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లు • 2023 ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఆర్థిక సర్వే 2023ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మంగళవారం సభ ముందుంచారు. ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సూచనల మేరకు కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం దీన్ని రూపొందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)తో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2023–24) జీడీపీ వృద్ధి కొంత నిదానించే అవకాశాల్లేకపోలేదని అంచనా వేసింది. అయినా కానీ, 6–6.8 శాతం మధ్య నమోదు కావచ్చని పేర్కొంది. సాధారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు, చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ అంచనాలను ఆర్థిక సర్వే తేటతెల్లం చేస్తుంది. ''2020 నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూడు షాక్‌లు తగిలాయి. కరోనా రాకతో ప్రపంచ ఉత్పత్తికి బ్రేక్ పడింది. తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా కమోడిటీ ధరలను పెంచేసింది. ఫలితంగా ద్రవ్యోల్బణం ఎగిసింది. దీనికి కట్టడి వేసేందుకు ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు కీలక వడ్డీ రేట్ల పెంపును చేపట్టాయి. యూఎస్ ఫెడ్ రేట్లను భారీగా పెంచడంతో పెట్టుబడులు అమెరికా మార్కెట్‌కు తరలేలా చేసింది. దీంతో ఎన్నో కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడింది. ఫలితంగా మన దేశ కరెంటు ఖాతా లోటు విస్తరించింది. నికర దిగుమతి దేశమైన భారత్ వంటి వాటిపై ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు దారితీసింది. అయినప్పటికీ 2021–22లో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకుంది. అమెరికా కేంద్ర బ్యాంకు ఇక ముందూ రేట్లను పెంచే అవకాశాల నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగుతుంది. అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు గరిష్ఠ స్థాయిలోనే ఉన్నందున పెరిగిన కరెంటు ఖాతా లోటు (క్యాడ్) అదే స్థాయిలో కొనసాగొచ్చు'' అని సర్వే వివరించింది.

జీడీపీకి ఢోకా లేదు..

దేశ జీడీపీ 2022–23లో 7 శాతం మేర ఉండొచ్చు. 2022–23లో నమోదైన 8.7 శాతం కంటే తక్కువ. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 6–6.8 శాతం మధ్య ఉండొచ్చు. అంతర్జాతీయంగా ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావం దీనిపై ఉంటుంది. కరోనా మహమ్మారి నుంచి ఆర్థిక వ్యవస్థ వేగంగా కోలుకుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అన్నది బలమైన డిమాండ్, మూలధన పెట్టుబడులు పుంజుకోవడంపై ఆధారపడి ఉంటుంది. ప్రైవేటు మూలధన నూతన చక్రం స్పష్టంగా కనిపిస్తోంది. కొనుగోలు శక్తి పరంగా భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. మారకం రేటు పరంగా ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రైవేటు వినియోగం పెరగడం, మూలధన పెట్టుబడులు అధికంగా ఉండడం, కార్పొరేట్ల బ్యాలన్స్ షీట్లు బలంగా మారడం, చిన్న వ్యాపార సంస్థలకు రుణ లభ్యత, వృద్ధికి మద్దతునిచ్చే అంశాలు. 2022–23 మొదటి ఎనిమిది నెలల్లో కేంద్ర సర్కారు మూలధన వ్యయాలు 63.4 శాతం పెరిగాయి. వృద్ధికి ఇది కూడా మద్దతునిచ్చే అంశం. దేశ ఆర్థిక వ్యవస్థ 2025–26 లేదా 2026–27 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు (రూ.410 లక్షల కోట్లు), 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు (రూ.574 లక్షల కోట్లు) చేరుకోవచ్చు. దీని ప్రకారం ఆర్థిక వృద్ధి విషయంలో ఈ దశాబ్దం భారత్‌దేనని ఆర్థిక సర్వే తేల్చిచెప్పింది.





ద్రవ్యోల్బణం/రూపాయి

ద్రవ్యోల్బణం రేటు 2022 ఏప్రిల్‌లో 7.8 శాతానికి పెరిగింది. ఆర్‌బీఐ గరిష్ఠ పరిమితి 6 శాతానికంటే ఎక్కువ. అయినప్పటికీ ప్రపంచంలో అతి తక్కువ ద్రవ్యోల్బణం దేశాల్లో భారత్ ఒకటి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనా 6.8 శాతం అన్నది గరిష్ఠ పరిమితి కంటే ఎక్కువ. కానీ వడ్డీ రేట్లు పెరుగుదల అన్నది ప్రైవేటు వినియోగాన్ని దెబ్బతీసేంత స్థాయిలో లేదు.



సర్వేను విడుదల చేస్తున్న నాగేశ్వరన్ తదితరులు

ఎగుమతులు: 2021–22లో దేశ ఎగుమతులు 422 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరినప్పటికీ.. తదనంతర పరిస్థితులు ఎగుమతుల వృద్ధికి అవరోధం కలిగిస్తున్నాయి. ఎగుమతి దేశాలను విస్తరించుకోవడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఈ బలహీనతను అధిగమించొచ్చు.

సమగ్ర రూపం



భారత వృద్ధి పథం, భారత్ పట్ల ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆశావాదం, మౌలిక రంగంపై దృష్టి, సాగులో వృద్ధి, పరిశ్రమలు, భవిష్యత్ రంగాలపై దృష్టిని ఆర్థిక సర్వే సమగ్రంగా తెలియజేసింది. – ప్రధాని మోదీ

కరెన్సీ, చమురుపైనే..

2025–26 లేదా 2026–27 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు మన ఆర్థిక వ్యవస్థ చేరుకోవచ్చు. 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కరెన్సీ మారకం రేట్లపైనే ఈ లక్ష్యాలను చేరుకోవడం ఆధారపడి ఉంటుంది. చమురు ధరలపై అంచనాలు ఇవ్వడం కష్టం. ఆర్‌బీఐ చెప్పినట్టు బ్యారెల్ 100 డాలర్లకు దిగువన ఉంటే, సర్వేలో పేర్కొన్న వృద్ధి గణాంకాలను చేరుకోవడం సాధ్యపడుతుంది. చమురు 100 డాలర్లకు దిగువన ఉన్నంత కాలం మన వృద్ధి లక్ష్యాలకు విఘాతం కలగదు. – అనంత నాగేశ్వరన్, ముఖ్య ఆర్థిక సలహాదారు

సర్వే ఇంకా ఏం చెప్పింది

- భారత్ ఇప్పటికే ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మార్చి నాటికి 3.5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుంది.
- భారత్‌కు చెందిన స్టార్టప్‌లకు సులభతర పన్నుల విధానం, ప్రక్రియలు అవసరం.
- పీఎం గతిశక్తి (మౌలిక సదుపాయలు విస్తరణకు ఉద్దేశించినది), నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ, పీఎల్‌ఐ ప్రోత్సాహకాలు ఆర్థిక వృద్ధిని బలోపేతం చేస్తాయి. అంతర్జాతీయంగా జీడీపీలో రవాణా వ్యయాలు 8 శాతంగా ఉంటే, మనదేశంలో 14–18 శాతం మధ్య ఉన్నాయి.
- దేశ ఫార్మాస్యూటికల్ మార్కెట్ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుంది. 2021 నాటికి 41 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2024 నాటికి 65 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కరోనా సంవత్సరం 2020–21లో ఈ రంగం 24 శాతం వృద్ధిని చూసింది.
- షిప్పింగ్ కార్పొరేషన్, ఎన్ఎండీసీ స్టీల్, బీఈఎంఎల్, హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్, కాంకర్, వైజాగ్ స్టీల్, ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుతం ప్రైవేటీకరణ దశలో ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చాలా వరకు వీటి ప్రైవేటీకరణ పూర్తవుతుంది.
- ఫిజికల్, డిజిటల్ సదుపాయాల సమన్వయం భారత భవిష్యత్‌ను నిర్ణయించనుంది. కొత్త సేవలకు డిజిటల్ మాధ్యమం విస్తరించినందున తగిన నియంత్రణలు అవసరం. ఆధార్, యూపీఐ తదితర విజయవంతమైన విధానాలను సర్వే ప్రస్తావించింది.
- 5జీ మొబైల్ సేవల విస్తరణతో నూతన ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. స్టార్టప్‌లు, మరిన్ని వ్యాపార ఆవిష్కరణలు ఊపందుకుంటాయి.
- భారత ఆర్థికాభివృద్ధి, ఇంధన భద్రతకు గ్రీన్ హైడ్రోజన్ కీలకంగా మారనుంది.

ఉపాధి కల్పన.. ఓకే

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడం, నిర్మాణ రంగ కార్యకలాపాలు పెరగడం ఉపాధి అవకాశాలను పెంచినట్టు ఆర్థిక సర్వే పేర్కొంది. కరోనా సమయంలో లాక్‌డౌన్‌లతో పట్టణాల నుంచి వలసపోయిన కార్మికులు తిరిగి వచ్చేలా చేశాయి. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా ఉపాధి అవకాశాల కల్పన జరుగుతోంది. పీఎం కిసాన్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన దేశంలో ఆహార భద్రతకు తోడ్పడుతున్నాయి. పట్టణాల్లో నిరుద్యోగం 7.2 శాతానికి తగ్గింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణాల వృద్ధి 2022 జనవరి–నవంబర్ మధ్య 30.6% ఉంది. దీనికి అత్యవసర రుణ హామీ పథకం తోడ్పడింది. దేశంలో 6 కోట్లకు పైగా ఎంఎస్ఎంఈలు ఉండగా, 12 కోట్ల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

ఈవీ విక్రయాలు @ కోటి..

2030 నాటికి ఏటా 1 కోటి విద్యుత్ వాహనాలు అమ్ముడవుతాయని ఎకనమిక్ సర్వే తెలిపింది. దీనితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 కోట్ల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగగలదని పేర్కొంది. 2022–2030 మధ్య ఈవీల మార్కెట్ వార్షికంగా 49 శాతం వృద్ధి చెందగలదని వివరించింది. పరిశ్రమ వర్గాల ప్రకారం 2022లో సుమారు 10 లక్షల విద్యుత్ వాహనాలు అమ్ముడయ్యాయి. వాహన విక్రయాలపరంగా డిసెంబర్‌లో జపాన్, జర్మనీలను అధిగమించి భారత్ మూడో స్థానానికి చేరింది.

ఆరోగ్యం.. మెరుగు

ప్రభుత్వం తీసుకున్న పలు చర్యల వల్ల ప్రతీ వ్యక్తి ఆరోగ్యం కోసం తన పాకెట్ నుంచి చేసే ఖర్చు 2013–14లో 64.2 శాతంగా ఉంటే, 2018–19 నాటికి 48.2 శాతానికి తగ్గింది. శిశు మరణాల రేటు కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2023 జనవరి 6 నాటికి 220 కోట్ల కరోనా టీకా డోస్‌లు ప్రజలకు ఇవ్వడం పూర్తయింది. 2023 జనవరి 4 నాటికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద 22 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు.

వ్యవసాయం.. సవాళ్లు

సాగు రంగం మెరుగైన పనితీరు చూపిస్తున్నప్పటికీ.. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటోంది. అలాగే, పెరిగిపోతున్న సాగు వ్యయాలు కూడా సవాలుగా మారాయి. సాగులో యంత్రాల వినియోగం తక్కువగా ఉండడం, తక్కువ ఉత్పాదకత సవాళ్లుగా ఉన్నాయి. కనుక ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గడిచిన ఆరు సంవత్సరాలుగా సాగు రంగం వార్షికంగా 4.6 శాతం చొప్పున వృద్ధి సాధించింది. కానీ, 2020–21లో 3.3 శాతం, 2021–22లో 3 శాతమే వృద్ధి చెందింది.

ప్రపంచ తయారీ కేంద్రంగా..

ప్రపంచ తయారీ కేంద్రంగా మారేందుకు భారత్ ముందు ప్రత్యేక అవకాశం ఉంది. కరోనా అనంతరం ఎదురైన సవాళ్ల నేపథ్యంలో విదేశీ కంపెనీలు తమ తయారీ, సరఫరా వ్యవస్థలను బలంగా మార్చుకోవాలని కోరుకుంటున్నాయి. ప్రస్తుతం దేశ జీడీపీలో తయారీ వాటా 15–16%గా ఉంటే, రానున్న సంవత్సరాల్లో 25%కి చేరుకుంటుంది. భారత్‌లో తయారీ 2.0 కోసం 27 రంగాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పీఎల్‌ఐ పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటికి 14 రంగాలకు పీఎల్‌ఐ పథకాలను ప్రకటించారు.

జాబ్ పాయింట్

తపాలా శాఖలో 40,889 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 40,889
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–2480, తెలంగాణ–1266.
- **పోస్టులు:** గ్రామీణ డాక్ సేవక్స్–బ్రాంచ్ పోస్టు మాస్టర్/అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్/డాక్ సేవక్.
- **సర్కిల్ వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–2480, అసోం–407, బీహార్–1461, ఛత్తీస్‌గఢ్–1593, ఢిల్లీ–46, గుజరాత్–2017, హర్యానా–354, హిమాచల్ ప్రదేశ్–603, జమ్మూ–కశ్మీర్–300, జార్ఖండ్–1590, కర్ణాటక–3036, కేరళ–2462, మధ్యప్రదేశ్–1841, మహారాష్ట్ర–2508, నార్త్ ఈస్టర్న్–923, ఒడిశా–1382, పంజాబ్–766, రాజస్థాన్–1684, తమిళనాడు–3167, తెలంగాణ–1266, ఉత్తరప్రదేశ్–7987, ఉత్తరాఖండ్–889, పశ్చిమ బెంగాల్–2127.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా ఉండాలి. అంటే ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదవడం తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం వచ్చి ఉండాలి.
- **వయసు:** 16.02.2023 నాటికి 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/డాక్ సేవక్ పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం నియామకాలు జరుగుతాయి. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్/ఈమెయిల్/పోస్టు ద్వారా అందుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
- **దరఖాస్తు సవరణ ప్రారంభతేది:**17.02.2023
- **దరఖాస్తు సవరణ చివరితేది:** 19.02.2023.
- **వెబ్‌సైట్:** www.indiapostgdsonline.gov.in

ఎన్ఎండీసీ లిమిటెడ్,హైదరాబాద్‌లో 42 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ లిమిటెడ్ వివిధ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి డిపార్ట్‌మెంట్/ఎక్స్‌టర్నల్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
- **పోస్టుల వివరాలు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఫైనాన్స్–అకౌంట్స్) ట్రైనీ–11, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(మెటీరియల్స్–పర్చేజ్)ట్రైనీ–16,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(పర్సనల్–అడ్మినిస్ట్రేషన్) ట్రైనీ–15.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ, సీఏ(ఇంటర్)/ఐసీడబ్ల్యూఏ–సీఎంఏ(ఇంటర్), బీఈ, బీటెక్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.37,000 నుంచి రూ.1,30,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2023
- **వెబ్‌సైట్:** www.nmdc.co.in

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, న్యూఢిల్లీలో 27 నాన్‌టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ వివిధ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 27
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్–01, సెక్షన్ ఆఫీసర్–01, వర్క్‌షాప్ సూపరింటెండెంట్–01, టెక్నికల్ అసిస్టెంట్(మోడల్స్)–01, టెక్నికల్ అసిస్టెంట్–01, పర్సనల్ అసిస్టెంట్–06, హిందీ ట్రాన్స్‌లేటర్–01, అసిస్టెంట్–02, స్టెనోగ్రాఫర్–01, ఎస్టేట్ సూపర్‌వైజర్–01, జూనియర్ లైబ్రరీ–ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–03, డ్రైవర్–01, ప్లంబర్–01, ఎలక్ట్రీషియన్–03, కార్పెంటర్–01, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01,మెకానిక్–01.
- **అర్హత:** పదో తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, 4, బ్లాక్–బి, ఇంద్రప్రస్థ ఎస్టేట్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 27.02.2023.
- **వెబ్‌సైట్:** www.spa.ac.in

స్టాఫ్ నర్స్ కొలువుకు పిలుపు

బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం (జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) అభ్యర్థులకు.. శుభవార్త! ఈ అర్హతలతో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్స్‌లుగా కొలువుదీరొచ్చు!! తెలంగాణ రాష్ట్ర మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ తాజాగా స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. స్టాఫ్ నర్స్ పోస్టుల వివరాలు, ఎంపిక విధానం, అర్హతలు తదితర వివరాలు..



» తెలంగాణలో 5,204 స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం
» ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» రాత పరీక్ష, సర్వీస్ అనుభవం ఆధారంగా ఎంపిక
» ప్రారంభ వేతన శ్రేణి రూ.36,570–రూ.1,06,990
» అకడమిక్ నైపుణ్యాలతో రాత పరీక్షలో విజయం

రాష్ట్రంలో వేల సంఖ్యలో అభ్యర్థులు నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసి.. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో నర్స్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారందరికీ ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే మార్గంగా తాజా నోటిఫికేషన్ నిలుస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే నర్సింగ్ కోర్సుల ఉత్తీర్ణులకు సుస్థిర భవిష్యత్తు ఖాయం అంటున్నారు నిపుణులు.

తొమ్మిది శాఖలు–5,204 పోస్టులు

తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా.. వైద్య, ఆరోగ్య శాఖ సహా మొత్తం తొమ్మిది శాఖల్లో 5,204 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు.. తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లోనూ అక్కడి విద్యార్థులకు వైద్య సేవలు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో వాటిలోనూ స్టాఫ్ నర్స్‌లను నియమించనున్నారు.

అర్హతలు

- బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం అండ్ మిడ్ వైఫరీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జూలై 1, 2022 నాటికి 18–44 ఏళ్లు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు).
- **వేతన శ్రేణి:** రూ.36,570–రూ.1,06, 990

ఎంపిక విధానం

- తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. నర్సింగ్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా.. రాత పరీక్ష, అప్పటికే అభ్యర్థులు పొందిన సర్వీస్(పని అనుభవం) ఆధారంగా తుది విజేతలను ఖరారు చేయనుంది.
- రాత పరీక్షను 80 మార్కులకు నిర్వహించనున్నారు.
- మరో 20 మార్కులకు అభ్యర్థుల పని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని.. గిరిజన ప్రాంతాల్లో ఆరు నెలల సర్వీస్‌కు 2.5 పాయింట్లు చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో ఆరు నెలల సర్వీస్‌కు 2 పాయింట్లు చొప్పున కేటాయిస్తారు. ఇలా.. ప్రతి ఆరు నెలల సర్వీస్‌కు పాయింట్లు కేటాయించే విధానంలో.. గరిష్ఠంగా 20 మార్కులను పని అనుభవానికి వెయిటేజీ కల్పిస్తారు.
- పని అనుభవం విషయంలో నిర్దిష్ట నిబంధనలను రూపొందించారు. అభ్యర్థులు ప్రభుత్వ ఆస్పత్రులు లేదా ఇన్‌స్టిట్యూట్స్, లేదా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి విభాగాల్లో.. కాంట్రాక్ట్ లేదా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తుండాలి. వారికే సర్వీస్ పాయింట్స్ వెయిటేజీ కల్పిస్తారు.
- అదే విధంగా సర్వీస్ అనుభవం పాయింట్లు పొందాలనుకునే వారు స్టాఫ్ నర్స్ హోదాలోనే విధులు నిర్వర్తించి ఉండాలి. దీంతోపాటు.. వారు పని చేసిన విభాగాల అధీకృత అధికారుల నుంచి సర్వీస్ సర్టిఫికెట్‌ను నిర్దేశిత నమూనాలో దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది.

రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో కీలకంగా నిలిచే రాత పరీక్షను 80 ప్రశ్నలతో 80 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా జరుగుతుంది.

అకడమిక్ నైపుణ్యాలు

80 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో విజయం సాధించడానికి అభ్యర్థులు అకడమిక్ నైపుణ్యాలపై పట్టు సాధించాలి. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ స్థాయిలో చదివిన అంశాలు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన విషయాలను అవలోకనం చేసుకోవాలి. వైద్య,ఆరోగ్య రంగాలకు సంబంధించి సమకాలీన పరిస్థితులపైనా అవగాహన పెంచుకోవాలి. వీటిని సబ్జెక్ట్ అంశాలతో సమ్మిళితం చేసుకుంటూ.. బేరీజు వేసుకుంటూ అభ్యసనం చేస్తే మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

ప్రశ్న పత్రాల సాధన

స్టాఫ్ నర్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. ప్రిపరేషన్‌లో భాగంగా ఇతర ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి సంస్థలు చేపట్టిన నియామక పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా ప్రశ్నల తీరుపై అవగాహన లభిస్తుంది.

ప్రిపరేషన్ ఇలా

- స్టాఫ్ నర్స్ పోస్టుల అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాల వివరాలు..
- అనాటమీ అండ్ ఫిజియాలజీ; మైక్రో బయాలజీ;సైకాలజీ;సోషియాలజీ; ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్; ప్రథమ చికిత్స(ఫస్ట్ ఎయిడ్); కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్; ఎన్విరాన్‌మెంటల్ హైజీన్; హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్; న్యూట్రిషన్, మెడికల్ సర్జికల్ నర్సింగ్–1; మెడికల్ సర్జికల్ నర్సింగ్–2, మెంటల్ హెల్త్ నర్సింగ్; చైల్డ్ హెల్త్ నర్సింగ్; మిడ్‌వైఫరీ అండ్ గైనకాలజికల్ నర్సింగ్; కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్–2; నర్సింగ్ ఎడ్యుకేషన్; నర్సింగ్ రీసెర్చ్; ప్రొఫెషనల్ ట్రెండ్స్ అండ్ అడ్జస్ట్‌మెంట్; నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వార్డ్ మేనేజ్‌మెంట్.
- ఈ అంశాలకు సంబంధించి నిర్వచనం మొదలు నిర్వహణ ప్రక్రియల వరకు అన్నింటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.
- కమ్యూనిటీ హెల్త్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశంలో ఆరోగ్య వ్యవస్థ, హెల్త్ ప్లానింగ్, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్, హెల్త్ ఏజెన్సీస్ వంటి అంశాలతో ఆయా విభాగాల్లో నర్స్‌ల పాత్ర గురించి తెలుసుకోవాలి.
- సర్జికల్ నర్సింగ్‌కు సంబంధించి శస్త్ర చికిత్స నిర్వహణ పద్ధతులు, నర్సింగ్ టెక్నిక్స్, రోగుల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలు వంటి అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.
- హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కు కూడా ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. రోగులతో వ్యవహరించాల్సిన విధానాలు, కౌన్సెలింగ్, హెల్త్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పద్ధతులపై అవగాహన పొందాలి.
- ఎన్విరాన్‌మెంటల్ హైజీన్.. ఇది కూడా పరీక్షలో కీలకంగా నిలిచే విభాగం అని చెప్పొచ్చు. పరిపుష్టమైన ఆరోగ్యానికి దోహదం చేసే పర్యావరణ అంశాలపై దృష్టి పెట్టాలి.
- అన్నిటికంటే ముఖ్యంగా నర్సింగ్‌లో ప్రాథమిక భావనలపై పూర్తి అవగాహనతో అడుగులు వేయాలి. రోగుల విషయంలో నర్సింగ్ కేర్ ప్రాధాన్యం, రోగుల పరిస్థితిని సమీక్షించడం, క్లినికల్ ఫార్మకాలజీ, థెరపటిక్ నర్సింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.
- సోషియాలజీకి సంబంధించి వ్యక్తులు, కుటుంబం, సమాజం, కమ్యూనిటీ అంశాలను అభ్యసనం చేయాలి.
- సైకాలజీకి సంబంధించి మానవ ప్రవర్తన శైలి/తత్వం, లెర్నింగ్, థింకింగ్, రీజనింగ్, అబ్జర్వేషన్, వ్యక్తిత్వం, ఇంటెలిజెన్స్ అంశాలపై అవగాహన ఉపయుక్తంగా ఉంటుంది.
- కోర్ అంశాలుగా భావించే అనాటమీ అండ్ ఫిజియాలజీ విషయంలో రక్త ప్రసరణ వ్యవస్థ, మానవ శరీర నిర్వహణ, రెస్పిరేటరీ సిస్టమ్, డైజెస్టివ్ సిస్టమ్, నెర్వస్ సిస్టమ్, సెన్స్ ఆర్గాన్, స్కెలిటెన్, కండరాల వ్యవస్థలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.
- మైక్రో బయాలజీకి సంబంధించి రోగ నిరోధకత, మైక్రోబ్స్ నియంత్రణ /నిర్మూలన, ఇన్‌ఫెక్షన్, మైక్రో ఆర్గానిజమ్స్‌పై దృష్టి పెట్టాలి.
- అదే విధంగా గైనకాలజికల్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని అంశాలను అభ్యసనం చేయాలి.
- ఇలా కోర్ అంశాలు మొదలు కమ్యూనిటీ హెల్త్ వంటి సమకాలీన అంశాల వరకు అన్నింటిపై పట్టు సాధిస్తే.. రాత పరీక్షలో విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

హెడ్ నర్స్, సూపరింటెండ్ స్థాయికి

స్టాఫ్ నర్స్‌గా కెరీర్ ప్రారంభించిన వారు.. భవిష్యత్తులో సర్వీస్ నియమావళిని అనుసరించి.. నర్స్ నుంచి సూపరింటెండ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత స్టాఫ్ నర్స్, ఆ తర్వాత హెడ్ నర్స్, క్లినికల్ నర్స్ స్పెషలిస్ట్, ఓటీ హెడ్ వంటి హోదాలు పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 25 – ఫిబ్రవరి 15
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in


ప్రకాశం జిల్లా పెద్దపీఆర్‌సీ తండాలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


శ్రీకాకుళం జిల్లా లఖందిడ్డిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

గడప గడపకూ మన ప్రభుత్వం


చిత్తూరు జిల్లా కావనూరులో వృద్ధునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి ఆర్కేరోజా


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా చవటపాలెంలో దివ్యాంగుడు రమణయ్యను పింఛను గురించి ఆరా తీస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

క్లుప్తంగా...

కృష్ణా బోర్డు చైర్మన్‌గా శివ్ నందన్‌కుమార్

సాక్షి, అమరావతి: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు చైర్మన్‌గా శివ్ నందన్‌కుమార్‌ను నియమిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ డైరెక్టర్ చందన్ ముఖర్జీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బోర్డు చైర్మన్‌గా ఉన్న ఎంపీ సింగ్ మంగళవారం పదవీ విరమణ చేశారు. దీంతో పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవోగా పనిచేస్తున్న శివ్ నందన్‌కుమార్‌కు కేంద్ర జల్‌శక్తి శాఖ పదోన్నతి కల్పించి.. కృష్ణా బోర్డు చైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది.

ఆర్టీపీపీలో పెరిగిన విద్యుత్ ఉత్పత్తి



ఎర్రగుంట్ల: వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల మండల పరిధిలో ఉన్న రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మంగళవారం భారీగా పెంచారు. ఆర్టీపీపీలోని 1,650 మెగావాట్లకు గాను 1,453 మెగావాట్లు ఉత్పత్తి ఉందని ఆర్టీపీపీ అధికారులు తెలిపారు. ఆర్టీపీపీలో నడుస్తున్న ఆరు యూనిట్ల ప్రకారం తీసుకుంటే.. 1వ యూనిట్‌లో 204/210, 2వ యూనిట్‌లో 180/210, 3వ యూనిట్‌లో 201/210, 4వ యూనిట్‌లో 208/210, 5వ యూనిట్‌లో 180/210, 6వ యూనిట్‌లో 480/600 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ఉన్నట్లు స్పష్టం చేశారు.

పోలవరం కేసు విచారణ నుంచి తప్పుకున్న సీజే

ఏజీగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి న్యాయ సలహా ఇచ్చానని వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు వ్యయం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు దాఖలు చేసిన పిటిషన్ విచారణ నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా తప్పుకున్నారు. తాను అడ్వొకేట్ జనరల్‌గా ఉన్న సమయంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి పోలవరంపై న్యాయ సలహా ఇచ్చానని, అందువల్ల ఈ వ్యాజ్యంపై తాను విచారణ జరపడం భావ్యం కాదని తెలిపారు. ఈ వ్యాజ్యాన్ని మరో ధర్మాసనం ముందుంచాలని రిజిస్ట్రీని మంగళవారం ఆదేశించారు. ప్రాజెక్టుకు 2014 ఏప్రిల్ 1 నాటి వ్యయాన్ని మాత్రమే చెల్లిస్తామన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనను రాజ్యాంగ విరుద్ధంగా, పునర్విభజన చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రకటించి, తక్షణమే రూ.3,800 కోట్లు విడుదల చేసేలా, అలాగే రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిన మొత్తాన్ని తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కేవీపీ రామచంద్రరావు 2017లో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

మైనారిటీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్ సేవలు వినియోగించుకోవాలి
- రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సంచాలకుడు కిషోర్ కుమార్

సాక్షి, అమరావతి: నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలతో భారీగా నిధులు వెచ్చించి మైనారిటీలకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తున్నదని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ జీసీ కిషోర్ కుమార్ అన్నారు. మైనారిటీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని వివరించారు. తాడేపల్లిలోని మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ విదేశీ విద్య దీవెన పథకంలో విదేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో అర్హులైన మైనారిటీ విద్యార్థులకు సీఎం వైఎస్ జగన్ త్వరలో మొదటి విడత డబ్బులు విడుదల చేయనున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలోని గ్రామ సచివాలయాలు కలెక్టరేట్‌ల మాదిరిగా పనిచేస్తున్నాయని, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఉపయోగించుకుని మైనారిటీ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖదీర్, సర్వే కమిషనర్ ఆఫ్ వక్ఫ్ షీరిన్ బేగం, దూదేకుల నూర్ బాషా ఫెడరేషన్ ఎండీ డాక్టర్ మొహమ్మద్ మస్తాన్, సీఈడీఎం డైరెక్టర్ మహ్మద్ మస్తాన్ వలీ, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుస్సేన్, జిల్లాల మైనారిటీ సంక్షేమ అధికారులు, యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లెలో కశ్మీరీ కుంకుమపువ్వు

- కృత్రిమ వాతావరణ పరిస్థితుల్లో ప్రయోగాత్మక సాగు
- తొలి ప్రయత్నంలోనే అధిక దిగుబడి సాధించిన శ్రీనిధి
- నాణ్యమైన కుంకుమపువ్వుకు ఆన్‌లైన్‌లో అనూహ్య స్పందన


ట్రేలలో సాగుచేసిన కుంకుమపువ్వు



సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కశ్మీరీ కుంకుమపువ్వు. వినడానికి ఇది ఒకింత ఆశ్చర్యంగా అనిపించినా... అక్షరాల ఇది వాస్తవం. కుంకుమ పువ్వు సాగు చేయాలంటే కశ్మీర్‌కు వెళ్లాల్సినవసరం లేదు. పండించాలన్న ఆసక్తి ఉంటే.. అక్కడి వాతావరణ పరిస్థితులను కృత్రిమంగా ఇక్కడ సృష్టించి సాగు చేయవచ్చు. అధిక దిగుబడులు సాధించవచ్చు. అలా ఎవరూ ఊహించని కశ్మీరీ కుంకుమపువ్వు సాగు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది వ్యవసాయ పట్టభద్రురాలు శ్రీనిధి.

కశ్మీర్ నుంచి విత్తనాలు తెచ్చి..

కుంకుమపువ్వు సాగు కోసం శ్రీనిధి కశ్మీర్‌కు వెళ్లి 300 కిలోల నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేశారు. అందులో 225 కిలోలను సాగుకు వినియోగించారు. ఏరోఫోనిక్ పద్ధతిలో సుమారు 30,000 ట్రేలలో విత్తనాలను ఉంచి ఇంట్లో ముందుగానే ఏర్పాటు చేసుకున్న కశ్మీర్ తరహా వాతావరణం కలిగిన గదిలో వాటిని ఉంచారు. 2022, ఆగస్టు 20వ తేదీన ప్రారంభించిన కుంకుమపువ్వు సాగు... నవంబర్ 20కి సరిగ్గా మూడు నెలలకు తుదిదశకు చేరుకుంది. 30,000 మొక్కల్లో దాదాపుగా 20,000 మొక్కలు అంటే ఏడు గ్రాములకు పైన ఉన్న విత్తనాలు మాత్రమే పువ్వు దశకు చేరుకున్నాయి. సాధారణంగా 150 పువ్వుల నుంచి ఒక గ్రాము కుంకుమపువ్వు దిగుబడి ఉంటుంది. మదనపల్లెలో శ్రీనిధి ప్రయోగాత్మకంగా చేసిన సాగులో కశ్మీర్‌లో సంప్రదాయక సాగు పద్ధతిలో వచ్చే దిగుబడితో సమానంగా తొలి ప్రయత్నంలోనే 200 గ్రాముల కల్తీలేని, నాణ్యమైన ఏ గ్రేడ్ కుంకుమపువ్వును పండించింది.

పునరుత్పత్తి ప్రక్రియ

నవంబర్ 20 తొలి పంట తుది దశకు చేరుకునే క్రమంలోనే మలి పంటకు సన్నాహాలను ప్రారంభించారు. కుంకుమపువ్వు తీసేసిన తర్వాత మొక్కలను అలాగే పునరుత్పత్తి ప్రక్రియకు వినియోగించి వాటి నుంచే విత్తనాన్ని తయారు చేసుకున్నారు. ఒక విత్తనం నుంచి 3–5 పిలకలు ఉత్పత్తి అయ్యాయి. ఈ సారి వర్టికల్ ఫాంలో ప్రత్యేకగదిలో సాయిల్ బెడ్స్(మురిగిన నల్లమట్టి, నున్నటి ఇసుక, కోకోపిట్, వర్మీకంపోస్టు, వరిపొట్టు) రూపంలో తయారు చేసుకుని మొక్కలను నాటారు. వీటితో పాటుగా ట్రయల్ రన్‌లో భాగంగా ఓపెన్ ఎయిర్‌లో కొన్ని మొక్కలు నాటి చూశారు. ప్రత్యేకగదిలో ఏర్పాటు చేసిన మొక్కలు ఆశించిన స్థాయిలో పెరుగుతుండగా, బయట వేసిన మొక్కలు తొందరగా వాడిపోయాయి. ప్రస్తుతం వేసిన రెండో పంట ఏప్రిల్‌కు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది నవంబర్‌కు ఒక టన్ను విత్తనం నుంచి రెండు కిలోల కుంకుమపువ్వు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 5,000 చదరపు అడుగుల స్థలంలో గదిని ఏర్పాటు చేస్తున్నారు.

మదనపల్లెకి ఉన్నతాధికారులు క్యూ

హార్టికల్చర్, టూరిజం, ఆచార్య ఎన్.జి.రంగా వర్సిటీ, కృషి విజ్ఞాన కేంద్రం, టీటీడీ తదితర విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు మదనపల్లెకు వచ్చి ప్రయోగాత్మక సాగును పరిశీలించారు. భవిష్యత్ పరిశోధనలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఆచార్య ఎన్.జి. రంగా వర్సిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల బాపట్లలో జనవరి 6, 7 తేదీల్లో జరిగిన 52వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుని కుంకుమపువ్వు సాగుపై వ్యవసాయ పరిశోధక విద్యార్థులకు శ్రీనిధి విశదీకరించింది.



ఆన్‌లైన్‌లో అమ్మకాలు..

కుంకుమపువ్వును అమ్మేందుకు వినూత్న పద్ధతిని అనుసరించింది. పర్పుల్ స్ప్రింగ్స్ పేరుతో బ్రాండ్ పేరును రిజిస్టర్ చేయించి ఆన్‌లైన్ వేదికగా అమ్మకాలను ప్రారంభించింది. గ్రాము రూ.600 చొప్పున విక్రయించి రూ.1,20,000 వరకు మొదటి ఆదాయాన్ని ఆర్జించింది. సామాజిక మాధ్యమాల వేదికగా యూట్యూబ్‌లో ఆమె ప్రారంభించిన పర్పుల్ స్ప్రింగ్స్ వెబ్‌సైట్‌కు మంచి ఆదరణ లభిస్తోంది.

యూనివర్సిటీల్లో పరిశోధనల్ని ప్రోత్సహించాలి


దక్షిణ భారత దేశ ఉపకులపతుల సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

- విశ్వవిద్యాలయాలు బోధనకే పరిమితం కారాదు
- దక్షిణ భారత వీసీల సదస్సులో గవర్నర్ విశ్వభూషణ్

సాక్షి, విశాఖపట్నం: విశ్వవిద్యాలయాలు బోధనలకు మాత్రమే పరిమితమవుతున్నాయని, పరిశోధనలకు దూరంగా ఉండటం బాధాకరమని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఏఐయూ) సహకారంతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశ ఉపకులపతుల సదస్సు -2023ని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో గవర్నర్ మంగళవారం ప్రారంభించారు. రెండురోజుల సదస్సులో తొలిరోజు 'రీసెర్చ్ అండ్ ఎక్సలెన్స్ ఫర్ ట్రాన్స్‌ఫర్మేటివ్ హయ్యర్ ఎడ్యుకేషన్' అంశంపై గవర్నర్ ప్రసంగించారు. ఉన్నతవిద్యలో పరిశోధనల్లో పూర్తిస్థాయిలో లక్ష్యాల్ని చేసుకోవాలని, అదేవిధంగా యూనివర్సిటీలు బోధనకే పరిమితం కాకూడదని సూచించారు. పరిశోధన రంగంవైపు విద్యార్థుల్ని ప్రోత్సహించాలని, ఇందుకనుగుణంగా రీసెర్చ్ రంగంలో పెట్టుబడుల్ని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచస్థాయి ర్యాంకింగ్‌లలో అత్యుత్తమ స్థానంలో భారతీయ విశ్వవిద్యాలయాలు స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్ కలిగిన దేశంగా భారత్ ఉందని నాస్కామ్ స్పష్టం చేసిందని, 2022 నాటికి దేశంలో 80 వేలకు పైగా స్టార్టప్ సంస్థలున్నాయని తెలిపారు. కోవిడ్ సమయంలో అమెరికా, చైనా, యూకే సహా 50 దేశాలకు మన దేశం మార్గదర్శిగా నిలవడాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నూతన విద్యావిధానంలో పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం కల్పించినట్లు తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ సాకారం చేసే దిశగా సమష్టిగా పనిచేయాలని ఆయన కోరారు. ఏయూ వీసీ ప్రొ.పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ స్వయం సమృద్ధి సాధించాలన్న ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షల్ని సాకారం చేసే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తోందని తెలిపారు. ఏఐయూ అధ్యక్షుడు ఆచార్య సురంజన్ దాస్ మాట్లాడుతూ దేశీయ పరిజ్ఞానాన్ని పరిరక్షించడంతో పాటు పరిశోధనలకు అనుగుణంగా ఉన్నతవిద్యని ఇంగ్లిష్‌తో పాటు స్థానిక భాషల్లో అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యని పటిష్టం చేసేందుకు గవర్నర్, ముఖ్యమంత్రి ఐదు లక్ష్యాల్ని ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా హయ్యర్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సదస్సులో తొలుత ఏఐయూ ప్రత్యేక సంచికని గవర్నర్ ఆవిష్కరించారు. ఈ సదస్సులో స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు రామ్మోహన్ రావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, 140 విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

'సీలేరు'కు సర్వం సిద్ధం

విశాఖ జిల్లా పార్వతీనగర్ వద్ద 1,350 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్ట్

- అనుమతులు రాగానే న్యాయ సమీక్ష.. అనంతరం టెండర్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందుచూపుతో చేపట్టిన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు అడ్డంకులు తొలగుతున్నాయి. విశాఖపట్నం జిల్లాలోని ఎగువ సీలేరు పార్వతీనగర్ వద్ద 1,350 మెగావాట్ల సామర్థ్యం గల భూగర్భ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఆర్థిక, పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే ఈ ప్రాజెక్టుకు టెండర్ల ప్రక్రియను చేపట్టనున్నట్లు ఏపీ జెన్‌కో వెల్లడించింది. ఇందులో భాగంగా పర్యావరణ అనుమతులకు అవసరమైన నివేదికను సిద్ధం చేసింది. అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది నివాసానికి అవసరమైన నివాసాలు, కార్యాలయాలు, షెడ్లను సిద్ధం చేస్తోంది. ఎగువ సీలేరు వద్ద ఉన్న గుంటవాడ రిజర్వాయర్ (ఎగువ) నుంచి 1.70 టీఎంసీల నీటిని వినియోగించడం ద్వారా పీక్ అవర్స్‌లో 1,350 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. అలాగే డొంకరాయి రిజర్వాయర్ (దిగువ) నుంచి 1.70 టీఎంసీల నీటిని గుంటవాడ రిజర్వాయర్‌కు ఆఫ్ పీక్ వేళల్లో పంపు చేయడం కూడా ఈ ప్రాజెక్ట్ ప్రాధాన్యతల్లో ఒకటి. ఆకస్మిక హెచ్చుతగ్గుల కారణంగా గ్రిడ్‌పై భారం పడి.. సమస్యలు తలెత్తకుండా స్థిరంగా ఉంచేందుకు ప్రాజెక్ట్ సహాయపడుతుంది. ఇందుకు గ్రిడ్‌లో ఉన్న మిగులు విద్యుత్‌ను ఉపయోగిస్తారు.

29 ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం..

రాష్ట్రంలో 29 ప్రాంతాల్లో 33,240 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీలను నెలకొల్పడానికి ప్రణాళిక సిద్ధమైంది. మరో 10 వేల మినీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రభుత్వం ఇటీవల గుర్తించింది. మొత్తంగా 43,240 మెగావాట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. వీటి కోసం వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని 1.45 లక్షల ఎకరాల భూమికి టెక్నో కమర్షియల్ ఫీజిబిలిటీ స్టడీస్ నిర్వహించింది. పెట్టుబడులు పెట్టేవారికి, పరికరాల తయారీ సౌకర్యాల ప్రాజెక్ట్ డెవలపర్లకు సుమారు 5 లక్షల ఎకరాలను లీజుకు ఇవ్వడానికి భూమిని సమకూరుస్తోంది. తొలి దశలో వైఎస్సార్ జిల్లా గండికోట, అనంతపురం జిల్లా చిత్రావతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సోమశిల, కర్నూలు జిల్లా అవుకు రిజర్వాయర్, విజయనగరం జిల్లా కురుకూటి, కర్రివలస, విశాఖపట్నం జిల్లా ఎర్రవరంలలో 6,600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం గల ఏడు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. పీఎస్‌పీల వల్ల రాష్ట్రానికి గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఛార్జీల కింద రూ.8,058 కోట్లు అందుతాయి. పన్ను రాబడి కింద రూ.1,956 కోట్ల మొత్తం సమకూరుతుంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 58,600 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

త్వరలోనే టెండర్లు..

సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయడానికి దాదాపు 410 హెక్టార్ల భూమి అవసరమవుతోంది. టోపోగ్రాఫికల్, హైడ్రోగ్రాఫిక్ సర్వేలు, జియోటెక్నికల్ పరిశోధనలు ఇప్పటికే పూర్తయ్యాయి. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) కూడా సిద్ధంగా ఉంది. ఆర్థిక, పర్యావరణ అనుమతులు రాగానే టెండర్ డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపిస్తాం. అక్కడి నుంచి క్లియరెన్స్ తీసుకుని టెండర్లు పిలిచి.. త్వరలోనే పనులు మొదలుపెడతాం.

–బి.శ్రీధర్, ఎండీ, ఏపీ జెన్‌కో

ఔషధ నియంత్రణ కార్యాలయాలు ప్రారంభం

గుంటూరు నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి విడదల రజిని


ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని తదితరులు

గుంటూరు (మెడికల్): ఇప్పటివరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖకు సొంత భవనాలు సమకూరాయి. గుంటూరులో రూ.1.30 కోట్లతో నిర్మించిన ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ ఉపసంచాలకుల కార్యాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన 12 ఔషధ నియంత్రణ కార్యాలయాలను అక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖకు రాష్ట్రవ్యాప్తంగా తొలిసారి 27 నూతన భవనాలు నిర్మిస్తున్నామని, తొలివిడతగా రూ.6.50 కోట్లతో నిర్మాణం పూర్తయిన 12 భవనాలను ప్రారంభించామని తెలిపారు. నకిలీ మందులు, కాలం చెల్లిన మందులు మార్కెట్‌లో లేకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జెడ్పీ చైర్మన్ కత్తెర హెని క్రిస్టినా, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఔషధ నియంత్రణ, పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ ఎస్.రవిశంకర్ నారాయణ్, డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఈసారైనా కేంద్రం కరుణించేనా!



సాక్షి, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన గాయాలతోపాటు కోవిడ్ మహమ్మారి విసిరిన సంక్షోభంతో రాష్ట్రం ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అయినా ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం కరుణ చూపుతుందని రాష్ట్ర ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంది. కోవిడ్‌తో రాష్ట్రం భారీగా ఆదాయం కోల్పోయింది. మరోవైపు ఉమ్మడి ఏపీ విభజన జరిగిన నాటి నుంచి రాష్ట్రం రెవెన్యూ లోటులోనే ఉంటోంది. ఈ నేపథ్యంలోనైనా బుధవారం కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో తగు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటోంది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న జాతీయ సంస్థలకు జాతీయ గ్రాంట్ల రూపంలో ఈసారైనా బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయిస్తుందని ఆశిస్తోంది. రాష్ట్ర విభజన జరిగిన 2014–15 ఆర్థిక ఏడాదిలో ఏర్పడ్డ రెవెన్యూ లోటు భర్తీకి ఈసారి బడ్జెట్‌లోనైనా పూర్తి స్థాయిలో కేంద్రం నిధులు కేటాయించాలని కోరుతోంది. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు అవుతున్నా విభజన జరిగిన ఆర్థిక ఏడాదిలో ఏర్పడిన రెవెన్యూ లోటును ఇంకా పూర్తి స్థాయిలో భర్తీచేయకపోవడం సరికాదని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రధాని మోదీని కలిసిన సందర్భంగా రెవెన్యూ లోటు భర్తీకి నిధుల మంజూరు చేయాలని కోరారని చెబుతున్నాయి. ఈ క్రమంలో ఈసారి బడ్జెట్‌లోనైనా ఫలితం ఉంటుందని ఆశిస్తున్నట్లు వెల్లడించాయి.

ప్రత్యేక అభివృద్ధి సాయంపై ఆశలు..

ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి సాయం కింద బడ్జెట్‌లో రూ.24,350 కోట్లు నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్రాన్ని కోరింది. అలాగే విశాఖకు మెట్రో రైలు మంజూరు చేయడంతోపాటు తగినన్ని నిధులు ఇవ్వాలని విన్నవించింది. ఇందుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కూడా సమర్పించింది. ఈ నేపథ్యంలో ఈ బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రకటనతో పాటు కేంద్రం నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది. అదేవిధంగా రాష్ట్రంలో కొత్తగా 13 జిల్లాలను ఏర్పాటు చేసినందున జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మిగిలిన 12 జిల్లాలకు వైద్య కళాశాలలకు నిధులు కేటాయించాలని కోరుతోంది. అలాగే రాజధాని వికేంద్రీకరణతో ఆ కార్యకలాపాలకు కూడా నిధులను ఆశిస్తోంది. ఇక పోలవరం ప్రాజెక్టుకు పెండింగ్ నిధులను ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది. అదేవిధంగా ప్రాజెక్టు సవరించిన అంచనాలను ఆమోదించాలని కోరుతోంది. ప్రత్యేక హోదాతోపాటు రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న మేరకు పారిశ్రామిక ప్రోత్సాహకాల కింద పదేళ్ల పాటు జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, ఆదాయపన్ను మినహాయింపు, 100 శాతం ఇన్సూరెన్స్ ప్రీమియం రీయింబర్స్‌మెంట్‌లను కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తోంది.

నయనానందకరం నృసింహుని కల్యాణం



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి అమలాపురం: పరమ పవిత్ర వశిష్ట నదీ తీరంలో నృశింహుని కల్యాణం నయనానందకరంగా జరిగింది. సముద్ర సంగమ ప్రాంతం అంతర్వేది పుణ్య క్షేత్రం పులకరించిపోయింది. అసంఖ్యాకంగా వచ్చిన భక్తులు నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల కల్యాణాన్ని తన్మయత్వంతో వీక్షించారు. కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం మంగళవారం రాత్రి 12.46 గంటలకు రోహిణీ నక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశంలో అంగరంగ వైభవంగా జరిగింది. వైష్ణవ సంప్రదాయబద్ధంగా వైఖానస ఆగమానుసారం ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకట శాస్త్రి పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణం జరిగినంత సేపూ మొగల్తూరుకు చెందిన ఆలయం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ శ్రీరాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్ చేతులు కట్టుకొని స్వామివారి చెంత నిలబడి భక్తిశ్రద్ధలతో కొలిచారు. టీటీడీ, అన్నవరం దేవస్థానం శ్రీస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించాయి. నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని చూసి భక్తులు మురిసిపోయారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పంచముఖ ఆంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై అర్చకులు శ్రీస్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మెడలో అవిష్కరించే గజమాల యాత్ర ఊరేగింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Amar Ujala Publications Limited, C-21-22, Sector -59, Noida, Gautam Buddhanagar, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd., 22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



తేరుపై వేణుగోపాలుడు

శిడ్లఘట్ట: శిడ్లఘట్ట పట్టణంలో ఉన్న చారిత్రక శ్రీ వేణుగోపాల స్వామి వారి బ్రహ్మ రథోత్సవం వేడుకలు మంగళవారం భక్తజనం మధ్య ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వి.మునియప్ప పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తేరు ఉత్సవాన్ని ప్రారంభించారు.

న్యూస్‌రీల్

6న బెంగళూరు, తుమకూరుకు ప్రధాని రాక

శివాజీనగర: ప్రధాని నరేంద్ర మోదీ ఫిబ్రవరి 6న బెంగళూరు, తుమకూరులో పర్యటించబోతున్నారు. ప్రధాని నెల రోజుల్లో పర్యటనకు రావడం ఇది మూడోసారి. 6న బెంగళూరు అంతర్జాతీయ ప్రదర్శన కేంద్రంలో భారత ఇంధన వారోత్సవాలను ఆయన ప్రారంభిస్తారు. ఆ తరువాత తుమకూరులోని గుబ్బి తాలూకా బిదరహళ్లి కావల్‌లో హెచ్‌ఏఎల్ హెలికాప్టర్ కర్మాగారాన్ని జాతికి అంకితం చేస్తారు. చిక్కనాయకహళ్లి, తిపటూరులో జల జీవన్ మిషన్ పథకాలకు కూడా మోదీ శంకుస్థాపన చేస్తారు. మరికొద్ది నెలల్లో ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అగ్రనేతల పర్యటనలు ఊపందుకున్నాయి. ప్రధాని పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

మహిళ కడుపులో రూ.7 కోట్ల కొకైన్

యశవంతపుర: రూ.ఏడు కోట్ల విలువ గల కొకైన్‌ను కలిగిన 58 క్యాప్సూల్స్‌ని బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జనవరి 14న ఆఫ్రికాకు చెందిన ఒక 40 ఏళ్ల మహిళ కడుపులో కొకైన్ గుళికలను పెట్టుకొని ఎమిరేట్స్ విమానంలో దిగింది. కస్టమ్స్ అధికారుల తనిఖీల్లో డ్రగ్స్ సంగతి బయటపడింది. ఆస్పత్రిలో ఆపరేషన్ చేసి గుళికలను వెలికితీశారు. ఆమెను అరెస్టు చేశారు. ఈ కొకైన్ విలువ రూ. 7 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

బంగారం వ్యాపారుల ఇళ్లలో ఐటీ సోదాలు

బనశంకరి: రాష్ట్ర రాజధానిలోని బంగారు వ్యాపారులకు ఐటీ అధికారులు షాక్ ఇచ్చారు. పన్నుల ఎగవేత ఆరోపణలపై బెంగళూరులో మంగళవారం 25 చోట్లకు పైగా బంగారు షాపులు, యజమానుల నివాసాలపై 300 మంది ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. జయనగర, యశవంతపుర, బసవనగుడి, చిక్కపేటేతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు సాగాయి. జయనగర బంగారం వ్యాపారి రాజేశ్‌కుమార్ జైన్ ఇంట్లో రికార్డులు పరిశీలించగా పన్ను వ్యత్యాసాలు కనిపించాయి. గొడవలు జరగకుండా భద్రత కోసం సీఏఆర్ సిబ్బంది వెంట వచ్చారు. శంకరపురం బంగారువ్యాపారి ఉత్తమ్‌జైన్ ఫ్లాటులో సోదాలు చేసి ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాత్రి వరకూ సోదాలు కొనసాగాయి.

కానుకల వర్షం కురిసేనా?



కేంద్ర ఆర్థికమంత్రి రాష్ట్రంపై వరాల జల్లు కురిపిస్తారని ఆశాభావం

- నేడే కేంద్ర బడ్జెట్
- ఎన్నికల ఏడాది కావడంతో రాష్ట్రానికి కేటాయింపులపై ఆశలు



ఎన్నికల కోసమైనా తాయిలాలు ఇవ్వాల్సి ఉంది

సాక్షి, బెంగళూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం బుధవారం కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో సమర్పించనుండగా, కన్నడనాడుకు భారీ కేటాయింపులు ఉంటాయని గంపెడాశలతో రాష్ట్రం ఎదురుచూస్తోంది. మే నెలలో రాష్ట్ర విధాన సభ ఎన్నికలు ఉండడంతో ఓటర్లను ఆకర్షించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు పథకాలను ప్రకటించే అవకాశముందని అంచనా.

ప్రధాని పర్యటనలతో లబ్ధి కలిగేనా

ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రానికి తరచూ వస్తుండడంతో ఈసారి ఎన్నికల నేపథ్యంలో భారీ నజరానాలు దక్కనున్నట్లు అంచనాలు ఏర్పడ్డాయి. ప్రధాని పర్యటనల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ గురించి పదేపదే ప్రస్తావిస్తున్నప్పటికీ కేంద్రం నుంచి కర్ణాటకకు ఏమి రావడం లేదని ప్రతిపక్షాలు ఎద్దేవా చేస్తున్నారు. ఇలాంటి సందర్భంలో వివిధ పథకాలు, ప్రాజెక్టులను ఈ సారి బడ్జెట్‌లో కన్నడిగులకు కేటాయించి ఓటర్లను ఆకట్టుకోవడంతో పాటు ప్రతిపక్షాల నోళ్లు మూయించే అవకాశముంది. లేని పక్షంలో మరింత జోరుగా విమర్శలు తప్పవు.

రాష్ట్రం నుంచి భారీగా ప్రతిపాదనలు

- ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఏయే పథకాలకు నిధులు కావాలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రతిపాదనలు పంపించింది.
- 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రానికి రావాల్సిన రూ. 5 వేల కోట్లను విడుదల చేయాలని కోరింది.
- భద్ర ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కూడా ప్రతిపాదనల్లో కోరింది. మేకెదాటు, మహదాయి ఎత్తినహోళె ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సత్వర అనుమతులు, నిధుల కేటాయింపులు జరుగుతాయని ఆశాభావంతో ఉంది.
- రాష్ట్రానికి పలు కొత్త రైళ్లు, రైల్వేప్రాజెక్టులను కేటాయించాలని, స్మార్ట్ సిటీ యోజన కింద మరిన్ని రాష్ట్రంలో నగరాలను చేర్చాలని కోరింది.
- వైద్య విజ్ఞాన సంస్థ అయిన ఎయిమ్స్‌ను మంజూరు చేయాలని కోరుతోంది.
- బెంగళూరు సబర్బన్ రైల్వేకు ఈసారి కేటాయింపులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాల్లో సస్పెన్స్ ఏర్పడింది.

బిళిగిరి అడవుల్లో కొత్త పక్షి జాతులు



మైసూరు: చామరాజనగర జిల్లాలోని బిళిగిరిరంగనాథ స్వామి పులుల అభయారణ్యం (బీఆర్‌టీ) లో రెండు కొత్త జాతి పక్షులను కనుగొన్నారు. ఎకో వాలంటీర్స్ గ్రూప్ ఆఫ్ ఇండియా సంస్థ సహకారంతో నిర్వహించిన పక్షుల అన్వేషణలో వీటిని గుర్తించారు. దాండేలి అడవుల్లో మాత్రమే కనిపించే ది గ్రేట్ హార్న్‌బిల్ అనే పక్షులు చాలా సంవత్సరాల తరువాత బీఆర్‌టీ అడవుల్లో దర్శనమిచ్చాయి. అవే కాకుండా నాదర్న్ షావెలర్, నాదర్న్ పిన్నెల్ పక్షులు కనిపించాయి. ఇక్కడ 11 సంవత్సరాల తరువాత పక్షుల సమీక్ష జరిపారు. మొత్తం 50 మంది స్వయం సహాయకులతో కూడిన 25 బృందాలు కెమెరాలు, బైనాక్యులర్లను ఉపయోగించి కొత్త రకం పక్షుల కోసం గాలించారు. 274 వైవిధ్య పక్షి జాతులు ఇక్కడ ఉన్నట్లు కనుగొన్నారు.

పార్కులో కూర్చుంటే జరిమానా

- పట్టపగలు ఓ పోలీస్ వసూళ్లపర్వం
- సోషల్ మీడియాలో బాధితురాలి ఆక్రోశం



సదరు పోలీస్, బైక్ ఫోటోను జత చేసి ట్వీట్ చేసిన బాధిత యువతి అర్ష లతీఫ్



వసూళ్లకు పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్

కృష్ణరాజపురం: మా సేవలు ఊరికే రావు. ప్రజలకు భద్రత కల్పించాలంటే.. చాలా ఖర్చవుతుంది అన్నట్టుగా ఉంది కొందరు ఖాకీల వ్యవహారశైలి. వారి వల్ల నిజాయతీగా పనిచేసేవారిని కూడా అనుమానంతో చూసే పరిస్థితి నెలకొంది. ఐటీ సిటీలో సంపిగెహళ్లి, ఆడుగోడి పోలీసులు ప్రజల నుంచి డబ్బు తీసుకోవడం రచ్చ కావడం మరిచిపోకముందే మరో సంఘటన చోటుచేసుకుంది. ఉద్యానవనంలో కూర్చుని ఉన్న స్నేహితులను ఓ కానిస్టేబుల్ బెదిరించి వారి వద్ద నుంచి రూ. 1000 వసూలు చేశాడు.

ఫొటోలు తీసి, డబ్బు ఇవ్వాలని..

వివరాలు.. జనవరి 29వ తేదీన నగరంలోని వైట్‌ఫీల్డ్ వద్ద కుందళహళ్లిలో ఉన్న ఉద్యానవనంలో అర్ష లతీఫ్ అనే యువతి, స్నేహితునితో కూర్చుని ఉంది. కులాసాగా మాట్లాడుకుంటూ ఉండగా ఒక కానిస్టేబుల్ వచ్చి వారిని తన మొబైల్‌తో ఫొటోలు తీయసాగాడు. ఇక్కడ పార్కులో ఏం చేస్తున్నారు?, ఇక్కడ ఉండడానికి అనుమతి లేదు అని వారిని గదమాయించాడు. తాము ఏమీ చేయడం లేదని, ఊరికే కూర్చుని ఉన్నామని చెప్పారు. పార్క్‌లో కూర్చోడానికి కూడా పర్మిషన్ కావాలా? అని యువతీ యువకుడు అడిగారు. దాంతో కానిస్టేబుల్.. ఏమిటీ రూల్స్ మాట్లాడుతున్నారు? రండి స్టేషన్‌కు వెళదాము, అక్కడ అన్నీ బయటకి వస్తాయని బెదిరించారు. ఇక్కడే అయితే రూ. వెయ్యి జరిమానా కట్టి వెళ్లిపోండి. స్టేషన్‌కు వస్తే మీకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించి, వారి వద్ద నుంచి రూ. వెయ్యి ఫోన్ పే ద్వారా వేయించుకున్నాడు. తరువాత తమ బాధాకర అనుభవం ఇదీ యువతి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ బాగోతంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సదరు పోలీస్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలకు గృహాల పంపిణీ

బనశంకరి: యలహంక నియోజకవర్గంలో గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో లక్ష బహుళ అంతస్తుల వసతి పథకం ద్వారా నిర్మించిన ఇళ్లను సీఎం బసవరాజ బొమ్మై మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు 15 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించి నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. కావాల్సింది రూ.15 వేలకోట్లు, కానీ కేటాయించింది రూ.3 వేల కోట్లు అని దుయ్యబట్టారు. అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను పక్కదారి పట్టించడం సాధ్యం కాదన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పై విమర్శలతో మండిపడ్డారు. తాము వచ్చిన తరువాత 492 ఎకరాలు భూమిని వేర్వేరు ప్రాంతాల్లో తీసుకుని మొదటి దశలో 5 వేల ఇళ్లు నిర్మించి అందిస్తున్నామని, దశలవారీగా 50 వేల ఇళ్లు ను అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వి.సోమణ్ణ, ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ పాల్గొన్నారు.



కొత్తగా నిర్మించిన గృహ వసతి సముదాయాలు

డీకే సీడీ నా వద్ద ఉంది

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ లఖన్ జార్కిహొళి

శివాజీనగర: బెళగావికి వచ్చినపుడు డీకే శివకుమార్ ఎక్కడ ప్యాంట్ విప్పుతున్నారు అనేది తెలుసు. నా ఆయన సీడీ ఉంది అని బెళగావికి చెందిన బీజేపీ మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి సోదరుడు, ఎమ్మెల్సీ లఖన్ జార్కిహొళి ఆరోపించారు. డీకేని రాజకీయంగా ఓడిస్తానని జార్కిహొళి సోమవారం ప్రకటించడం తెలిసిందే. ఈ తరుణంలో లఖన్ మంగళవారం ట్వీట్ చేస్తూ ఏకవచనంతో డీకేపై విమర్శలు గుప్పించారు. తన వద్ద ఆయన సీడీ ఉందని చెప్పారు. లఖన్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అయినా సొంత పార్టీ నేతపై విమర్శలు చేయడంతో ఆయన బీజేపీలోకి చేరతారనేది ఖాయమైంది.

డీకేపై సీఎంకు రమేశ్ ఫిర్యాదు

గతంలో తనపై సీడీ విడుదల చేసిన డీకే మీద విచారణ జరిపించాలని రమేశ్ జార్కిహొళి బెంగళూరులో సీఎం బొమ్మైని కలిసి ఫిర్యాదు చేశారు. సుదీర్ఘ లేఖను ఈ సందర్భంగా విడుదల చేశారు. సీడీలు ఉన్నాయంటూ నాయకులను, ఉన్నతాధికారులను బెదిరిస్తున్నారని చెప్పారు. దేవనహళ్ళి గస్తీలో ఇటువంటి సీడీలు లభించాయని తెలిపారు.

గనినగరిలో ట్రాఫిక్ టెర్రర్

- బెంగళూరును తలపిస్తున్న వాహన రద్దీ
- దుమ్ము, ధూళి, అస్తవ్యస్త రోడ్లతో చిక్కులు



రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద పై వంతెన లేక తరచూ ట్రాఫిక్ జాంలు



రద్దీ రోడ్లలో లెక్కకు మిక్కిలి వాహనాలు

సాక్షి,బళ్లారి: నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు తోడు విపరీతమైన వాహన రద్దీతో పాటు నగరంలోని రోడ్ల అభివృద్ధి పనులు జరుగుతుండటంతో నగరంలో ట్రాఫిక్ చిక్కులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. నగరంలోని రాయల్ సర్కిల్ వద్ద నూతనంగా టవర్ క్లాక్ ఏర్పాటు చేస్తుండటం వల్ల అక్కడ ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం ఏర్పడుతోంది. దుర్గమ్మ గుడి నుంచి మోకా రోడ్డు వరకు జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండటంతో ఈ రోడ్డు గుండా ట్రాఫిక్‌కు స్తంభించడం ఒక ఎత్తైతే, దుమ్ము, ధూళితో జనం నరకయాతన అనుభవిస్తున్నారు. సంగం సర్కిల్ నుంచి అనంతపురం రోడ్డులో రింగ్‌రోడ్డు వద్ద ఉన్న పెట్రోలు బంకు వరకు రోడ్డు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతుండడంతో ఈ రోడ్డులో కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రధాన రోడ్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాల్సింది పోయి నత్తనడకన చేస్తుండటం నగర ప్రజలకు శాపంగా మారింది.

ఎక్కడి వాహనాలు అక్కడే..

ట్రాఫిక్ సమస్యతో వాహనాలు ఎక్కడివక్కడే ఆగిపోతుండటంతో నగర ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రోడ్ల అభివృద్ధి పనులతో పాటు పెద్ద ఎత్తున బైక్‌లు, కార్లు పెరిగిపోవడం వల్ల రోడ్లన్ని వాహనాలతో నిండిపోతున్నాయి. బెంగళూరును తలపించేలా నగరంలో ట్రాఫిక్ సమస్య కనిపిస్తోంది. ముఖ్యంగా అనుమతి లేని పెద్ద పెద్ద వాహనాలను కూడా నగరంలోకి పోలీసులు యథేచ్ఛగా వదులుతున్నారు. రింగ్‌రోడ్డు గుండా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన వాహనాలను డబ్బులు తీసుకుని అనుమతి ఇస్తుండటంతో ఒక వైపు ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడమే గాకుండా మరో వైపు ప్రమాదాలకు దారి తీస్తున్నట్లు విమర్శలున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పటిష్ట చర్యలు చేపట్టాలని, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ధర్నా ఉధృతం

టీచర్లుగా పరిగణించాలని, వేతనాలు పెంచాలని తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు బెంగళూరులో ఫ్రీడంపార్క్ వద్ద మంగళవారం ధర్నా కొనసాగిస్తున్న దృశ్యం. వీరి ఆందోళన 9వ రోజుకు చేరింది. విధానసౌధను ముట్టడిస్తామని వారు హెచ్చరించడంతో భారీసంఖ్యలో పోలీసులను మోహరించిన దృశ్యం



ఏడాదిలో అయోధ్య రాముని ప్రాణప్రతిష్ఠ



గంగావతి రూరల్: ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అయోధ్య రామ మందిరంలో రాబోయే సంవత్సరానికల్లా రామ మూర్తి ప్రాణ ప్రతిష్ఠాపనను నెరవేరుస్తున్నట్లు అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ సమితి సభ్యులు పేజావర అధోక్షజ పీఠం అధిపతులు విశ్వేశతీర్థ స్వామీజీ అన్నారు. నగరంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండేళ్ల నుంచి రామ మందిర నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. రాబోవు సంవత్సరం సంక్రాంతికి పూర్తి స్థాయిలో రామ మూర్తికి ప్రాణ ప్రతిష్ఠాపన పనులు నెరవేరుస్తామన్నారు. ప్రస్తుతం దేవాలయ దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నారన్నారు.

గండకీ నది శిల: రాముని ప్రతిమ నిర్మాణానికి గండకీ నది నుంచి శాలి గ్రామ శిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. సంవత్సరంలోపు అత్యంత సుందరమైన, పవిత్రమైన ఏకశిలా మూర్తి సిద్ధమవుతుందని స్వామీజీ అన్నారు. ప్రస్తుతం 60 శాతం మందిర నిర్మాణ పనులు పూర్తయినట్లు తెలిపారు.

పోరాటంతోనే మహదాయికి మోక్షం:సీఎం

హుబ్లీ: మహదాయి, కళసా బండూరి పథకం అమలు కోసం గోవా ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో తనకు తెలియదని, న్యాయపరమైన పోరాటం ద్వారా వాటికి డీపీఆర్ లభించిందని సీఎం బసవరాజ్ బొమ్మై తెలిపారు. మంగళవారం హుబ్లీ విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకలో మహదాయి పథకానికి అనుమతి ఇస్తే న్యాయపరమైన పోరాటం చేస్తామని గోవా మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఆయన పైవిధంగా స్పందించారు. మహదాయి అమలు కోసం ఇప్పటికే న్యాయపరమైన పోరాటాన్ని సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ట్రిబ్యునల్ ఏర్పాటు అయిందన్నారు. పదేళ్ల పాటు వీటి గురించి అన్ని కోణాల్లో పరిశీలన చేశామన్నారు. ట్రిబ్యునల్ అంటే సుప్రీంకోర్టు ఆదేశం ఉన్నట్లేనని, దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. దశల వారీగా పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్సీ విశ్వనాథ్ వ్యాఖ్యలపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రధాని మోదీ మరోసారి ఫిబ్రవరి 6న రాష్ట్ర పర్యటనకు విచ్చేస్తారని, బెంగళూరు, తుమకూరు జిల్లాల్లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

యూట్యూబ్ చూసి చోరీల బాట



పట్టుబడిన నిందితులు వైష్ణవి, యువరాజు

హుబ్లీ: యూట్యూబ్ చూసి అందులో చోరీ చేయడం ఎలాగో తెలుసుకుని రూ.40 లక్షల చోరీకి పాల్పడిన ఘరానా జంటను ధార్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను వైష్ణవి, యువరాజులుగా గుర్తించారు. ధార్వాడలో కోర్టు సర్కిల్ వద్ద వీరేశ్వర కో–ఆపరేటివ్ సొసైటీలో కొత్త సంవత్సరం వేడుకల రోజున తొలి ప్రయత్నంగా చోరీకి పాల్పడి భారీగా నగదును దోచుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ధార్వాడ టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. రాష్ట్ర మంత్రి శశికళా జొల్లెకి చెందిన ఎక్సంబాదా సొసైటీకి చెందిన ధార్వాడ శాఖలో నిందితులు బంగారు ఆభరణాలతో పాటు నగదు మొత్తం కలిపి రూ.40 లక్షలు చోరీ చేశారు. నెల రోజుల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు.

లక్ష్మీ అరుణ అభ్యర్థిత్వంపై హర్షం

సాక్షి,బళ్లారి: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి కేఆర్‌పీపీ అభ్యర్థిగా గాలి లక్ష్మీ అరుణ పేరును ఆ పార్టీ వ్యవస్థాపకులు గాలి జనార్దనరెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గోనాల్ రాజశేఖరగౌడ, ఎస్టీ సెల్ జిల్లాధ్యక్షుడు ఉమారాజ్ ఆధ్వర్యంలో నగరంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని రాయల్ సర్కిల్, ఎస్పీ సర్కిల్, దుర్గమ్మ గుడి తదితర ప్రాంతాల్లో బైక్ ర్యాలీ చేపట్టి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేఆర్‌పీపీ నేత ఉమారాజ్ మాట్లాడుతూ తమ పార్టీ అధినేత బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా లక్ష్మీ అరుణ పేరు ప్రకటించడం సంతోషంగా ఉందని, ఆమె గెలుపు కోసం కృషి చేస్తామని, రేపటి నుంచి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

అమ్మా బైలెల్లినాము

బెళగావి జిల్లాలోని ప్రసిద్ధ సవదత్తి ఎల్లమ్మ జాతర ఆరంభమైంది. మంగళవారం సంప్రదాయ రీతిలో ఎద్దుల బండ్లలో వెళ్తున్న గ్రామీణులు. అమ్మవారిని బుట్టలో ఎత్తుకుని పాటలు పాడుతూ వెళ్లారు

